RNI Reg-No. 69176/96

# నేటి మనదేశమ్

తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Medchal Malkajgiri

CIRCULATED THROUGHOUT TELANGANA STATE


సంపుటి :31 సంచిక : 213 హైదరాబాద్ సంపాదకులు: కె.ఎస్.రంగశాయి: శనివారం 07-03-2026 పేజీలు : 12 వెల: 1-00

## బేగంపేట వాతావరణ శాఖ కార్యాలయానికి బాంబు బెదింపు

తనిఖీలు చేపట్టి ఫేక్ కాల్‌గా గుర్తింపు



**హైదరాబాద్, మార్చి 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఇటీవల విమానాశ్రయాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలకు 'ఫేక్ బాంబ్ బెదిరింపులు' రావడం మిగతా 2లో..



# ప్రజల మద్దతుతో పాలన సాగిస్తున్నాం

- మీ అందరి మద్దతుతోనే గెలిచాం
- మాటలు, మూటలతో గెలిచి రాలేదు
- మా వద్ద ఎలాంటి అక్రమ సంపాదనా లేదు
- వర్గీకరణ కోసం చేసిన పోరాటానికి మద్దుతగా నిలిచా
- మాదిగ ఎంప్లాయిస్ సమన్వయ కమిటీ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మార్చి 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** చిత్తశుద్ధితో ప్రజాసమస్యలు పరిష్కరిస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రజాపాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు. శుక్రవారం హైదరాబాద్ శిల్పకళావేదికలో మాదిగ ఎంప్లాయిస్ సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిలుగా సీఎం రేవంత్ రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఇప్పుడున్నది మీరంతా కోరుకున్న ప్రభుత్వమని తెలిపారు. ఇది మీరంతా కష్టపడి తెచ్చుకున్న ప్రభుత్వమని పేర్కొన్నారు. ఎన్నికల్లో మీరంతా తమకు అండగా నిలబడ్డారని గుర్తు చేశారు. మార్పు కోసమే ప్రజా ప్రభుత్వాన్ని మిగతా 2లో..

# సివిల్స్ ఫలితాలు విడుదల

సత్తా చాటిన తెలుగు అభ్యర్థులు... అనూజ్ అగ్నిహోత్రి ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్




**న్యూఢిల్లీ, మార్చి 6 (ఆర్ఎన్ఎ):** సివిల్స్ పరీక్ష ఫలితాలను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ శుక్రవారం విడుదల చేసింది. ఈ పరీక్షల్లో అనూజ్ అగ్నిహోత్రి ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్ సాధించారు. రాజేశ్వరి సువే రెండో స్థానంలో నిలిచారు. ఆకాన్ష్ ధుల్ మూడో ర్యాంక్ పొందారు. రాఘవ్ ఝున్‌ఝున్ వాలా నాలుగో ర్యాంక్ సాధించారు. ఈ పరీక్షల్లో తెలుగు రాష్ట్రాల్లోని అభ్యర్థులు సత్తా చాటారు. సృజన (55వ ర్యాంక్), డీఎస్‌కే ప్రచేత్ (193వ ర్యాంక్), ఎస్. వర్షిత్‌రెడ్డి (259వ ర్యాంక్), ఎం.పవన్‌కుమార్‌రెడ్డి (297వ ర్యాంక్), వి. విక్రమసింహారెడ్డి (541వ ర్యాంక్), గుమ్మల శ్వేత (573వ ర్యాంక్), పోతుపురెడ్డి భార్గవ్ (537వ ర్యాంక్), పుడారి రాహుల్ (748వ ర్యాంక్), కత్తిమాని అనిరుధ్ (786వ ర్యాంక్), కోరపాతుల శ్రీకర్‌రాజు (806వ ర్యాంక్), ఇస్లావత్ శ్రీరామ్ హర్ష (823 ర్యాంక్), కట్టా ప్రత్యూష (908వ ర్యాంక్), గోగుల రాజశేఖర్ (920వ ర్యాంక్), గుగులోతు జితేందర్ నాయక్ (939వ ర్యాంక్) సాధించారు. ఈ పరీక్షా ఫలితాలు విడుదలైన 15 రోజుల్లో వెబ్ సైట్‌లో మార్కులు అప్ లోడ్ చేస్తామని యూపీఎస్సీ ప్రకటించింది. మరిన్ని వివరాలు కోసం ఈ ఫోన్ నెంబర్లు.. 23385271, 23381125, 23098543 సంప్రదించాలని మిగతా 2లో..

# అసంపూర్తిగా అంబర్‌పేట ఫ్లై ఓవర్ సర్వీస్ రోడ్డు

వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోండి: సిఎం రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి లేఖ



**హైదరాబాద్, మార్చి 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అంబర్‌పేట ఫ్లై ఓవర్ కింద ఉన్న సర్వీస్ రోడ్డు నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి శుక్రవారం లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. తెలంగాణ ఆర్థికాభివృద్ధికి ఎంతో కీలకమైన జాతీయ రహదారుల నిర్మాణం విషయంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని వ్యాఖ్యానించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న రూ. 1.85 లక్షల కోట్ల విలువైన జాతీయ రహదారి ప్రాజెక్టుల కేటాయింపులు కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ అభివృద్ధి మీద ఉన్న ప్రత్యేక శ్రద్ధకు నిదర్శనమని పేర్కొన్నారు. 2014 నుంచి ఇప్పటి వరకు తెలంగాణలో 2,800 కిలోమీటర్ల పొడవైన జాతీయ రహదారుల నిర్మాణం జరిగిందని కిషన్‌రెడ్డి ప్రస్తావించారు. మరో 2,500 కిలోమీటర్ల పొడవైన జాతీయ రహదారుల నిర్మాణం వివిధ దశల్లో ఉన్నాయని వెల్లడించారు. తద్వారా తెలంగాణలో నూతనంగా ఏర్పాటైన జిల్లాలతో కలిపి మొత్తం 33 జిల్లాలు కూడా తక్కువ సమయంలోనే జాతీయ రహదారులతో అనుసంధానించామని.. ఇది చాలా గొప్ప విషయమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ రద్దీని, ప్రయాణ సమయాన్ని తగ్గించాలనే ఉద్దేశ్యంతో కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ రూ.265 కోట్ల వ్యయంతో ఎన్‌హెచ్163 మీద నగరంలోని అంబర్‌పేట క్రాస్ రోడ్డు వద్ద 1.5 కిలోమీటర్ల పొడవైన 4 వరుసల ఫ్లై ఓవర్‌ను నిర్మించిందని గుర్తుచేశారు. 5 మే, 2025 నాడు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఈ ఫ్లై ఓవర్‌ను ఘనంగా ప్రారంభించారని మిగతా 2లో..

# పశ్చిమాసియా యుద్ధంలో బాలలు బలి

200 మంది వరకు చనిపోయినట్లు యూనిసెఫ్ ప్రకటన

unicef

**న్యూఢిల్లీ, మార్చి 6 (ఆర్ఎన్ఎ):** అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ దాడులతో పశ్చిమాసియా దద్దరిల్లుతోంది. యుద్ధం కారణంగా ఎంతోమంది ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. వారిలో చిన్నారులు కూడా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. యుద్ధం మొదలైన నాటినుంచి దాదాపు 200 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయారని తాజాగా యునిసెఫ్ పేర్కొంది. ఇందులో అత్యధికంగా ఇరాన్‌లో 181 మంది మరణించినట్లు వెల్లడించింది. లెబనాన్‌లో (7), ఇజ్రాయెల్ (3), కువైట్(1)లో మృతి చెందినట్లు తెలిపింది. యుద్ధాలు పిల్లలు ప్రారంభించరు.. కానీ, మిగతా 2లో..

# టిటిడి పూర్తిస్థాయి ఇవోగా ముద్దాడ


బాధ్యతలు స్వీకరించిన రవిచంద్ర



**తిరుమల, మార్చి 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** టిటిడి పూర్తిస్థాయి ఇవోగా ముద్దాడ రవిచంద్ర తిరుమల వేంకటేశ్వరుడి ఆలయంలో శుక్రవారం ఉదయం 7.34 మిగతా 2లో..

# మూడు వారాల్లో క్యాతన్ పల్లి ఎన్నిక

ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం




**హైదరాబాద్, మార్చి 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక మూడు వారాల్లో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. క్యాతనపల్లి మున్సిపాలిటీ వివాదంపై శుక్రవారం హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ హైకోర్టు పై విధంగా ఆదేశించింది. మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం మంచిర్యాల జిల్లాలోని క్యాతనపల్లిలో పలు రాజకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక అర్ధంతరంగా నిలిచిపోయింది. ఇక బీఆర్ఎస్ పార్టీ నేత, మిగతా 2లో..

# 'చనిపోయిన' ఓటర్లను మీ ముందు నిలబెడతా

ఈసీపై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమత ఫైర్



**న్యూఢిల్లీ, మార్చి 6 (ఆర్ఎన్ఎ):** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)కు వ్యతిరేకంగా పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కోల్‌కతాలో ధర్నా చేపట్టారు. భాజపా, ఎన్నికల సంఘం కుమ్మక్కై నిర్వహిస్తోన్న నిశ్శబ్ద రిగ్గింగ్ ఈ సమగ్ర సవరణ అని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో తమ పార్టీని ఓడించాలనే కుట్రతోనే బెంగాల్లో హడావిడిగా సర్ ప్రక్రియ చేపట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బతికి ఉన్న అనేక మంది ఓటర్లను సవరించిన ఓటర్ల జాబితాలో చనిపోయినట్లుగా తప్పుడుగా ప్రకటించారని మమత అన్నారు. చనిపోయినట్లు ఈసీ ప్రకటించిన వారిని తీసుకు వచ్చి ఎన్నికల కమిషన్ అధికారుల ముందు నిలబెడతానన్నారు. ఓటరు జాబితా నుంచి బెంగాలీ ఓటర్లను తొలగించడానికి భాజపా ఎన్నికల కమిషన్‌ను పావులా వాడుకుంటోందని మమత ఆరోపించారు. వారి కుట్రను త్వరలోనే బయటపెడతానన్నారు. ఎన్నికలకు ముందు ఇటువంటి కుట్రలు చేయడం ఆ పార్టీకి అలవాటుగా మారిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 54 లక్షల మంది అర్హులైనవారి పేర్లను ఈసీ ఓటర్ల జాబితా నుంచి తొలగించిందని..దీనివల్ల అనేక మంది మైనారిటీ ఓటర్లు, వలస కార్మికులు నష్టపోయారన్నారు. ఏకపక్షంగా ఈ తొలగింపులు చోటుచేసుకున్నాయని, తమ స్థానికతను నిరూపించుకోవడానికి బెంగాల్ ప్రజలకు ఒక్క అవకాశమూ ఇవ్వలేదని విమర్శించారు.

# అసోంలో కూలిన సుఖోయ్ యుద్ధవిమానం

ఇద్దరు పైలట్లు దుర్మరణం.... ఒకరు ఆపరేషన్ సిందూర్ పైలట్ పూర్వేశ్ దురాగ్కర్



**న్యూఢిల్లీ, మార్చి 6 (ఆర్ఎన్ఎ):** అస్సాంలోని కర్బీ ఆంగ్లాంగ్‌లో భారత వైమానిక దళానికి చెందిన సుఖోయ్ జెట్ కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఇద్దరు పైలట్లు చనిపోగా.. వారిలో ఒకరైన ఫ్లైట్ లెఫ్టినెంట్ పూర్వేష్ దురాగ్కర్ ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్నట్లుగా సమాచారం. ఈ విషయాన్ని పూర్వేష్ తల్లిదండ్రులు మీడియాకు తెలిపారు. పూర్వేష్(28).. ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్నట్లు అతని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ముందుగా ఈ విషయం తమకు తెలియదని.. ఆపరేషన్ సిందూర్ ముగిసిన 15 రోజుల తరువాత తెలిసిందని పూర్వేష్ తండ్రి రవీంద్ర దురాగ్కర్ తెలిపారు. యుద్ధ సమయంలో పూర్వేష్ వద్ద ఫోన్ లేదని.. యుద్ధం ముగిసిన తరువాత పూర్వేష్ తమకు కాల్ చేసి విషయం చెప్పాడని రవీంద్ర తెలిపారు. అస్సాంలో ప్రమాదం జరగడానికి ఒక రోజు ముందు తన కొడుకుతో మాట్లాడినట్లు రవీంద్ర తెలిపారు. ఇంతలోనే ఇలా జరిగిందంటూ కన్నీరమున్నీరయ్యారు. తన కొడుకు భారత వైమానిక దళంలో భాగమైనందుకు చాలా గర్వంగా ఉందన్నారు. పూర్వేష్ ఎప్పుడు మాట్లాడినా యుద్ధ విమానాలను నడిపిన తన అనుభవాన్ని, ఐఏఎఫ్ జెట్‌ల వేగం గురించి ఎంతో ఆసక్తిగా చెబుతుండేవాడని.. తన సహోద్యోగులను ఎంతో గౌరవించేవాడని రవీంద్ర తెలిపారు. 'నా కొడుకు దేశ సేవలో తనను మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయిలు

## బేగంపేట వాతావరణ శాఖ కార్యాలయానికి బాంబు బెదింపు

ఎక్కువైంది. తాజాగా.. హైదరాబాద్‌లోని బేగంపేటలో బాంబు బెదిరింపు కలకలం రేపింది. వాతావరణ శాఖ కార్యాలయానికి వచ్చిన ఈ బెదిరింపుతో పోలీసులు అప్రమత్తం అయ్యారు. వెంటనే కార్యాలయంలో తనిఖీలు చేపట్టారు. అయితే బాంబు బెదిరింపుతో కార్యాలయంలోని సిబ్బంది, ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఈ కేంద్రానికి గుర్తుతెలియని వ్యక్తుల నుంచి బాంబు బెదిరింపు రావడంతో ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొంది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు రంగంలోకి దిగారు. డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్ బృందాలు కార్యాలయం అంతటా క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టాయి. నిత్యం వాతావరణ సమాచారంతో బిజీగా ఉండే అధికారులు, సిబ్బంది ఈ ఆకస్మిక పరిణామంతో తీవ్ర టెన్షన్‌లో ఉన్నారు. భద్రతా కారణాల దృష్ట్యా సిబ్బందిని కార్యాలయం బయటకు పంపినట్లు సమాచారం. ఇటీవల 'ఫేక్ బాంబ్ బెదిరింపులు' రావడం ఎక్కువైంది. ఇది కూడా అలాంటి ఆకతాయిల పని అయి ఉంటుందని ప్రాథమికంగా భావిస్తున్నప్పటికీ, పోలీసులు ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా తనిఖీలు కొనసాగిస్తున్నారు. ప్రజలు భయాందోళన చెందవద్దని, పోలీసులు పరిస్థితిని సమీక్షిస్తున్నారని అధికారులు తెలిపారు. నిందితులను గుర్తించేందుకు సైబర్ క్రైమ్ విభాగం కూడా రంగంలోకి దిగినట్లు సమాచారం.

## సివిల్స్ ఫలితాలు విడుదల

ఉత్తీర్ణులైన అభ్యర్థులకు సూచించింది. ఉదయం 10 నుంచి 05.00 గంటల మధ్య సంప్రదించాలని యూపీఎస్సీ స్పష్టం చేసింది. గతేడాది అంటే.. 2025లో ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షల్లో అర్హత సాధించిన వారికి ఆగస్ట్, సెప్టెంబర్‌లో మెయిన్స్ పరీక్షలు చేపట్టారు. వాటిలో అర్హత పొందిన వారికి ఈ ఏడాది ఫిబ్రవరిలో మౌఖిక పరీక్ష నిర్వహించారు. ఈ చివరి వడపోతలో మొత్తం 1087 మంది అభ్యర్థులు సివిల్స్ పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యారు. ఐఏఎస్, ఐఎఫ్ఎస్, ఐపీఎస్‌తో పాటు గ్రూప్ ఎ, గ్రూప్ బిలో వివిధ సెంట్రల్ సర్వీస్‌లో వీరంతా చేరనున్నారు.

## పశ్చిమాసియా యుద్ధంలో బాలలు బలి

మూల్యం మాత్రం చెల్లిస్తున్నారు అని వ్యాఖ్యానించింది. పశ్చిమాసియాలో సైనిక ఉద్రిక్తతలు ఇప్పటికే చిన్నారులపై ఆందోళనకర ప్రభావాన్ని చూపిందని పేర్కొంది. ఇదిలాఉండగా.. అమెరికా- ఇజ్రాయెల్ తొలిరోజు ఆపరేషన్‌లో ఇరాన్‌లోని మినాబ్‌లో ఉన్న ఓ బాలికల పాఠశాలపై దాడి జరిగిన సంగతి తెలిసిందే. ఈ దాడిలో 160 మందికి పైగా విద్యార్థినులు ప్రాణాలు కోల్పోయారని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ తెలిపింది. ఈ దాడిపై తాజాగా యూఎస్ దళాలు దర్యాప్తు ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు యూఎస్ అధికారులు పేర్కొన్నట్లు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి.

## టిటిడి పూర్తిస్థాయి ఇవోగా ముద్దాడ

గంటలకు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన టీటీడీ పాలక మండలి సభ్య కార్యదర్శిగా ప్రమాణ స్వీకారం చేశారు. టీటీడీ అదనపు ఈవో సి. హెచ్.వెంకయ్య చౌదరి వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. వేంకటేశ్వరుడిని దర్శించుకున్న అనంతరం ఈవో దంపతులకు రంగనాయకుల మండపంలో పండితులు వేదాశీర్వచనం అందించగా అదనపు ఈవో తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ గత నెల రోజులుగా తిరుమలలో చాలా విషయాలు నేర్చుకున్నానని తెలిపారు. తిరుమల యాత్రికులకు సాటి యాత్రికుడిగా సేవ చేస్తానని చెప్పారు. యాత్రికుల నుండి చాలా సలహాలు సూచనలు వచ్చాయని, వాటిని తానే స్వయంగా పరిశీలించి ఆ అనుభవంతో ప్రజలకు మంచి ఆధ్యాత్మిక అనుభూతి కలిగేలా ఏర్పాట్లు చేస్తామని తెలియజేశారు.

## మూడు వారాల్లో క్యాతన్ పల్లి ఎన్నిక

మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం ఆయనకు కోర్టు రిమాండ్ విధించింది. బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించగా.. ఇటీవల బెయిల్ మంజూరు అయింది. అనంతరం ఆయన జైలు నుంచి విడుదలయ్యారు. ఆ తర్వాత కేతనపల్లిలోని తన నివాసంలో బాల్క సుమన్ విలేకర్లతో మాట్లాడుతూ.. స్థానిక ఎంపీ వంశీ కృష్ణ, ఎమ్మెల్యే వివేక్‌పై తీవ్ర ఆరోపణలు గుప్పించారు. తనను జైల్లో తీవ్ర ఇబ్బందులకు గురి చేశారంటూ పోలీసులపై ఆయన మండిపడ్డారు. ఫిబ్రవరి 11వ తేదీన తెలంగాణలోని 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు పోలింగ్ నిర్వహించారు. ఫిబ్రవరి 14వ తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. అనంతరం మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు మేయర్లు, డిప్యూటీ మేయర్లు, చైర్మన్లు, వైస్ చైర్మన్ పదవుల ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అలాగే క్యాతనపల్లిలో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక వేళ.. ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. దీంతో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఆగిపోయింది. దీనిపై బీఆర్ఎస్ పార్టీ నేతలు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు పై విధంగా ఆదేశాలు జారీ చేసింది.

## అసోంలో కూలిన సుఖోయ్ యుద్ధవిమానం

తాను త్యాగం చేసుకున్నాడు. పూర్వేష్ తన కలను నెరవేర్చుకున్నాడు. కానీ, తను కోరుకున్నంతగా దేశానికి సేవ చేయలేకపోయాడు. కేవలం 4 సంవత్సరాలు మాత్రమే పని చేశాడు. పది రోజుల క్రితం మా ఇంటికి వచ్చాడు. తిరిగి విధుల్లోకి చేరిన తరువాత ఇలా జరిగింది.' అంటూ రవీంద్ర విలపించారు. ఫ్లైట్ లెఫ్టినెంట్ పూర్వేష్, స్క్వాడ్రన్ లీడర్ అనుజ్ శిక్షణా మిషన్‌లో ఉన్నారు. జోర్హాట్ వైమానిక స్థావరం నుండి వీరి జెట్ టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కనిపించకుండా పోయింది. సాయంత్రం 7:42 గంటలకు సుఖోయ్‌తో కమ్యూనికేషన్ కోల్పోయినట్లు తెలిపిన అధికారులు.. జోర్హాట్ వైమానిక స్థావరం నుంచి 60 కిలోమీటర్ల దూరంలో కూలిపోయినట్లు గుర్తించారు. ఈ ప్రమాదంలో ఇద్దరూ ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు వెల్లడించారు. పాకిస్థాన్ కేంద్రంగా పని చేస్తున్న ఉగ్రవాద సంస్థ లష్కర్ ఈ తోయిబాలో భాగమైన రెసిస్టెన్స్ ఫ్రంట్ ఏప్రిల్ 22న పహల్గామ్‌లోని జరిగిన ఉగ్రదాడికి ప్రతిస్పందనగా భారతదేశం మే 7వ తేదీన ఆపరేషన్ సిందూర్‌ను ప్రారంభించిన విషయం తెలిసిందే భారత భద్రతా దళాలు పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్(పీఓకే)లో ఉగ్రవాద శిబిరాలపై దాడి చేసింది.

# ప్రజల మద్దతుతో పాలన సాగిస్తున్నాం

(మొదటి పేజీ తరువాయి)



తెచ్చుకున్నారని వివరించారు. తమది పేదల పక్షపాత ప్రభుత్వమని సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. గత పాలకులు ఎన్నో అక్రమాలు చేశారని సీఎం రేవంత్ విమర్శించారు. గత ఎన్నికల్లో తాము మాటలు, మూటలతో గెలవలేదని కుండబద్దలు కొట్టారు. కేవలం ప్రజల మద్దతుతోనే తాము అధికారంలోకి వచ్చామని చెప్పారు. తమ వద్ద ఎలాంటి అక్రమ సంపాదన లేదన్నారు. వర్గీకరణ కోసం మాదిగ జాతి ఎంతో పోరాడిందని ఈ సందర్భంగా సీఎం రేవంత్ గుర్తు చేశారు. ఈ పోరాటంలో కొందరు ప్రాణాలు కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 20 ఏళ్ల నుంచీ వర్గీకరణ సమస్య ఉందన్నారు. మీ న్యాయమైన హక్కు కోసం మొదటి నుంచీ మద్దతుగా ఉన్నానని తెలిపారు. వర్గీకరణ కోసం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి సైతం పంపామని వివరించారు. మిత్రుడి కోసం కొన ఊపిరి వరకు కర్ణుడు నిలబడ్డాడని చెప్పారు. కర్ణుడి మాదిరిగా మిత్రధర్మానికి కట్టుబడి మాదిగల వెంట నిలబడ్డామని సీఎం రేవంత్ పేర్కొన్నారు. వర్గీకరణ అంశంలో మాదిగల వైపు న్యాయం ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అందుకే ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా మీవైపే నిలబడ్డామని ఆయన స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల తర్వాత.. వర్గీకరణ కోసం ప్రకటన చేసిన తొలి రాష్ట్రం తెలంగాణనేనని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తమ ప్రభుత్వానికి బ్రాండ్ అంబాసిడర్లు ప్రభుత్వ ఉద్యోగులేనని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాతే అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చామన్నారు. ప్రగతి ప్రణాళికలో జాగ్రత్తగా వ్యవహరించాలని ఉద్యోగులకు సీఎం రేవంత్ హితవు పలికారు. తెలంగాణలో ఆర్థిక సమస్యలు ఉన్నాయని గుర్తు చేశారు. ప్రభుత్వం వద్ద పంచడానికి భూములు లేవన్నారు. ప్రభుత్వ ఆర్థిక వెసులుబాటు అంతంత మాత్రంగానే ఉందని తెలంగాణ సీఎం తెలిపారు. మాదిగలకు మెరుగైన విద్య అందించాలన్నదే తమ ఆలోచన అని పేర్కొన్నారు. ప్రక్షాళన చేసేందుకే విద్యాశాఖను తన వద్ద పెట్టుకున్నానని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బర్రెలు, గొర్రెలు, చేపలు ఇచ్చిందని గుర్తు చేశారు. ఇవన్నీ మనకు తెలియవా?.. వీళ్లు కొత్తగా ఇచ్చిందేంటి? అంటూ బీఆర్ఎస్ నేతలపై సీఎం రేవంత్ మండిపడ్డారు. మనం బర్రెలు, గొర్రెలు కాచుకోవాలా?.. వాళ్ల పిల్లలు రాజ్యం ఏలుతారా? అంటూ ఆ పార్టీ నేతలను సీఎం రేవంత్ సూటిగా ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కడియం శ్రీహరి, ఎంపి కడియం కావ్య, దామోదర రాజనర్సింహ తదితరులు పాల్గొన్నారు.

# అసంపూర్తిగా అంబర్‌పేట ఫ్లై ఓవర్ సర్వీస్ రోడ్డు

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో తనతోపాటుగా తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా పాల్గొన్నారని కిషన్‌రెడ్డి గుర్తుచేశారు. ఈ ఫ్లై ఓవర్‌కు అవసరమైన భూసేకరణ పూర్తి కాలేదని అన్నారు. దీని నిర్మాణం జరిగి, ప్రారంభోత్సవం కూడా పూర్తి చేసుకున్నప్పటికీ దీని కింద ఉన్న సర్వీస్ రోడ్డు నిర్మాణం మాత్రం పూర్తిస్థాయిలో జరగలేదని తెలిపారు. భూసేకరణ విషయంలో కొన్ని శక్తులు అడ్డుతగులుతోండటంతో అనవసరంగా తీవ్ర జాప్యం జరుగుతోందని చెప్పుకొచ్చారు. ఇది 2018లో మంజూరయినప్పటికీ లేని సమస్యలు సృష్టించి భూసేకరణ పూర్తి కాకుండా కుట్రలు చేసి సర్వీస్ రోడ్డు నిర్మాణం పూర్తిస్థాయిలో జరగనివ్వకపోవడంతో ఈ రహదారి వెంట ప్రయాణించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని అప్పటి సీఎం కె. చంద్రశేఖరరావు, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డికి అనేకసార్లు తెలియజేశానని కిషన్‌రెడ్డి గుర్తుచేశారు. తెలంగాణ మంత్రులకు స్వయంగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కూడా అనేకసార్లు తెలియజేశారని అన్నారు. జీహెచ్ఎంసీ కమిషనర్, ఇతర సంబంధిత అధికారుల దృష్టికి తాను కూడా ఈ విషయాన్ని తీసుకెళ్లి అనేకసార్లు మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేసినప్పటికీ, ఈ సమస్య ఓ కొలిక్కి రాలేదని చెప్పుకొచ్చారు. భూసేకరణకు సంబంధించిన భూమికి రూ. 2.54 కోట్ల పరిహారం లబ్దిదారులకు ప్రభుత్వం చెల్లించినప్పటికీ మధ్య దళారులు అడ్డుకుంటున్నారని అన్నారు. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యక్తిగతంగా చొరవ చూపించి, సర్వీసు రోడ్డు నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి సంబంధిత జీహెచ్ఎంసీ, రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ అధికారుల ద్వారా తగిన చర్యలు తీసుకొని సర్వీస్ రోడ్డును పూర్తిస్థాయిలో నిర్మించటానికి సహకరించాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కోరారు.

# ప్రజలను ఏమార్చే పాలన... రెండేళ్లుగా అదే చేస్తున్నారు

**మరోమారు ప్రజలను మోసం చేసే యత్నం... గతంలో ఇచ్చిన దరఖాస్తులకే దిక్కులేదు... 99 రోజుల ప్రజాపాలనపై మండిపడ్డ హరీష్ రావు**



**హైదరాబాద్, మార్చి 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** గతంలో రెండుసార్లు నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభల్లో ప్రజల నుంచి తీసుకున్న లక్షలాది దరఖాస్తులు పరిష్కారం కాక ఇంకా చెత్తబుట్టల్లోనే మగ్గుతున్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ దరఖాస్తులకు దిక్కు లేదు కానీ, మళ్లీ ఇప్పుడు పది వారాల పాటు పది రకాల నాటకాలతో ప్రజలను మోసం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధం కావడం సిగ్గు చేటని అన్నారు. రెండున్నరేండ్లలో అసలు ఏం చేసారని ప్రచారం నిర్వహిస్తున్నారు. రేవంత్ రెడ్డి గ్రామ సభలు, వార్డు సభలు నిర్వహించి మీ పైఫల్యాలు ప్రచారం చెప్పుకుంటారా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన ప్రజా పాలన- ప్రగతి ప్రణాళికపై హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. యాక్షన్ ప్లాన్ పేరిట పాలనా వైఫల్యం నుంచి దృష్టి మరల్చేందుకు డైవర్షన్ ప్లాన్ డ్రామాకు తెర తీశారని ధ్వజమెత్తారు. ప్రచార కోసమేనని, ప్రజలకు ఒరిగేదేమి లేదని అన్నారు. 800 రోజుల పాలనలో చేసిందేం లేక, 99 రోజు ప్రణాళిక పేరిట రేవంత్ రెడ్డి మరో డ్రామాకు తెరతీసిండని ఆరోపించారు.రెండున్నరేండ్ల పాలన తర్వాత ప్రగతి ప్రణాళికలు గుర్తుకు వచ్చాయా?అంటూ నిలదీశారు.అమలుకు నోచుకోని ఆరు గ్యారెంటీలు, పాలన వైఫల్యాలు, కోట్లు కొల్లగొట్టేందుకు చేసిన స్కాంలు, ప్రజల ఛీత్కారాల నుంచి దృష్టి మరల్చేందుకు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మరో డైవర్షన్ ఎ÷-లాన్ అని విమర్శించారు. కోతల సమయం వచ్చినా ఈ సీజన్ ఇప్పటి వరకు రైతు భరోసా దిక్కు లేదు.గత సీజన్ పంట బోనస్ ఇవ్వక చేతులెత్తేసారు. చివరకు యూరియా కూడా సరఫరా చేయలేక రైతులను నడిరోడ్డు మీదకు ఈడ్చారు.నమ్మించి గొంతు కోసిన ఈ మోసాల గురించి రైతులకు వివరిస్తారా? చెప్పాలని డిమాండ్ చేశారు. మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు అని ఊదరగొట్టి, అధికారంలోకి వచ్చాక యువతను మోసం చేశారు. జాబ్ క్యాలెండర్ జాబ్ లెస్ క్యాలెండర్ చేశారు. నోటిఫికేషన్లు ఇవ్వకుండా మూసీ బ్యుటిఫికేషన్ పేరిట లూటీకి తెగబడ్డారు. రాజీవ్ యువ వికాసం పేరిట తీసుకున్న దరఖాస్తులు దిక్కు లేకుండా పోయాయని హరీశ్‌రావు విమర్శించారు. యువతకు నైపుణ్య శిక్షణ కార్యక్రమం అంటూ కొత్త పాట పాడుతున్నారని దుయ్యబట్టారు .అందని గ్యారెంటీల కోసం ఎదురుచూస్తున్న లక్షల మంది బాధితుల సంగతేంటో చెప్పాలని,సోలార్ విద్యుత్, పర్యావరణం, డ్రగ్స్ అడ్డుకట్ట లాంటివన్నీ పత్రికల్లో పబ్లిసిటీ ఇచ్చుకునేందుకు పెట్టుకున్న పేర్లు తప్ప, ఇందులో ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని ఆరోపించారు.పాలన గాలికి వదిలి పబ్లిసిటీ పేరిట చేస్తున్న మీ గారడీలను ప్రజలు గమనిస్తున్నారని, దుర్మార్గ పాలనను నిలదీసేందుకు గ్రామ గ్రామాన ప్రజలు సిద్దంగా ఉన్నారని హెచ్చరించారు

## సివిల్స్‌లో మెరిసిన ఉమ్మడి వరంగల్ యువత

**పలు ర్యాంకులు కొట్టేసిన విద్యార్థులు**

**వరంగల్, మార్చి 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కష్టపడితే ఏదైనా సాధించవచ్చని ఉమ్మడి వరంగల్ జిల్లా యువకులు నిరూపించారు. దేశంలోనే అత్యున్నత సర్వీస్ అయిన యూపీఎస్సీ ఫలితాల్లో ర్యాంకులు పొందారు. చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయి పుట్టెడు దుఃఖాన్నిగుండెల్లో దాచుకొని నానమ్మ పారిశుద్ధ్య కష్టాన్ని కండ్లారా చూసి ఎదిగిన ములుగు జిల్లా ఏటూరునాగారం మండలానికి చెందిన దైనంపల్లి ప్రవీణ్ తన కృషి, పట్టుదలతో సివిల్స్ ఫలితాల్లో 793వ ర్యాంక్ సాధించి ములుగు జిల్లాకు గర్వకారణంగా నిలిచారు. గ్రూప్-1 పరీక్షల్లో 105వ ర్యాంక్ సాధించి డీఎస్పీగా ఎంపికైన ప్రవీణ్, డీఎస్పీ శిక్షణ పొందుతూనే తాజాగా విడుదలైన యూపీఎస్సీలో ర్యాంక్‌ను సాధించి అందరికి ఆదర్శంగా నిలిచాడు. హనుమకొండ జిల్లా న్యాశాయంపేటకు చెందిన గుండు అఖిలేష్ ఆల్ ఇండియా సర్వీస్ ఐపీఎస్ 464 ర్యాంకును సాధించి ప్రతిభను చాటాడు. అఖిలేష్ తండ్రి భూపాలపల్లిలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ విధులు నిర్వహిస్తున్నారు. తల్లి సరస్వతి గృహిణిగా ఇంటి బాధ్యతలను నిర్వహిస్తోంది.అఖిలేష్ 2013లో హనుమకొండ హంటర్ రోడ్డులోని వరంగల్ పబ్లిక్ స్కూల్లో పదో తరగతిలో ఉత్తమ ర్యాంకును సాధించాడు.అఖిలేష్ యూపీఎస్సీలో విజయం సాధించడం పట్ల తల్లిండ్రులు, స్థానికులు హర్షం వెలిబుచ్చారు. కాజీపేట పట్టణం 61 వ డివిజన్ ప్రశాంత్ నగర్ ఫేస్ 3లో నివాసం ఉంటున్న అట్ల తరుణ్ తేజ యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఫలితాలలో 123వ ర్యాంకుతో సత్తా చాటారు. కుమారుడు సివిల్ సర్వీస్‌లో మెరుగైన ర్యాంక్ సాధించడం పట్ల తల్లిదండ్రులు అట్ల రవీందర్- అమరావతి సంతోషం వ్యక్తం చేశారు.

## మహిళను వేధించిన కేసులో 18నెలల జైలు

**ఖమ్మం, మార్చి 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మహిళను వేధించిన కేసులో దోషిగా తేలిన వ్యక్తికి న్యాయస్థానం 18 నెలల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధించింది. కేసు వివరాలు ఇలావున్నాయి.. 2019లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు 24 ఏరియాకు చెందిన ఏర్పుల కృష్ణ ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటూ జీవిస్తున్నాడు. అదే ఏరియాలో ఉన్న ఓ మహిళను తరచూ వేధింపులకు గురి చేయడంతో ఆ మహిళ ఇల్లెందు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేసి నివేదికను కోర్టుకు సరెండర్ చేశారు. విచారణలో కృష్ణ దోషిగా తేలడంతో జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు జడ్జి డి.చంద్రిక రెడ్డి తీర్పు వెలువరించారు. ఈ కేసులో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నర్సింగు అనిల్ కుమార్ ప్రాసిక్యూషన్ తరపున వాదించగా, సిడిఓ సురేశ్, రాఘవయ్య, హెచ్ సి అనంత రాములు సహకరించారు.

## తిరుమలలో బర్త్‌డే సెలబ్రేషన్స్

**దివ్వెల మాధురి, తనూజలపై చర్యకు టిటిడి ఆదేశం**

**తిరుమల, మార్చి 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుమలలో నిబంధనలకు విరుద్ధంగా పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్న దివ్వెల మాధురి, బిగ్ బాస్ ఫేమ్ తనూజ పుట్టస్వామిలపై చర్యలకు తిరుమల తిరుపతి దేవస్థానం సిద్ధమైంది. ఈ వ్యవహారంపై విజిలెన్స్ పోలీసులకు టీటీడీ ఫిర్యాదు చేసింది. తిరుమలలో ఈ తరహా వేడుకలు పూర్తిగా నిషేధమని టీటీడీ ఈ సందర్భంగా పేర్కొంది. ఈ పుట్టిన రోజు వేడుకలను చిత్రీకరించి.. వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంపై అభ్యంతరం తెలిపింది. టీటీడీ ఇచ్చిన ఫిర్యాదుపై విజిలెన్స్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## శ్రీవారిని దర్శించుకున్న కవిత దంపతులు

**నలుగేళ్ల మనోవేదనకు తెరపడిందని ఆనందం**



**తిరుమల, మార్చి 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నాలుగేళ్లుగా తాను పడుతున్న మనోవేదన వేంకటేశ్వరస్వామి దయతో తీరిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. తిరుమల శ్రీవారిని ఆమె దర్శించుకున్నారు. తన భర్తతో కలిసి శుక్రవారం వేకువజామున శ్రీవారి అభిషేక సేవలో పాల్గొన్నారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వారికి ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. ఢిల్లీ మద్యం కేసులో కోర్టు క్లీన్ చిట్ ఇవ్వడంతో శ్రీవారికి మొక్కులు చెల్లించేందుకు కాలినడకన వచ్చానన్నారు. త్వరలో తెలంగాణలో రాజకీయ పార్టీ స్థాపించనున్నట్లు వెల్లడించారు. తనకు కష్టకాలంలో సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. స్వామి దయ తనపై ఉండడం వల్లనే కేసు నుంచి బయటపడ్డానని అన్నారు.

## గల్ఫ్‌కు వెళ్లే 12 విమానాలు రద్దు

**హైదరాబాద్, మార్చి 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో విమానాల రద్దు కొనసాగుతోంది. శంషాబాద్ నుంచి గల్ఫ్ దేశాలకు వెళ్లాల్సిన 12 విమానాలు రద్దయ్యాయి. అదే సమయంలో గల్ఫ్ దేశాల నుంచి శంషాబాద్‌కు రావాల్సిన మరో 12 విమానాలు కూడా రద్దయ్యాయి. ఖతార్, యూఏఈ, కువైట్, బహ్రెయిన్, సౌదీ అరేబియా నుంచి రావాల్సిన, వెళ్లాల్సిన విమానాలు రద్దు అయినట్లు అధికారులు తెలిపారు.

## నాచారం బ్రహ్మోత్సవాలకు కెసిఆర్‌కు ఆహ్వానం



**హైదరాబాద్, మార్చి 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** బీఆర్ఎస్ అధినేత , మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను నాచారం గుట్ట శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి దేవస్థానం ప్రతినిధులు కలిశారు. ఈ నెల 8 నుంచి 19 వరకు జరిగే బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని కోరుతూ శుక్రవారం ఆహ్వాన పత్రికను , స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భగా ఆలయ అర్చకులు కేసీఆర్‌ను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రవీందర్ , ఈవో రంగాచారి , అర్చకులు పాల్గొన్నారు.

## కెసిఆర్‌ను కలిసిన బాల్క సుమన్

**హైదరాబాద్, మార్చి 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ను చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ శుక్రవారం కలిశారు. ఇటీవల క్యాతనపల్లి మున్సిపల్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులో అరెస్టై జైలుకు వెళ్లి వచ్చిన బాల్క సుమన్ తొలిసారి కేసీఆర్‌ను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఎన్నికల్లో ఎంతో ధైర్యంగా , సమర్థవంతంగా పనిచేసి మెజారిటీ సభ్యులను గెలిపించుకున్నందుకు, కాంగ్రెస్ దౌర్జన్యాలను తిప్పికొట్టినందుకు బాల్కసుమన్‌ను అభినందించారు. మున్సిపల్ ఎన్నికలు జరిగి నెలరోజులు కావస్తున్నా క్యాతన్‌పల్లి మున్సిపల్ పాలకవర్గం ఎన్నికకు కాంగ్రెస్ అడ్డం పడుతుంది. మెజారిటీ లేకున్నా బలప్రయోగం, బెదిరింపులతో హస్తగతం చేసుకోవాలని నానా ప్రయత్నాలు చేస్తుంది. ఇందులో భాగంగా క్యాతన్‌పల్లి మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ , సీపీఐ అభ్యర్థులు 14 మంది గెలుపొందారు. ఇక సమావేశంలో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక లాంఛనమే అన్న తరుణంలో కాంగ్రెస్‌కు చెందిన నాయకులు, మంత్రి వివేక్ ,ఎంపీ పోలీసుల సహకారంతో అడ్డుపడుతూ వచ్చారు. చివరకు చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు బనాయించి జైలులు పెట్టారు.సుమారు 16 రోజుల పాటు బెయిల్ దొరకకుండా అడ్డుపడ్డారు. రెండు రోజుల క్రితం జైలు నుంచి బయటకు వచ్చిన బాల్కసుమన్ నిన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. కెసిఆర్‌ను కలిసి తాజా పరిణామాలను బాల్క వివరించారు.

## 8, 9 తేదీల్లో మెగా రైతు మేళా

**అగ్రికల్చర్ వర్సిటీ విసి వెల్లడి**

**హైదరాబాద్, మార్చి 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈనెల 8,9 తేదీల్లో మెగా రైతు మేళాను నిర్వహిస్తున్నామని విశ్వవిద్యాలయ ఉప కులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య వెల్లడించారు. శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాజేంద్ర నగర్ లోని విశ్వవిద్యాలయంలో రైతు మేళాను విజయవంతం చేయాలని కోరారు. మహిళా రైతుల సాధికారిత లక్ష్యంగా నిర్వహించనున్న ఈ మేళకు సుమారు 8 నుంచి 10 వేల మంది మహిళా రైతులు హాజరవుతున్నారని వివరించారు.రెండు రోజుల మెగా మహిళా రైతు మేళాలో వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న కీలక సవాళ్లు, వాటి పరిష్కారాల పై శాస్త్రవేత్తలు, అభ్యుదయ రైతులతో ముఖాముఖి కార్యక్రమాలు ఉంటాయన్నారు. రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ పరిధి లోని సెర్ప్‌కు చెందిన సుమారు మూడు వేల మంది మహిళా రైతులు ఈ కార్యక్రమానికి హాజరు అవుతారన్నారు.వివిధ ఆధునిక సాంకేతిక అంశాలపై సుమారు 70 నుంచి 80 స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు.అధిక రసాయన ఎరువుల వాడకం వల్ల వచ్చే దుష్ప్రభావాలు, మార్కెట్‌లో గిరాకీ ఉన్న వరి రకాల సాగు వంటి అంశాలపై విశ్వవిద్యాలయం విద్యార్థిని, విద్యార్థులచే ఆటా, పాట కార్యక్రమాలుంటాయని తెలిపారు.

# యుద్ధం నుంచి వెనక్కి తగ్గబోం

## అసలు యుద్ధం మొదలయ్యిందే ఇప్పుడు... అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెథ్ స్పష్టం

**వాషింగ్టన్,మార్చి6(ఆర్ఎన్ఎ):** ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధం నుంచి వెనక్కి తగ్గేదే లేదని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెథ్ స్పష్టం చేశారు. అమెరికా సైనిక శక్తిని ఇరాన్ తక్కువ అంచనా వేస్తోందన్నారు. ఈ యుద్ధంలో అమెరికా నిలబడలేదని ఇరాన్ అనుకుంటోందని, తాము అసలు పోరాటాన్ని ఇప్పుడే మొదలుపెట్టామని ఆయన పేర్కొన్నారు. ఇక గల్ఫ్ ప్రాంత సముద్ర జలాల్లో అమెరికా నౌకా దళాలు వెనక్కి జరుగుతున్నాయనే ప్రచారాన్ని యూఎస్ సెంట్రల్ కమాండ్ ఖండించింది. యావత్ ఇరాన్ నేవీని సముద్రంలో ముంచేసే వరకు తమ మిషన్ ఆగదని తేల్చి చెప్పింది. గత 72 గంటల్లో ఇరాన్‌లోని దాదాపు 200 లక్ష్యాలపై అమెరికా బాంబర్ ఫోర్స్ వైమానిక దాడులు చేసిందని సెంట్‌కామ్ వెల్లడించింది. బి-2 స్పిరిట్ బాంబర్ విమానాల నుంచి కేవలం ఒక గంట వ్యవధిలోనే 2వేల పౌండ్ల బరువున్న డజన్ల కొద్దీ పెనెట్రేటర్ బాంబులను బాలిస్టిక్ మిస్సైల్ లాంచ్ ప్యాడ్లపై వేశామని




పేర్కొంది. అమెరికా సంకల్పం ఎంత బలమైందో ఇరాన్ అర్థం చేసుకోలేకపోతోందని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెథ్ అన్నారు. ఇరాన్‌పై తమ సైనిక చర్యను బలంగా కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు.

వాషింగ్టన్‌లో విలేకరుల సమావేశం వేదికగా పీట్ హెగ్సెథ్ ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికాను ఇరాన్ నేతలు, ఐఆర్‌జీసీ తక్కువ అంచనా వేస్తున్నాయని ఆయన చెప్పారు. తమ సంకల్పానికి కట్టుబడి ఉంటామని, ఇరాన్‌పై పోరాటాన్ని కొనసాగిస్తామని వెల్లడించారు. పూర్తి శక్తితో అమెరికా ఇప్పుడే దాడులను మొదలుపెట్టిందన్నారు. ఒకవేళ అవసరమైతే దీర్ఘకాలం పాటు ఈ యుద్ధాన్ని చేసేందుకూ అమెరికా సన్నద్ధమై ఉందని పేర్కొన్నారు. ఇరాన్ దాడుల నేపథ్యంలో అరబ్ దేశాల నుంచి అమెరికాకు శరణార్థులు క్యూ కట్టే ఛాన్స్ ఉందనే ప్రచారం జరుగుతోంది. అయితే అరబ్ శరణార్థులకు అమెరికాలో ఆశ్రయాన్ని కల్పించే ఎలాంటి ప్రణాళికలూ ప్రస్తుతానికి తమకు లేవని అమెరికా రక్షణ మంత్రి తేల్చి చెప్పారు.

## నేటి మనదేశమ్ సంపాదకీయం

# ఈ యుద్ధం ముగిసేదెలా?

పశ్చిమాసియా యుద్ధం ఇప్పట్లో ముగిసేలా లేదు. దీనికితోడు ఇది మూడో ప్రపంచ యుద్ధంగా మారబోతుందా అన్న భయాలు వెల్లడవుతున్నాయి. ఎందుకంటే ఇజ్రాయిల్, అమెరికాల దూకుడు తగ్గడం లేదు. ప్రతిగా ఇరాన్ కూడా విధ్వంసం సృష్టిస్తోంది. ఓ రకంగా చెప్పాలంటే ఇరాన్‌ను అమెరికా తక్కువ అంచనా వేసినట్లుగా అర్థం అవుతోంది. మరోవైపు యుద్ధాన్ని ఆపాలని చైనా, రష్యాలు రంగంలోకి దిగాయి. ఇరాన్‌కు ఈ రెండు దేశాలు మద్దతు ప్రకటించాయి. దీంతో ఏంజరగబోతుందో అన్న ఆందోళన సహజంగానే కలుగుతోంది.తాజాగా చైనా నోరు విప్పడంతో ఈ యుద్ధం కీలకమైన మలుపు తీసుకునే అవకాశం లేకపోలేదు. ఒకవేళ ఇరాన్‌లో రహస్యంగా కొనసాగుతున్న న్యూక్లియర్ రియాక్టర్ ఏ మాత్రం లీక్ అయినా, ఇరాన్, పరిసర ప్రాంతాల్లో ఉన్న దేశాలకు కూడా ముప్పు ముంచుకొస్తుంది. దీనిపై ఇటు ఇరాన్‌కు అటు అమెరికాకు కూడా అవగాహన ఉండివుంటుది. కానీ ఎందుకో ఇరాన్ కూడా తమ దాడుల తీవ్రత పెంచింది.ఈ యుద్ధంతో ఇప్పటికే మధ్య ప్రాచ్యం మండిపోతోంది. ఇరాన్ సార్వభౌమత్వాన్ని కాపాడతామంటూ చైనా రంగంలోకి దిగడంతో ప్రపంచ దేశాల్లో మూడో ప్రపంచ యుద్ధ భయాలు కనపడుతున్నాయి. ఇదే సమయంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై మరిన్న భీకర దాడుల్ని చేసేందుకు సిద్ధమౌతున్నట్లు ప్రకటించారు. యుద్ధం మరో నాలుగైదు వారాలు తప్పదని ట్రంప్ ముందే హెచ్చరించారు. ఆ వెనువెంటనే యుద్ధ తీవ్రత ఎలా ఉంటుందో కూడా చెప్పనే చెప్పారు. ఎనిమిది అరబ్దేశాలు ఇరాన్ దాడులతో విలవిల్లాడు తున్నాయి. ఇరాన్ అమెరికాతో రాజీ చర్చల కోసం ఏవిధంగానూ ప్రయత్నించడం లేదు. మరోవైపు హర్మూజ్ జలసంధి మూసివేయడంతో ప్రపంచం మీద చమురు భారం పడుతోంది. సంక్షోభం తప్పేలా లేదు. అమెరికా మాత్రం చర్చలకు ఆలస్యం అయ్యిందని బెదిరిస్తోంది. ఇరాన్‌లో తదుపరి ఎవరు నేతగా ఉండాలో తామే నిర్ణయిస్తామని కూడా ట్రంప్ ప్రకటించాడు. ఇకపోతే ఇరాన్ దాడులతో గల్ఫ్ దేశాలు ముప్పు ముంగిట ఉన్నాయి. సౌదీలోని అతిపెద్ద చమురు శుద్ధి కేంద్రం,రిఫైనపై ఇరాన్ దాడి చేయడంతో చమురు సరఫరా ఆగిపోయింది. ఇరాన్ తన హోర్ముజ్ జలసంధిని మూసి వేస్తే ప్రపంచ దేశాలకు అందే చమురు సరఫరా ఆగిపోగలదని అనుభవంఓలకి వచ్చింది. ఈ క్రమంలో బహ్రెయిన్ పోర్టులో ఆగి ఉన్న అమెరికాకు చెందిన స్టైనా ఇంపరేటివ్ చమురు నౌక పైనా డ్రోన్ దాడులు జరిగి మంటలు చెలరేగాయి. ఇరాన్ ప్రతీకార దాడుల్లో ప్రధానంగా అమెరికా తదితర దేశాల చమురు నౌకలు దెబ్బతింటే ఆయా దేశాలు ఇక చమురుకు కష్టాలు పడాల్సిందే. ఒకవైపు అమెరికా యుద్ధనౌకల మోహరింపు. మరోవైపు ఇరాన్, రష్యా యుద్ధ నౌకలు సంయుక్త నావికాదళ విన్యాసాల కవ్వింపుతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. యుద్ధ జ్వాలలు మింటికెగయడంతో భారత్ దేశంతో సహా ఎన్నో దేశాల్లో నిత్యావసర వస్తువుల ధరలు, పప్పు ధాన్యాలు, నూనెల ధరలపై విపరీతమైన ప్రభావం పడుతోంది. ఇప్పటికే దక్షిణ కొరియా, జపాన్, చైనా స్టాక్ మార్కెట్లు అతలాకుతలమయ్యాయి. తాజా పరిస్థితుల రీత్యా యుద్ధ సంకేతాలు విస్తరించి ఆయా దేశాలు ఏదో ఓ పక్కకు చేరిపోవడం ఒక్కటే ప్రత్యామ్నాయంగా ఉన్నందున యుద్ధం మరికొంతకాలం తమ ప్రతాపాలను చూపిస్తుంది. యుద్ధం ఆగినా యుద్ధకాలపు ప్రభావాలు అంతత్వరగా ఉపసంహరణ జరుగదు. ఆ తర్వాత కూడా మార్కెట్లు కోలుకోవడానికి, పెరిగిన ధరలు తగ్గడానికి మరెంతో కాలం పడుతుంది. ఎందుకంటే ఇప్పట్లో ఈ యుద్ధం ముగిసేలా లేదు. ఇరువైపులా భీకర యుద్ధమే సాగుతోంది. ఎవరూ తగ్గేటట్లు లేరు. నతాంజ్ అణు కేంద్రంపై ఇజ్రాయెల్, అమెరికా దాడి చేసాయి. ఈ దాడిలో ఏమరుపాటున ఆ అణుకేంద్రం నుంచి వెలువడే అణుధార్మికత ప్రమాదకరమే. ఇరాన్‌ను లొంగదీసుకోవాలని అమెరికా అధినేత ట్రంప్ ప్రయత్నిస్తున్న తరుణంలో చైనా ఇరాన్‌తో చేయికల్పడం ఎలాంటి పరిస్థితులకు దారితీస్తుందోనని సర్వత్రా భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. రష్యా కూడా రంగంలోకి దిగితే ఇక అది ప్రపంచ యుద్ధానికి దారితీయవచ్చు. మరోవైపు ఉక్రెయిన్ కూడా ఇరాన్‌కు వ్యతిరేకంగా అమెరికాతో చేతులు కలిపింది. ఇది సహజంగానే రష్యాకు గిట్టదు. మొత్తంగా ప్రపంచ దేశాలు రెండు వర్గాలుగా ఏర్పడితే వినాశనం తప్పదు. ప్రజలు ఆకలిచావులకు లోను కావాల్సిందే. ఈ క్రమంలో యుద్ధాన్ని ఆపడానికి ప్రయత్నాలు సాగాలి. ఇరు దేశాల మధ్య ఇగోలను చల్లార్చాలి. ఈ దశలో ఎవరు ముందుకు వస్తారన్నదే ముఖ్యం.

# అమెరికా ఆస్తులపైనే మా దాడులు

### అరబ్ దేశాల్లో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు
### ఇరాన్ విదేశాంగ సహాయ మంత్రి సయ్యద్ ఖతీబ్జాదే

**న్యూఢిల్లీ,మార్చి6(ఆర్ఎన్ఎ):** పశ్చిమాసియాలోని అమెరికా ఆస్తులపై మాత్రమే తాము దాడులు చేస్తున్నామని ఇరాన్ విదేశాంగ సహాయ మంత్రి సయ్యద్ ఖతీబ్జాదే వెల్లడించారు. తమ దాడుల వల్ల పొరుగున ఉన్న అరబ్ దేశాల్లో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదన్నారు. దిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో తన దేశం చేపడుతున్న చర్యలను ఆయన సమర్థించారు. యూఎస్ ఆస్తులనే మేం లక్ష్యంగా చేసుకుంటున్నాం. అందుకే మా దాడుల వల్ల అరబ్ దేశాల్లో ప్రాణనష్టం సంభవించలేదని ఖతీబ్జాదే అన్నారు. అలాగే ఇటీవల హిందూ మహాసముద్రంలో ఇరాన్ యుద్ధనౌక ఐరిస్ దేనా-75ను యూఎస్ ముంచేసిన సంగతి తెలిసిందే. భారత స్నేహితుల ఆహ్వానం మేరకు ఆ నౌక ఇక్కడికి వచ్చింది. దానిపై అమెరికా దాడి దురదృష్టకరం అని వ్యాఖ్యానించారు. అలాగే దిల్లీ పర్యటనలో భాగంగా ఆయన భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌తో భేటీ అయ్యారు. ఇజ్రాయెల్-అమెరికా దాడుల్లో ఖమేనీ సహా పాలనావర్గానికి చెందిన పలువురు ఉన్నతస్థాయి వ్యక్తులు చనిపోయారు. వారి మృతితో ఇరాన్ రాజకీయ వ్యవస్థ కూలిపోతుందని ట్రంప్ ప్రభుత్వం వ్యాఖ్యలు చేస్తోంది. వాటిని ఖతీబ్జాదే తోసిపుచ్చారు. తమ దేశ పాలనా నిర్మాణం వ్యక్తులపై కాకుండా వ్యవస్థలపై ఆధారపడి ఉందని స్పష్టంచేశారు. 'ఇరాన్‌లో రాజ్యాంగం ఉంది. ఎవరెవరు ఏఏ బాధ్యతలు నిర్వహించాలనే దానిపై స్పష్టమైన విభజన ఉంది' అని అన్నారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

**విజయనగరం,మార్చి6(ఆర్ఎన్ఎ):** 26వ నంబరు జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున మరుపల్లి గ్రామం వద్ద రోడ్డు ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. గజపతినగరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెదమానాపురం గ్రామానికి చెందిన రౌతు ధనుంజయ నాయుడు (23) పెదనాన్న కుమార్తె వివాహం శుక్రవారం విజయనగరంలో జరగనుంది. ఏర్పాట్లను పరిశీలించడానికి ధనుంజయ నాయుడు మరో ముగ్గురు యువకులతో కలిసి యజమానాపురం నుంచి విజయనగరం వెళ్లి వస్తున్నాడు. ఈ క్రమంలో మరుపల్లి గ్రామం వద్ద కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ధనుంజయనాయుడు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి.

# ఏనుమాముల మార్కెట్లో మిర్చి రాసులు

## భారీగా తరలి వచ్చిన బస్తాలు



**వరంగల్,మార్చి6(ఆర్ఎన్ఎ):** వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు భారీగా మిర్చి రావడంతో మార్కెట్ ఎరుపెక్కింది. వరుసగా రెండ్రోజుల నుంచి సుమారు 35 నుంచి 40వేల బస్తాల మిర్చి అమ్మకానికి వచ్చింది. ఈ సీజన్‌లో ఇదే అధికం. దీంతో యార్డులో ఎటు చూసినా మిర్చి బస్తాలే దర్శన మిచ్చాయి. మిర్చి ధరలు గత సంవత్సరంతో పోలిస్తే మెరుగ్గా ఉండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా, మార్కెట్‌లో మంచి నాణ్యత ఉన్న మిర్చికి గరిష్టంగా పలికిన ధరలు ఇలా ఉన్నాయి... తేజ రకం మిర్చి క్వింటాకు రూ.18,800, వండర్‌హాట్ రూ. 35వేలు, యూఎస్.341 రూ.21వేలు, దీపిక రూ. 30వేలు, ఎల్లోమిర్చి రూ.20 వేలు, సింగిల్‌పట్టి రూ.40వేలు, దేశీ మిర్చి రూ.40వేలు, తాలు క్వింటాకు రూ. 12వేలు పలికింది. ఇటీవల చపాట మిర్చి ధరలు బాగా పెరిగాయి. నాలుగు సంవత్సరాల తరువాత దేశీ మిర్చి ధరలు పుంజుకుంటున్నాయి. 2021-22లో మిర్చి ధరలు, ముఖ్యంగా దేశీ మిర్చి ధర క్వింటాకు లక్ష రూపాయల వరకు పలికింది. ఆ తరువాత గడిచిన నాలుగేళ్లుగా రూ.30వేల నుంచి రూ.40వేలు.. తేజ, వండర్‌హాట్, యూఎస్ 341 లాంటి రకాలకు రూ.12వేల నుంచి రూ.16వేలు పలికాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందారు. అనేక మంది రైతులు మిర్చి బస్తాలను కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకున్నారు. ప్రస్తుత సీజన్‌లో కొంత కాలంగా ధరలు పెరుగుతూ వస్తున్నాయి. జియోట్యాగింగ్ కలిగిన దేశీ మిర్చికి విదేశాలలో మంచి డిమాండ్ ఉండడంతో ఎగుమతులు చేసేందుకు వ్యాపారులు ఆసక్తి చూపుతున్నారు.

కాగా, వరంగల్ వ్యవసాయ మార్కెట్లో శుక్రవారం మిర్చి ధరలు గరిష్టంగా ఉన్నాయి. గత నెల మొదటి వారంలో మిర్చి సీజన్ ప్రారంభం కాగా, తొలుత క్వింటాకు రూ.16,300 నుంచి రూ.16,800 వరకే సగటు ధరలు ఉన్నాయి. మార్కెట్‌కు వరుస సెలవుల అనంతరం ఈనెల 18న సగటు ధర రూ.17,011ఉండగా క్రమంగా పెరుగుతూ తాజాగా రూ.18,489కి చేరింది. ఖమ్మం, వరంగల్ మార్కెట్ల రాబడులు, కోల్డ్ స్టోరేజీల్లో ఉన్న నిల్వలు, ఇతర దేశాల ఎగుమతుల అంశాలన్నీ ఇక్కడి మిర్చి ధరలను ప్రభావితం చేస్తున్నట్లు వ్యాపారులు విశ్లేషిస్తున్నారు.

# భారత ప్రభుత్వ పశుసంవర్ధక మరియు పాడి పరిశ్రమ అభివృద్ధి కొరకు భారత పశుధన్ యాప్ ప్రారంభం

- ఆధార్ మరియు మొబైల్ నెంబరు నమోదుతో పశు పోషకునిగా ఎన్నో సేవలు పొందవచ్చును.
- పశుసంవర్ధక శాఖ పధకాల లబ్ది త్వరిత గతిన పొందడానికి యాప్ దోహదకారి..
- పశుపోషకులకు పశుసంవర్ధక శాఖా ద్వారా ఎన్నో రాయితీల కల్పన..
- పశుసంవర్ధక శాఖ సంచాలకులు టి. దామోదర్ నాయుడు



**విజయవాడ, మార్చి 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పశు సంవర్ధక శాఖ ద్వారా పశువులకు వ్యాధి నివారణ టీకాలు, కృత్రిమ గర్భధారణ సేవలు విస్తృతంగా అందించడం జరుగుతున్నదని పశు సంవర్ధక శాఖ సంచాలకులు టి. దామోదర్ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. పారదర్శక సేవలైన పశుసంపద యొక్క ఖచ్చితమైన వివరాలు వాటికి వివిధ సేవలు అందించేందుకు పశుసంపద దేశంలో గణనీయంగా పెంపుదల చేయుటకు ప్రత్యేక డిజిటల్ వ్యవస్థ భారత్ పసుధన్ యాప్ ప్రవేశ పెట్టడంలోని ప్రధాన ఉద్దేశ్యం అని అయన చెప్పారు. నూతన యాప్ లో పశుపోషకులు ఆధార్ మరియు మొబైల్ నెంబరుతో నమోదు కావాలని కోరారు. పశు సేవకులకు పశు సంవర్ధక శాఖ సిబ్బంది సహాయం ద్వారా వివరాలు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ డిజిటల్ వ్యవస్థ వలన పశుపోషకులకు మరింత మెరుగైన సేవలు అందించడానికి ఎక్కువ వీలు కలుగుతుందని తెలిపారు. పశుసంవర్ధక శాఖ సిబ్బంది ఆధార్ మొబైల్ నెంబరు మరియు ఓటిపి కోసం పశుపోషకులను సంప్రదించునపుడు సరి అయిన సమాచారం అందించాలన్నారు. మొబైల్ నెంబరు మారిన సమయంలో మరియు మనుగడలో లేకపోయినా ఓటిపి రాదన్నారు. అప్పుడు పశుసంవర్ధక సేవలు నమోదు చేయలేమని చెప్పారు. ఈ సందర్భంలో పశుపోషకులు పశుసంవర్ధక శాఖ సిబ్బందిని సంప్రదించి తమ సహకారం అందించి సరి అయిన మొబైల్ నెంబరును భారత్ పశుధన్ యాప్ డిజిటల్ వ్యవస్థలో ఆధునీకీకరించుకోవాలని కోరారు. ది. 01-04-2026 తేదీ నుండి పశువులకు కృత్రిమ గర్భధారణ అందించే సమయంలో కూడా పశుపోషకులు మొబైల్ నెంబరుకు వన్ టైం పాస్ వర్డ్ పంపబడుతుందన్నారు. అధీకృత మొబైల్ నెంబరు సమాచారాన్ని కృత్రిమ గర్భధారణ నిపుణులకు మాత్రమే తెలియజేసి సేవల సమాచారాన్ని డిజిటల్ వ్యవస్థలో నమోదు చేసుకోవాలని కోరారు. కావున రాష్ట్రం లోని పశుపోషకులు అందరూ తప్పనిసరిగా పశుసంవర్ధక శాఖ వారి నూతన డిజిటల్ వ్యవస్థలో ఆధార్ మరియు మొబైల్ నెంబరుతో నమోదు చేసుకుని మరింత మెరుగైన పశుసంవర్ధక సేవలు పొందాలని కోరారు. భవిష్యత్తు అవసరాలకు తగిన విధంగా పశుసంవర్ధక శాఖ పధకాలు కార్యక్రమాల రూపకల్పనకు సహకరించి రాయితి పధకాలు పొందాలని పశుసంవర్ధక శాఖ సంచాలకులు టి. దామోదర్ నాయుడు తమ ప్రకటనలో కోరారు.

# ఆప్కాస్‌లో మరణించిన వారి కటుంబ సభ్యులకు ఉద్యోగాలు

## సిఐటియూ ఆధ్వర్యంలో కార్మికుల ఆందోళన

**విశాఖపట్టణం,మార్చి6(ఆర్ఎన్ఎ):** జివిఎంసి ఆప్కాస్ లో పనిచేసి మరణించిన, రిటైర్ అయిన పారిశుధ్య కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులను పనిలోకి తీసుకోవాలని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి. నూకరాజు, ఉరికూటి రాజు డిమాండ్ చేశారు. ఆప్కాస్ లో పనిచేసి, రిటైర్ అయిన, మరణించిన వారి కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద యూనియన్ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ,జివిఎంసి పారిశుధ్య విభాగం, నీటిపారుదల, యుజిడి, వెటర్నరీ, పార్కులు వంటి విభాగాలలో పనిచేస్తున్న ఆప్కాస్ కార్మికులలో చనిపోయిన, రిటైర్ అయిన వారి స్థానంలో, వారి కుటుంబ సభ్యులను పనిలోకి





తీసుకోవాలన్నారు. వారందరికీ ఆప్కాస్ ద్వారా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎం.వరప్రసాద్,జె.ఆర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు. పెద్ద ఎత్తున కార్మికులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

# ఇజ్రాయిల్‌పై తీవ్రమైన ఇరాన్ ప్రతిదాడులు

## డిమోనా అణు కేంద్రంపై దాడికి ఇరాన్ గురి

**టెహ్రాన్,మార్చి6(ఆర్ఎన్ఎ):** ఇజ్రాయిల్ దాడులకు ప్రతిదాడులను ముమ్మరం చేసిన ఇరాన్ ఇజ్రాయెల్ అణు రియాక్టర్‌పై గురిపెట్టిందన్న వార్తలు వస్తున్నాయి. ఇజ్రాయిల్ అణు కేంద్రాన్ని ధ్వంసం చేస్తామని ప్రకటించింది. ఇజ్రాయెల్ తన అత్యాధునిక ఆయుధ వ్యవస్థలను డిమోనాకు రక్షణగా మోహరించింది. ప్రపంచంలోనే అత్యంత దుర్భేద్యమైన ప్రదేశంగా మార్చేసింది. ఇక్కడ యారో-2, 3, డేవిడ్ స్లింగ్ వంటి క్షిపణి రక్షణ వ్యవస్థలు ఉన్నాయి. ఇటీవల తన అత్యాధునిక ఐరన్ బీమ్‌ను కూడా ఇక్కడికే తరలించినట్లు కథనాలు వెలువడ్డాయి. అంతేకాదు.. భూగర్భంలో కొన్ని అంతస్తుల కింద తన అణు కార్యక్రమాన్ని ఇజ్రాయెల్ సురక్షితంగా ఉంచినట్లు తెలుస్తోంది. డిమోనాపై దాడి చేయడానికి ఇరాన్ అమ్ములపొదిలో డ్రోన్లు, క్షిపణులు వంటి చాలారకాల ఆయుధాలు ఉన్నాయి. రియాక్టర్ నుంచి ఇరాన్ 1200-1500 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇంత దూరం ప్రయాణించేందుకు టెహ్రాన్ అమ్ముల పొదిలో షహిన్ 136 డ్రోన్లు భారీ సంఖ్యలో ఉన్నాయి. ఇది దాదాపు 50 కిలోల పేలుడు పదార్థాలను మోసుకెళ్లగలదు. ఇక క్షిపణుల విషయానికి వస్తే సాహబ్-3, ఖైబర్‌షేకన్, ఎమాద్, ఖుర్రంషహర్, ఫుద్ర, సెజ్జిల్, సుమర్ వంటి



క్షిపణులున్నాయి. వీటి రేంజి 1300 కిలోమీటర్ల నుంచి 2500 కిలోమీటర్ల వరకు ఉంది. ఇవికాకుండా ఫతా-2 హైపర్ సోనిక్ క్షిపణి కూడా ఉంది. ఇది ఇజ్రాయెల్ గగనతల రక్షణ వ్యవస్థలను కూడా తప్పించుకోగలదు. గతంలో సిరియాతో ఘర్షణ వేళ ఈ రియాక్టర్ సమీపంలో కొన్ని క్షిపణులు పడ్డాయి. ఇజ్రాయెల్ ఏర్పడిన తర్వాత పొరుగు దేశాలు వరుసగా దానితో యుద్ధాలకు దిగాయి. అమెరికా సాయంతో.. వాటిని ఓడించినా.. ఎప్పటికైనా తన ఉనికికి ముప్పు తప్పదని గ్రహించింది. దీంతో నాటి ప్రధాని డేవిడ్ బెన్ గురియన్ తమ దేశాన్ని అణుశక్తిగా మార్చాలనే నిర్ణయానికి వచ్చారు. ఫ్రాన్స్ సాయంతో అణు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎట్టకేలకు నెగెవ్ ఎడారిలో 'డిమోనా' అనే ప్రదేశంలో ఓ భారీ రియాక్టర్‌ను ఇజ్రాయెల్ నిర్మించింది. ఐరోపా దేశాల టెక్నాలజీ, బ్లూప్రింట్స్, నిపుణుల సాయంతో దీనిని రూపొందించారు. ఇందులోని భూగర్భ బంకర్లలో అణుబాంబులకు వాడే ప్లుటోనియం ఉత్పత్తి చేసే అవకాశం ఉంది. ఈ విషయం అతికొద్దిమందికి మాత్రమే తెలుసు. అలా ఇజ్రాయెల్ అణ్వాయుధం తయారీలో డిమోనా రియాక్టర్ కీలక పాత్ర పోషించింది. ఈ రియాక్టర్‌కు ఉత్తరం వైపు 85 కిలోమీటర్ల దూరంలో జెరూసలెం నగరం ఉంది. ఇక 75 కిలోమీటర్ల దూరంలో ఈజిప్ట్ సరిహద్దులు.. 25 కిలోమీటర్ల దూరంలో జోర్డాన్ ఉన్నాయి. ఒకవేళ దాడి జరిగితే ఇక్కడి నుంచి లీకయ్యే రేడియేషన్ ప్రభావం ఈ దేశాలకు కూడా పాకే ప్రమాదం ఉంది.

# మజ్జిగ చారును ఇలా తయారు చేసి తినండి..

## అరటి పండు, బొప్పాయి కలిపి తింటున్నారా? అయితే జాగ్రత్త..



కరోనా టైం నుంచి చాలా మంది ఆరోగ్యంపై చాలా శ్రద్ధ వహిస్తున్నారు. దాదాపుగా జంక్ ఫుడ్ ను వీలైనంత వరకు తగ్గించి ఫ్రూట్స్ పై దృష్టి పెడుతున్నారు. వీలైనప్పుడల్లా ఫ్రూట్స్ తింటూ ఆరోగ్యాన్ని పెంపొందించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆరోగ్య నిపుణులు సైతం ఇదే సూచిస్తున్నారు. ఇక ఫ్రూట్స్ దొరకని వారు రెడిమెడ్ ఫ్రూట్ సలాడ్ ను ఎంచుకుంటున్నారు. ఇలాంటి సమయంలోనూ జాగ్రత్తగా ఉండాలని చెబుతున్నారు హెల్త్ ఎక్స్‌పర్ట్స్. ఫ్రూట్ సలాడ్ లేదా ఫ్రూట్ మిక్స్ తీసుకునే టైంలో అందులో అరటి, బొప్పాయిని మిక్స్ చేసి చాలా మంది సేల్ చేస్తూ ఉంటారు. ఇలాంటివి తినే సమయంలో జాగ్రత్తలు పాటించాలి. లేదంటే ముప్పు తప్పదు.అరటి పండులో, బొప్పాయిలో చాలా పోషకాలు ఉంటాయి. ఇవి మన శరీరానికి ఎంతగానో ఉపయోగపడతాయి. కానీ ఈ రెండు పండ్లను కలిపి తినడం వల్ల కొందరిలో ఇబ్బందులు తలెత్తుతాయి. అందరిలో అని చెప్పలేము. అది పూర్తిగా సదరు వ్యక్తి జీర్ణవ్యవస్థపై డిపెండ్ అయి ఉంటుంది. కొందరిలో జీర్ణ శక్తి సరిగ్గా ఉండదు. అలాంటి వారు అరటి, బొప్పాయి పండు కలిపి తింటే వారిలో సమస్యలు తలెత్తే ఛాన్స్ ఉంది. జీర్ణ శక్తి బాగున్న వారికి ఎలాంటి సమస్య ఉండదు. వాస్తవానికి ఆయుర్వేదంలో బొప్పాయి, అరటి పండ్లను విరుద్ధమైన పండ్లుగా భావిస్తారు. ఈ రెండింటిని కలిపి తినకూడదని చెబుతుంటారు. కలిపి తింటే వాంతులు, వికారం, గ్యాస్, అజీర్తి వంటి సమస్యల వస్తాయని ఆయుర్వేదం చెబుతోంది. బొప్పాయి, అరటి పండు రెండింటినీ కలిపి తినడం వల్ల శ్వాస సంబంధిత సమస్యలు ఎదురవుతాయట. కామెర్లతో బాధపడే వారు బొప్పాయికి దూరంగా ఉండాలి. మరి ఫ్రూట్ సలాడ్, ఫ్రూట్ మిక్స్ తినే సమయంలో ఇలాంటి జాగ్రత్తలు తప్పక పాటించండి. ఫలితంగా హెల్త్ సమస్యలకు దూరంగా ఉండొచ్చు.

## ఆరోగ్యానికి మేలు చేస్తుంది..!

సాధారణంగా కూరలతో భోజనం చేసిన తరువాత పెరుగుతో కూడా భోజనం చేసే అలవాటు మనలో చాలా మందికి ఉంటుంది. పెరుగుతో భోజనం చేయనిదే చాలా మందికి భోజనం చేసినట్టుగా ఉండదు.

పెరుగును ఆహారంలో భాగంగా చేసుకోవడం వల్ల మనకు అనేక ఆరోగ్యకరమైన ప్రయోజనాలు కలుగుతాయి. విటమిన్ బి12 తోపాటుగా కాల్షియం, పొటాషియం, మెగ్నిషియం వంటి మినరల్స్ పెరుగులో అధికంగా ఉంటాయి. శరీరానికి మేలు చేసే బ్యాక్టీరియా పెరుగులో అధికంగా ఉంటుంది. జీర్ణ క్రియను మెరుగుపరచడంలోనూ ఈ బ్యాక్టీరియా ఎంతగానో సహాయపడుతుంది. దీని వల్ల అజీర్తి, గ్యాస్ వంటి సమస్యల నుండి బయట పడవచ్చు.

శరీరంలో రోగ నిరోధక శక్తిని పెంచడంలో పెరుగు ఎంతగానో సహాయపడుతుంది. పెరుగును ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల దీనిలో ఉండే కాల్షియం దంతాలను, ఎముకలను ధృడంగా చేస్తుంది. బరువును తగ్గించడంలోనూ పెరుగు ఉపయోగపడుతుంది. వేసవి కాలంలో ఎక్కువగా పెరుగుతో మజ్జిగ, లస్సీ వంటి వాటిని చేసి తాగుతూ ఉంటారు. ఇలా తాగడం వల్ల శరీరానికి కావల్సిన శక్తి లభించడంతోపాటు డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉంటారు. పెరుగుతో లస్సీ, మజ్జిగనే కాకుండా చారును కూడా చేసుకోవచ్చు. భోజనంలో భాగంగా అన్నంతో కలిపి పెరుగుతో చేసిన చారును తీసుకుంటే చాలా రుచిగా ఉంటుంది. ఇప్పుడు పెరుగు చారును (మజ్జిగ చారు) తయారు చేసుకునే విధానాన్ని, తయారీకి కావల్సిన పదార్థాల గురించి తెలుసుకుందాం.

### మజ్జిగ చారు తయారీకి కావల్సిన పదార్థాలు..

పెరుగు – ఒక కప్పు, తరిగిన ఉల్లిపాయ – అర కప్పు, తరిగిన పచ్చి మిర్చి – ఒక టీ స్పూన్, ఉప్పు – రుచికి తగినంత, నీళ్లు – ఒక గ్లాసు.

### తాళింపుకు కావల్సిన పదార్థాలు..

నూనె – ఒక టీ స్పూన్, ఎండు మిర్చి – 2, జీలకర్ర – పావు టీ స్పూన్,



ఆవాలు – పావు టీ స్పూన్, కరివేపాకు – ఒక రెబ్బ, ఇంగువ – పావు టీ స్పూన్, తరిగిన కొత్తి మీర – కొద్దిగా, పసుపు – అర టీ స్పూన్.

మజ్జిగ చారు తయారు చేసే విధానం..

ముందుగా ఒక గిన్నెలో పెరుగు, ఉల్లిపాయ ముక్కలు, పచ్చి మిర్చి, ఉప్పు వేసుకొని బాగా కలుపుకోవాలి. ఇలా కలుపుకున్న పెరుగులో నీళ్లు పోసి మజ్జిగలా చేసుకోవాలి. ఇప్పుడు ఒక చిన్న కడాయిలో నూనె వేసి కాగాక మిగిలిన పదార్థాలు అన్నీ వేసి తాళింపు వేసుకోవాలి. ఈ తాళింపును ముందుగా తయారు చేసి పెట్టుకున్న మజ్జిగ మిశ్రమంలో వేసి బాగా కలుపుకోవాలి

. దీంతో చక్కటి వాసనతో, ఎంతో రుచిగా ఉండే మజ్జిగ చారు తయారవుతుంది. ఈ చారును అన్నంతో కలిపి తీసుకుంటే ఎంతో రుచిగా ఉంటుంది. దీంతోపాటుగా పెరుగులో ఉండే పోషకాలన్నీ శరీరానికి లభిస్తాయి. చర్మ సౌందర్యాన్ని మెరుగుపరచడంలోనూ పెరుగు ఉపయోగపడుతుంది. చుండ్రును నివారిస్తుంది. పెరుగును ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. వ్యాధులు రాకుండా ఆరోగ్యంగా ఉంటారు.




## మెడ నల్లగా మారుతుందా... ఈ ఇంటి వైద్యాన్ని వాడి చూడండి


సాధారణంగా కొందరి ముఖం ఎంతో తెల్లగా, మృదువుగా, అందంగా మెరిసిపోతుంటుంది. కానీ, మెడ మాత్రం నల్లగా, కాంతిహీనంగా కనిపిస్తుంది. మురికి, మృత కణాలు పేరుకుపోవడం, శరీరంలో అధిక వేడి , పలు రకాల ముందుల వాడకం, ఆహారపు అలవాట్లు, ఎండల ప్రభావం, కాలుష్యం వంటి రకరకాల కారణాల వల్ల మెడ నల్లగా మారుతుంది.

దాంతో మెడ నలుపును వదిలించుకోవడం కోసం నానా పాట్లు పడుతుంటారు. మార్కెట్‌లో లభ్యమయ్యే వివిధ క్రీములను కొనుగోలు చేసి యూజ్ చేస్తుంటారు. అయినప్పటికీ సమస్య పరిష్కారం కాకుంటే ఏం చేయాలో తెలియక మానసిక ఒత్తిడికి లోనవుతుంటారు. అయితే ఇప్పుడు చెప్పబోయే ఎఫెక్టివ్ రెమెడీని ట్రై చేస్తే మూడు రోజుల్లోనే మెడ నలుపు తగ్గడాన్ని మీరు గమనిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం ఆ రెమెడీ ఏంటో ఎలా ప్రిపేర్ చేసుకోవాలో. తెలుసుకుందాం పదండీ ముందుగా మిక్సీ జార్ తీసుకుని అందులో మూడు టేబుల్ స్పూన్ల సగ్గు బియ్యం వేసి మెత్తగా పొడి చేసుకోవాలి. ఆ తర్వాత ఒక బౌల్ తీసుకుని అందులో రెండు టేబుల్ స్పూన్ల సగ్గు బియ్యం పొడి, వన్ టేబుల్ స్పూన్ చందనం పొడి, వన్ టేబుల్ స్పూన్ షుగర్ పౌడర్, వన్ టేబుల్ స్పూన్ పెరుగు, మూడు టేబుల్ స్పూన్ల టమాటో జ్యూస్, హాఫ్ టేబుల్ స్పూన్ కొబ్బరి నూనె వేసి అన్ని కలిసేలా బాగా మిక్స్ చేసుకోవాలి.

ఇప్పుడు ఈ మిశ్రమాన్ని మెడకు పట్టించి.రెండు నిమిషాల పాటు ఆరనివ్వాలి. ఆపై వేళ్లతో మెల్ల మెల్లగా స్క్రబ్ చేసుకుని వాటర్‌తో క్లీన్ చేసుకోవాలి. అనంతరం ఏదైనా మాయిశ్చరైజర్‌ను రాసుకోవాలి. ఇలా వరసగా మూడు రోజులు చేస్తే రిజల్ట్ చూసి మీరే ఆశ్చర్యపోతారు.

## ఘనంగా భట్టి తనయుడి వివాహం

### సిఎం రేవంత్ తదితర ప్రముఖుల హాజరు



**హైదరాబాద్,మార్చి6(ఆర్ఎన్ఎ):** ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గారి కుమారుడు సూర్య విక్రమాదిత్య వివాహం వైభవంగా జరిగింది. శంషాబాద్‌లో జరిగిన వివాహానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వారిని అభినందించారు. గవర్నర్ విష్ణుదేవ్ వర్మ, నటుడు చిరంజీవి తదితర ప్రముఖులు కూడా వివాహ వేడుకకు హాజరయ్యారు. పలువురు మంత్రులు, మాజీమంత్రులు కూడా హాజరయ్యారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ కూడా సూర్య విక్రమాదిత్య వివాహానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆయన ఆశీర్వదించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి పలువురు రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. బంధుమిత్రుల సమక్షంలో భారీ జనసందోహం మధ్య వీరి వివాహం ఘనంగా జరిగింది.

## 8నుంచి విమెన్ హాకీ కప్ టోర్నమెంట్... అన్ని ఏర్పాట్లు చేసినట్లు మంత్రి వెల్లడి

**హైదరాబాద్,మార్చి6(ఆర్ఎన్ఎ):** ఈ నెల 8 నుండి గచ్చిబౌలి హాకీ స్టేడియం లో నిర్వహిస్తున్న ఉమెన్ వరల్డ్ హాకీ కప్ –2026 క్వాలిఫైయింగ్ టోర్నమెంట్ కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని రాష్ట్ర క్రీడా, యువజన సర్వీసులు, పశు సంవర్ధక, మత్స్య శాఖా మంత్రివర్యులు వాకిటి శ్రీహరి వెల్లడించారు. రాష్ట్ర క్రిడా సాధికార సంస్థ చైర్మన్ కె శివ సేనా రెడ్డి, సోని బాల మాయాదేవి, ఇతర క్రీడాధికారులు పాల్గొన్నారు. గ్లోబల్ సిటీగా గుర్తింపు పొందుతున్న హైదరాబాద్ మరో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ క్రీడా ఈవెంట్‌కు ఆతిథ్యం ఇవ్వబోతోంది. హాకి లో దేశానికి ప్రపంచస్థాయి గుర్తింపు తెచ్చిన ధ్యాన్ చంద్ స్ఫూర్తితో తెలంగాణ ప్రభుత్వ క్రీడా శాఖ ఆధ్వర్యంలో ఫెడరేషన్ ఇంటర్నేషనల్ హాకీ వరల్డ్ క్వాల్గి÷ వుమెన్ హాకీ టోర్నమెంట్ 2026 నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసాము.మార్చి 8 నుంచి 14 వరకు జరిగే ఈ పోటీలు గచ్చిబౌలిలోని గచ్చిబౌలి హాకీ స్టేడియంలో జరుగనున్నాయి. ఈ టోర్నమెంట్‌లో భారత్‌తో పాటు ఆస్ట్రియా, ఇంగ్లాండ్, ఇటలీ, కొరియా, స్కాట్లాండ్, ఉరుగ్వే,వేల్స్ జట్లు పాల్గొంటున్నాయి. ఈ జట్లు ఇప్పటికే హైదరాబాద్ చేరుకుని, గచ్చిబౌలి లో అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేసిన ఆస్ట్రో టర్ఫ్ మైదానంలో ప్రాక్టీస్ చేస్తున్నాయి. మహిళల వరల్డ్ కప్ హాకీ క్వాల్గి÷యైర్స్ 2026 కి ఈ పోటీలు కీలకంగామారనున్నాయి. టోర్నమెంట్‌ను లోటుపాట్లు లేకుండా నిర్వహించేందుకు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ అన్ని సదుపాయాలను సమకూర్చింది. క్రీడాకారుడు అయిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో గచ్చిబౌలి నందు అంతర్జాతీయ ప్రమాణాలతో ఆస్ట్రోటర్ఫ్ మైదానం, హై సెక్యూరిటీ, ఆధునిక సదుపాయాలు, క్రీడాకారులకు అత్యుత్తమ వసతి ఏర్పాట్లు చేయబడ్డాయి.

## జనాభా లెక్కలు-2027 కోసం డిజిటల్ సాధనాలు

- ఆవిష్కరించిన కేంద్ర హోం, సహకార మంత్రి శ్రీ అమిత్ షా
- రెండు దశల్లో జనగణన-2027, ప్రపంచంలోనే అతి పెద్ద జనాభా లెక్కల కార్యక్రమం
- మొదటిసారి డిజిటల్ విధానంలో జనాభా లెక్కలు: స్వీయ గణనకు తొలిసారి అవకాశం
- సురక్షితమైన వెబ్ ఆధారిత ప్రక్రియే స్వీయగణన: ఇంటింటి సర్వే చేపట్టడానికి ముందే 16 భాషల్లో ఆన్లైన్లో సమాచారాన్ని నమోదు చేసుకోవచ్చు
- దేశవ్యాప్తంగా నిర్వహించే జనగణన-2027లో పాల్గొనబోతున్న 3 మిలియన్ల ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు, ఇతర అధికారులు

**న్యూఢిల్లీ, మార్చి 6:** జనగణన–2027 కోసం నాలుగు డిజిటల్ సాధనాలను కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా న్యూఢిల్లీలో ప్రారంభించారు. వీటితో పాటుగా ప్రగతి (మహిళ), వికాస్ (పురుష) జనాభా లెక్కల మస్కట్లను కూడా ఆవిష్కరించారు. దేశవ్యాప్తంగా గణన కార్యకలాపాలను సులభతరం చేసేందుకు అధునాతన డిజిటల్ ప్లాట్‌ఫారంలను సెంటర్ ఫర్ డెవలప్మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సీ–డాక్) రూపొందించింది. కేంద్ర హోం కార్యదర్శి, భారతీయ రిజిస్ట్రార్ జనరల్, భారత జనాభా లెక్కల కమిషనర్‌తో సహా పలువురు ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 2025 జూన్ 16న జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ ద్వారా జనగణన–2027ను నిర్వహిం చాలనే తన ఉద్దేశాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రపంచంలోనే అతి జనాభా లెక్కల కార్యక్రమమైన జనగణన–2027 రెండు దశల్లో జరుగుతుంది. తొలిసారి జనాభాను డిజిటల్ విధానంలో గణిస్తున్నారు. అలాగే మొదటిసారి సెల్ఫ్–ఎన్యూమరేషన్ అవకాశం అందుబాటులోకి తీసుకువచ్చారు.


### 'ప్రగతి', 'వికాస్' మస్కట్‌లు

జనాభా లెక్కలు–2027లో స్నేహపూర్వకమైన, సుపరిచితమైన ప్రతినిధులుగా 'ప్రగతి' (మహిళా ఎన్యూమరేటర్), 'వికాస్' (పురుష ఎన్యూమరేటర్) మస్కట్‌లను ఆవిష్కరించారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను మార్చాలనే సంకల్పాన్ని నెరవేర్చడంలో మహిళలు, పురుషుల సమాన భాగస్వామ్యానికి చిహ్నాలుగా ఈ మస్కట్‌లు నిలుస్తాయి. వీటి ద్వారా జనాభా లెక్కలు – 2027కు సంబంధించిన సమాచారం, లక్ష్యాలు, కీలకమైన సందేశాలను దేశవ్యాప్తంగా వివిధ వర్గాల్లో ప్రభావవంతంగా ప్రచారం చేస్తారు.

### నాలుగు డిజిటల్ సాధనాలు

డిజిటల్ సాధనాల ద్వారా భారత దేశంలో నిర్వహిస్తున్న మొదటి జనాభా లెక్కలు ఇవి. నాలుగు డిజిటల్ వేదికలను కేంద్ర హోం, సహకార మంత్రి శ్రీ అమిత్ షా ప్రారంభించారు. అవి:

1. హౌస్ లిస్టింగ్ బ్లాక్ క్రియేటర్ (హెచ్ఎల్‌బీసీ) వెబ్ అప్లికేషన్: దేశవ్యాప్తంగా భౌగోళిక కవరేజీని అందించేలా ఉపగ్రహ చిత్రాలను ఉపయోగించి డిజిటల్ హౌస్ లిస్టింగ్ బ్లాకులను రూపొందించడానికి అధికారులకు వీలు కల్పించే వెబ్–మ్యాప్ అప్లికేషన్ ఇది



2. హెచ్ఎల్‌వో మొబైల్ అప్లికేషన్: గృహ నమోదు సమాచారాన్ని సేకరించి అప్‌లోడ్ చేయడానికి సురక్షితమైన ఆఫ్‌లైన్ మొబైల్ అప్లికేషన్ ఇది. సీఎంఎంఎస్ ద్వారా రిజిస్టరైన ఎన్యూమరేటర్లు మాత్రమే ఈ అప్లికేషన్‌ను ఉపయోగించగలుగుతారు. క్షేత్రస్థాయి నుంచి సర్వర్ వరకు సమాచార సరఫరాకు ఈ యాప్ వీలు కల్పిస్తుంది. అలాగే సంప్రదాయ విధానమైన కాగితపు పనిని తొలగిస్తుంది. గృహ నమోదుకు సంబంధించిన మొత్తం సమాచారాన్ని ఈ యాప్ ద్వారా సేకరిస్తారు. రిజిస్టర్ మొబైల్ నంబర్లను మాత్రమే ఉపయోగించి దీనిని ఆపరేట్ చేయవచ్చు. 16 ప్రాంతీయ భాషల్లో ఉన్న ఈ యాప్ ఆండ్రాయిడ్, ఐవోఎస్ ప్లాట్‌ఫాంలకు అనువుగా ఇది ఉంటుంది.
3. సెల్ఫ్–ఎన్యూమరేషన్ (ఎస్ఈ) పోర్టల్: మొదటిసారి స్వీయగణనను ప్రవేశపెడుతున్నారు. సురక్షితమైన వెబ్ ఆధారిత సౌకర్యమే ఈ ఎస్ఈ పోర్టల్ ద్వారా అర్హులైన వారు తమ ఇంటి సమాచారాన్ని క్షేత్ర స్థాయి కార్యకలాపాలు ప్రారంభం కావడానికి ముందే ఆన్‌లైన్లో సమర్పించడానికి ఇది అనుమతిస్తుంది. వివరాలు విజయవంతంగా సమర్పించిన తర్వాత ప్రత్యేకమైన సెల్ఫ్–ఎన్యూమరేషన్ ఐడీ (ఎస్ఈ ఐడీ) జనరేట్ అవుతుంది.ఈ స్వీయ–గణన గుర్తింపు (ఎస్ఈ ఐడీ)ను ఎన్యూమరేటర్‌కు ఇవ్వాలి. దీని ఆధారంగా సమాచారాన్ని ఎన్యూమరేటర్ ధ్రువీకరిస్తారు.
4. సెన్సెస్ మేనేజ్‌మెంట్ అండ్ మానిటరింగ్ సిస్టమ్ (సీఎంఎంఎస్) పోర్టల్: అన్ని పరిపాలనా స్థాయుల్లో జనాభా లెక్కలకు సంబంధించిన అన్ని కార్యకలాపాల ప్రణాళిక, నిర్వహణ, అమలు, పర్యవేక్షణకు సంబంధించిన రూపొందించిన కేంద్రీకృత, వెబ్–ఆధారిత డిజిటల్ వేదిక. ఇంటిగ్రేటెడ్ డ్యాష్ బోర్డు ద్వారా గణన పురోగతి, క్షేత్రస్థాయి పని తీరు, కార్యాచరణ సంసిద్ధతను సబ్–జిల్లా, జిల్లా, రాష్ట్ర స్థాయుల్లోని అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించవచ్చు.

జనాభా లెక్కలు–2027లో ఇంటింటికీ వెళ్లి సురక్షితమైన మొబైల్ అప్లికేషన్లతో డేటా సేకరణ జరుగుతుంది. అలాగే పూర్తి స్థాయి కవరేజీకి హామీ లభిస్తుంది. దీని కోసం దేశవ్యాప్తంగా 30 లక్షల కంటే ఎక్కువ మంది ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు, జనాభా లెక్కల అధికారులు పనిచేస్తారు.క్రమబద్ధంగా స్వీకరించిన సాంకేతికత.. ఆవిష్కరణను సమ్మిళిత్వంతో మిళితం చేస్తుంది. అలాగే జనగణన–2027ను కచ్చితమైనదిగా, సురక్షితమైనదిగా, సమగ్రంగా ఉండేలా చేస్తుంది.

### జనాభా లెక్కలు–2027 రెండు దశల్లో జరుగుతుంది:

మొదటి దశ: హౌస్ లిస్టింగ్, హౌసింగ్ లెక్కలు (హెచ్ఎల్‌వో) మొదటి దశలో ఇంటి పరిస్థితులు, ఇంట్లోని సౌకర్యాలకు సంబంధించిన సమాచార సేకరణ జరుగుతుంది. రెండో దశలో దేశంలోని ప్రతి వ్యక్తికి సంబంధించిన జనాభా, సామాజిక, ఆర్థిక వివరాలు నమోదు చేస్తారు. 2026 జనవరి 7న మొదటి దశకు నోటిఫికేషన్ జారీ అయింది. 2026 ఏప్రిల్ 1 నుంచి 2026 సెప్టెంబర్ 30 మధ్య ప్రతి రాష్ట్రం/కేంద్రపాలిత ప్రాంతం జారీ చేసిన నోటిఫికేషన్ ద్వారా హౌస్‌లిస్టింగ్, హౌసింగ్ లెక్కలు 30 రోజుల కాల వ్యవధిలో పూర్తి చేస్తారు. ఇంటింటి సర్వేకు ముందు ఐచ్ఛిక 15 రోజుల స్వీయ–గణన వ్యవధి ఉంటుంది.

### రెండో దశ: జనాభా గణన (పీఈ)


2027 ఫిబ్రవరి నుంచి దేశవ్యాప్తంగా జనగణన ప్రారంభమవుతుంది. కేంద్రపాలిత ప్రాంతమైన లదాఖ్, జమ్ముకాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో మంచుతో కప్పబడి ఉండే ప్రాంతాల్లో 2026 సెప్టెంబర్‌లోనే ఎన్యూమరేషన్ జరుగుతుంది. రెండో దశ జనగణనలో కుల సంబంధిత ప్రశ్నను చేర్చనున్నారు.కేంద్ర పాలిత ప్రాంతమైన లదాఖ్, జమ్ముకాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లోని మంచుతో కప్పబడి ఉండే ప్రాంతాల్లో తప్ప, మిగిలిన అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు జనాభా లెక్కల రిఫరెన్స్ తేదీ 2027 మార్చి1 00:00 గంటలుగా ఉంటుంది.

## ఆదర్శ కుటుంబంలో అదిరిపోయే ట్విస్టులు



పెద్దగా హడావిడి చేయకుండా, సైలెంటుగా షూటింగ్ జరుపుకుంటున్న క్రేజీ సినిమాల్లో ఆదర్శ కుటుంబం ఒకటి. వెంకటేష్, శ్రీనిధి శెట్టి జంటగా నటిస్తున్న ఈ మూవీకి త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వం వహిస్తున్నారు. బ్రేకుల్లేకుండా ప్లానింగ్ కు అనుగుణంగా షూట్ చేసేస్తున్నారు. అక్టోబర్ రెండు విడుదలని టార్గెట్ గా పెట్టుకున్నట్టు టాక్ ఉంది కానీ దీన్ని ఇప్పట్లో అధికారికంగా ప్రకటించకపోవచ్చు. వేసవి నుంచి ప్రమోషనల్ అప్డేట్స్ వదలాలని నిర్ణయించుకున్నారట. ఇది పక్కనపెడితే పైకి టైటిల్ సాఫ్ట్ గా ఉన్నా క్యాప్షన్ లో ఉన్న ఏకే 47కు తగ్గట్టు ఇందులో యాక్షన్ ఎలిమెంట్స్ బలంగా ఉంటాయని ఇన్ సైడ్ టాక్. ఇంటర్వెల్ వరకు సరదాగా సాగుతూ, మల్లీశ్వరి -- నువ్వు నాకు నచ్చావ్ తరహాలో ఫన్ నడిపిస్తూ ఒక్కసారిగా ఇంటర్వెల్ బ్లాక్ దగ్గర పెద్ద మలుపు పెట్టారని వినికిడి. ఇక్కడి నుంచి కథా గమనం మారిపోయి మహేష్ బాబు అతడు తరహా ట్రీట్ మెంట్ తో మాటల మాంత్రికుడు మరోసారి తనదైన మార్కు బయటకి తీస్తారని యూనిట్ లీక్. గుంటూరు కారంలో జరిగిన పొరపాట్లకు ఈసారి ఏ మాత్రం అవకాశం ఇవ్వకుండా అల వైకుంఠపురములో ప్లస్ అతడుని కలగలిపి దానికి వెంకీ మార్కు టైమింగ్ జోడిస్తే అదే ఆదర్శ కుటుంబం అంటున్నారు. అంచనాలకు ఏ మాత్రం తగ్గకుండా రూపొందుతోందట. ఈ కాంబో కోసం సంవత్సరాల తరబడి ఎదురు చూసిన మూవీ లవర్స్ కోరికకు అనుగుణంగా పర్ఫెక్ట్ అవుట్ ఫుట్ వస్తోందని అంటున్నారు. త్రివిక్రమ్ కు ఆదర్శ కుటుంబం బ్లాక్ బస్టర్ కావడం చాలా అవసరం. ఎందుకంటే నెక్స్ట్ ప్లాన్ చేసుకున్న ప్యాన్ ఇండియా మూవీకి బజ్ మరింత పెరగాలంటే దీంతో అదిరిపోయే హిట్టు కొట్టాలి. గాడ్ అఫ్ వార్ (ప్రచారంలో ఉన్న టైటిల్) జూనియర్ ఎన్టీఆరా లేక అల్లు అర్జునా అనే ప్రచారానికి ఇంకా చెక్ పడలేదు కానీ మే నెలలో తారక్ పుట్టినరోజు సందర్భంగా ఒక క్లారిటీ రావొచ్చని అంటున్నారు. యానిమల్, అర్జున్ రెడ్డి ఫేమ్ హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతం సమకూరుస్తున్న ఈ యాక్షన్ కం ఫ్యామిలీ డ్రామాలో మ్యూజిక్ కూడా హైలైట్స్ లో ఒకటిగా నిలుస్తుందట.

## ఆలస్యం అమృతమవుతుందా మహాశయా



విపరీతమైన పోటీలో సంక్రాంతి పండక్కు విడుదలైన భర్త మహాశయులకు విజ్ఞప్తి అద్భుతాలు చేయకపోయినా గత రవితేజ డిజాస్టర్లతో పోలిస్తే బెటరనే స్పందన, వసూళ్లు తెచ్చుకుంది. రాజా సాబ్ ని పక్కనపెట్టి ర్యాంకింగ్ వేసుకుంటే మన శంకరవరప్రసాద్ గారు, అనగనగా ఒక రాజు, నారి నారి నడుమ మురారి తర్వాతి స్థానాన్ని దక్కించుకుంది. దీన్ని బట్టి ఆడియన్స్ రెస్పాన్స్ ఏంటో అర్థం చేసుకోవచ్చు. సరే రిజల్ట్ సంగతి పక్కన పెడితే ఒక్క విషయంలో భర్త మహాశయులకు విజ్ఞప్తి రోల్ మోడల్ గా నిలుస్తోంది. అతి ఆలస్యంగా 59 రోజుల తర్వాత మార్చి 13 నుంచి ఓటిటి స్ట్రీమింగ్ కానుంది. ఇప్పటిదాకా డిజిటల్ లో రాకపోవడం ఆశ్చర్యమే. ఇంత లేట్ వెనుక కారణం నిర్మాణ సంస్థ ఒప్పందం కాదని ఇన్ సైడ్ టాక్. వేర్వేరు రీజన్స్ వల్ల ఓటిటి వైపు నుంచే జాప్యం జరిగిందని అంటున్నారు. అసలే ఇప్పుడు ఇండస్ట్రీలో తీవ్ర చర్చ జరుగుతోంది. టాలీవుడ్ సినిమాలు ఏవైనా థియేటర్, ఓటిటి మధ్య కనీసం ఆరు నుంచి ఎనిమిది వారాల గ్యాప్ ఉండాలనే ప్రతిపాదన మీద నిర్మాతల మండలి సీరియస్ గా విశ్లేషణ చేస్తోంది. సాధ్యాసాధ్యాల గురించి డిస్కషన్లు జరుగుతూనే ఉన్నాయి. ఇలా చేయడం వల్ల చిన్న నిర్మాతలు నష్టపోతారని, పెద్ద ప్రొడ్యూసర్లు సైతం రెవిన్యూలో అధిక భాగం కోల్పోవాల్సి వస్తుందని, ముఖ్యంగా డిజాస్టర్లకు పెద్ద దెబ్బ పడుతుందని రకరకాల అభిప్రాయాలు వినపడుతున్నాయి. ఇలాంటి టైంలో భర్త మహాశయులకు విజ్ఞప్తి లేటుగా ఓటిటి ఎంట్రీ ఇవ్వడం ఆసక్తి రేపుతోంది. ఒకవేళ వ్యూస్ కనక భారీగా వస్తే అదో సానుకూల సంకేతంగా చూడొచ్చు. ఎందుకంటే థియేట్రికల్ గా భారీ వసూళ్లు తేని సినిమా రెండు నెలల తర్వాత కూడా డిజిటల్ లో జనాన్ని ఆకట్టుకుందంటే ఖచ్చితంగా ఆలోచించాల్సిన విషయం అవుతుంది. హిందీ, మలయాళం లాగా మనమూ లేట్ విండో అమలు చేయాలని అగ్ర నిర్మాతలు గట్టి ప్రయత్నాలే చేస్తున్నారు. అసాధ్యం కాదు కానీ అందరికీ ఒప్పించడం పెద్ద సవాల్ లాంటిది. ఏకాభిప్రాయం వస్తే పరిశ్రమకు మంచిదే. కాకపోతే ఓటిటిలు ఎలా రియాక్ట్ అవుతాయనేది చూడాలి.

## 'ఉస్తాద్' తప్పు దిద్దుకున్న బుక్ మై షో



ఒక బ్రేక్ తర్వాత సినిమాల్లోకి రీఎంట్రీ ఇచ్చాక వరుసగా రీమేక్ సినిమాలే చేస్తూ వచ్చాడు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్. అభిమానులతో పాటు ప్రేక్షకుల నుంచి వ్యతిరేకత వ్యక్తమైనా ఆయన పట్టించుకోలేదు. ఐతే ఈ రీమేక్ పరంపరకు గత ఏడాది బ్రేక్ పడింది. స్ట్రెయిట్ సినిమాలు హరిహర వీరమల్లు, ఓజీలతో ప్రేక్షకులను పలకరించాడు. వీటిలో తొలి సినిమా నిరాశపరిచినా.. రెండో చిత్రం మంచి ఫలితాన్నందుకుంది. ఇక పవన్ చేతిలో ఉన్న ఏకైక చిత్రం.. ఉస్తాద్ భగత్ సింగ్. ఇది తమిళ బ్లాక్ బస్టర్ 'తెరి'కి రీమేక్ అనే అభిప్రాయంతోనే మొదట్నుంచి అందరూ ఉన్నారు. కానీ 'ఉస్తాద్..' రీమేక్ కానే కాదంటూ ఇటీవలే దర్శకుడు హరీష్ శంకర్ నొక్కి వక్కాణించాడు. నా సినిమాలో ఒక ఎపిసోడ్‌ను తమ చిత్రంలో పెట్టుకున్న 'తెరి' మూవీని నేనెందుకు రీమేక్ చేస్తా, 'కథ-మాటలు-దర్శకత్వం' అని కార్డ్ ఎందుకు వేసుకుంటా అని ఆయన ప్రశ్నించారు. దీంతో ఇది స్ట్రెయిట్ మూవీనేలే అని ఫ్యాన్స్‌లో ఉత్సాహం వచ్చింది. ఐతే స్వయంగా దర్శకుడే మీడియా ఇంటర్వ్యూల ద్వారా ఈ విషయం మీద క్లారిటీ ఇచ్చాడు కానీ.. బుక్ మై షో వాళ్లు మాత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్' రీమేకే అని సంకేతాలు ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. ప్రతి సినిమాకు బుక్ మై షోలో సినాప్సిస్ ఇవ్వడం కామనే. చాలావరకు అది చిత్ర బృందం నుంచి తీసుకున్న సమాచారమే ఉంటుంది. ఐతే 'ఉస్తాద్..' కథా సారాంశం గురించి చెబుతూ.. ఒక ఐపీఎస్ అధికారి తన కూతురితో కలిసి అజ్ఞాతావాసంలో ఉంటాడని.. అంతకుముందు అతడి కుటుంబాన్ని కొందరు నాశనం చేస్తారని.. ఒక సందర్భంలో తన ఐడెంటిటీ బయటపడిపోవడంతో మళ్లీ తన కుటుంబాన్ని కాపాడుకోవడానికి ఆ అధికారి ఏం చేశాడన్నది ఈ కథ అని అందులో పేర్కొన్నారు. ఈ సినాప్సిస్ 'తెరి'దే అని ఆ సినిమా చూసిన వాళ్లందరికీ అర్థమైపోతుంది. దీంతో హరీష్ ఒకవైపు రీమేక్ కాదు మొర్రో అంటుంటే.. బీఎంఎస్ వాళ్లు మాత్రం ఇది 'తెరి' రీమేక్ అన్నట్లుగా సినాప్సిస్ ఇవ్వడమేంటి అని పవన్ ఫ్యాన్స్ అయోమయంలో పడిపోయారు. సోషల్ మీడియాలో దీని గురించి చర్చ జరిగింది.




## చైతూ విలన్... బాలీవుడ్ సందీప్ వంగ!



కొందరు సినీ ప్రముఖులు మాట్లాడుతుంటే అందరూ అలెర్ట్ అవుతారు. వాళ్ల మాటతీరు భయం గొల్పేలా ఉంటుంది. ఎప్పుడూ ఫైర్ మీద ఉన్నట్లుగా కనిపించే ఆ వ్యక్తులు.. ఎప్పుడు ఏం చేస్తారో అన్నట్లుగా కంగారు పుట్టిస్తుంటారు. 'అర్జున్ రెడ్డి'తో టాలీవుడ్లో సెన్సేషన్ క్రియేట్ చేసి... కబీర్ సింగ్, యానిమల్ మూవీస్‌లో బాలీవుడ్‌లోనూ ప్రకంపనలు రేపిన సందీప్ రెడ్డి వంగ ఈ కోవకే చెందుతాడు. ప్రెస్ మీట్లలో, ఇంటర్వ్యూల్లో, స్టేజ్ మీద మాట్లాడేటపుడు సందీప్ చాలా సీరియస్‌గా కనిపిస్తుంటాడు. తనకు ఎవరైనా బ్రేక్ వేయాలని చూస్తే గట్టి పంచ్ వేయడానికి వెనుకాడడు. ఇప్పుడు సందీప్ రెడ్డి వంగను గుర్తు చేసేలా ఒక యువ నటుడు మాట్లాడ్డం సోషల్ మీడియా దృష్టిని ఆకర్షిస్తోంది. ఆ నటుడి పేరు.. స్పర్శ్ శ్రీవాస్తవ. ఇతను బాలీవుడ్ క్లాసిక్ 'లాపతా లేడీస్'తో నటుడిగా చాలా మంచి పేరు సంపాదించాడు. అందులో అమాయకమైన పల్లెటూరి భర్త పాత్రలో స్పర్శ్ అదిరిపోయే పెర్ఫామెన్స్ ఇచ్చాడు. ఈ టాలెంటెడ్ యాక్టర్.. త్వరలోనే టాలీవుడ్లోకి అడుగు పెడుతున్నాడు. యువ సామ్రాట్ అక్కినేని నాగచైతన్య హీరోగా రూపొందుతున్న 'వృష కర్మ'లో స్పర్శ్ విలన్ పాత్ర చేశాడు. నిన్న రిలీజ్ చేసిన టీజర్లో అతనే హైలైట్ అయ్యాడు. టీజర్లోనే జనాలను భయపెట్టేశాడు స్పర్శ్.


ఐతే తెర మీదే కాదు.. బయట కూడా అతను జనాలను కాస్త కంగారు పెట్టేలాగే మాట్లాడాడు. టీజర్ లాంచ్ కార్యక్రమంలో అతను చాలా సీరియస్ స్పీచ్ ఇచ్చాడు. ఐతే స్పర్శ్ ఇప్పుడిప్పుడే తెలుగు నేర్చుకుంటున్నానంటూ ఇంగ్లీషులో మాట్లాడుతుంటే.. ఆడిటోరియంలో ఉన్న లేడీ జర్నలిస్ట్ గట్టిగా ఇంగ్లీష్ వద్దు అని చెప్పడంతో తను హిందీలో మాట్లాడడం మొదలు పెట్టాడు.. మళ్ళీ వెంటనే ఆవిడ అడ్డుచెప్పడంతో... నేను హిందీలో మాట్లాడే ప్రయత్నం చేస్తుంటే.. మీరు అడ్డుతగులుతున్నారంటూ.. వచ్చి మీరే మాట్లాడుకోండి అనేశాడు స్పర్శ్. దీంతో అక్కడ వాతావరణం కొంచెం వేడెక్కింది. స్పర్శ్ హావభావాలు, మాటతీరు చూస్తే అక్కడ ఉన్న వాళ్లకు సందీప్ రెడ్డి వంగనే గుర్తుకొచ్చాడు. బాలీవుడ్లోనూ ఒక వంగ ఉన్నాడంటూ.. యానిమల్ బీజీఎం వేసి కొందరు ఈ వీడియోను సోషల్ మీడియాలో వైరల్ చేస్తుండడం విశేషం.



# బిజినెస్ న్యూస్



## 25వేల బడ్జెట్‌లో ఫోన్ చూస్తున్నారా? మోటో నుంచి కొత్త ఫోన్



ఎడ్జ్ సిరీస్ ఫోన్లతో ఇండియన్ స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లో తనకంటూ ప్రత్యేక మార్క్ సంపాదించిన మోటోరొలా.. ఎడ్జ్ 70 సిరీస్‌లో కొత్త ఫోన్‌ను లాంచ్ చేసింది. బిగ్ బ్యాటరీతో ఎడ్జ్ 70 ఫ్యూజన్‌ను విడుదల చేసింది. రూ.25 వేల బడ్జెట్‌లో పేరొందిన బ్రాండ్‌లో మంచి స్మార్ట్‌ఫోన్ కోసం చూస్తున్నవారు ఈ ఫోన్‌ను పరిశీలించొచ్చు. ఇంతకీ ఈ ఫోన్ ఎలా ఉంది? అప్‌డేట్స్ మాటేంటి? మోటోరొలా ఎడ్జ్70 ఫ్యూజన్ 6.78 అంగుళాల సూపర్ హెచ్‌డీ 1.5ఖ ఎక్స్‌ట్రీమ్ అమోలెడ్ డిస్‌ప్లేతో తీసుకొచ్చారు. 144 ఎఓ, హెచ్‌డీఆర్ 10ం, 5,200 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్‌తో ఈ డిస్‌ప్లే పనిచేస్తుంది. కార్నింగ్ గొరిల్లా గ్లాస్ 7ఐ ప్రొటెక్షన్ ఉంది. స్నాప్‌డ్రాగన్ 7ఎస్ జెన్ 4 ప్రాసెసర్ ఇచ్చారు. ఔటాఫ్ ది బాక్స్ ఆండ్రాయిడ్ 16 ఆధారిత హెలోయూఐతో పనిచేస్తుంది. 3 ఏళ్ల పాటు ఓఎస్ అప్‌డేట్స్, ఐదేళ్ల పాటు సెక్యూరిటీ అప్‌డేట్స్ ఇస్తామని కంపెనీ హామీ ఇస్తోంది. 50 ఎంపీ సోనీ ఎల్‌వైటీ-710 ప్రధాన కెమెరా ఉంది. 13 ఎంపీ అల్ట్రావైడ్ కెమెరా, 3 ఇన్ 1 లైట్ సెన్సర్ ఇచ్చారు. ముందువైపు 32 ఎంపీ కెమెరా ఉంది. ఇందులోని 7000 ఎంఏహెచ్ బ్యాటరీ 68ఔ టర్బోపవర్ ఫాస్ట్ ఛార్జింగ్‌కు సపోర్ట్ చేస్తుంది. దీని బరువు 193 గ్రాములు. ఇక ధర విషయానికొస్తే.. మోటో ఎడ్జ్ 70 ఫ్యూజన్ మూడు వేరియంట్లలో లభిస్తుంది. 8జీబీం 128జీబీ వేరియంట్ రూ.26,999, 8జీబీం 256జీబీ వేరియంట్ ధర రూ.29,999, 12జీబీం 256జీబీ వేరియంట్ ధర రూ.32,999గా నిర్ణయించారు. హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్ బ్యాంక్ క్రెడిట్ కార్డులతో కొనుగోళ్లపై రూ.2 వేలు ఇన్‌స్టంట్ డిస్కౌంట్ లభిస్తుంది. లేదా పాత ఫోన్ ఎక్స్ఛేంజీపై రూ.2వేలు అదనంగా ఇస్తోంది. దీంతో ఈ ఫోన్ ధర రూ.24,999 నుంచే ప్రారంభమవుతుంది. మార్చి 12 నుంచి ఫ్లిప్‌కార్ట్, మోటో వెబ్‌సైట్, రిటైల్ స్టోర్లలో విక్రయాలు ప్రారంభం కానున్నాయి. నేటి (మార్చి 6న) మధ్యాహ్నం 12 గంటల నుంచి 4 గంటల మధ్య ఫ్లిప్‌కార్ట్‌లో ఎర్లీబర్డ్ సేల్ నిర్వహించనున్నారు.


## టెస్లా కార్లకు యాక్సిస్ బ్యాంక్ లోన్లు




ఎలక్ట్రిక్ వాహనాల దిగ్గజం టెస్లాకు ప్రిఫర్డ్ ఫైనాన్సర్‌గా వ్యవహరించే దిశగా ఒప్పందం కుదుర్చుకున్నట్లు యాక్సిస్ బ్యాంక్ తెలిపింది. దీనితో దేశవ్యాప్తంగా టెస్లా కస్టమర్లకు ప్రత్యేక రుణ సదుపాయాలను అందించనున్నట్లు వివరించింది. ప్రధాన నగరాలు, వర్ధమాన ఈవీ హబ్‌లలో డిజిటల్ ఫైనాన్సింగ్ ఆప్షన్లు అందుబాటులో ఉంటాయని పేర్కొంది. ప్రీమియం ఈవీ కొనుగోలుదారుల కోసం అనువైన రీపేమెంట్ పథకాలు, గరిష్ఠంగా 10 ఏళ్ల రుణ వ్యవధి, డిజిటల్ ఆన్‌బోర్డింగ్ మొదలైన సౌకర్యాలతో రుణాలను అందించనున్నట్లు యాక్సిస్ బ్యాంక్ ఈడీ మునీష్ శర్దా తెలిపారు. ఈ భాగస్వామ్యంతో టెస్లా వాహనాల కొనుగోలు ప్రక్రియ మరింత సులభతరం అవుతుందని బ్యాంక్ వర్గాలు తెలిపాయి. కస్టమర్లు డీలర్‌షిప్‌ల వద్దే లేదా ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా తక్షణ రుణ ఆమోదం పొందే విధంగా వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. దీంతో భారతదేశంలో ప్రీమియం ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరగడంతో పాటు ఈవీ మార్కెట్ విస్తరణకు కూడా ఈ ఒప్పందం దోహదపడుతుందని పరిశ్రమ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

## బేర్ మళ్లీ వచ్చింది: భారీ నష్టాల్లో ముగిసిన సూచీలు

దేశీయ స్టాక్ మార్కెట్‌లు మరోసారి భారీ నష్టాల్లో ముగిశాయి. నిన్నటి ట్రేడింగ్ సెషన్‌లో లాభాలు చవిచూసిన సూచీలు.. ఒక్కరోజు తిరగక ముందే మళ్లీ బేర్ గుప్పిట్లోకి వెళ్లాయి. సెన్సెక్స్ వెయ్యి పాయింట్ల మేర పతనం కాగా.. నిఫ్టీ 24,500 మార్కు దిగువన ముగిసింది. ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ మధ్య నెలకొన్న యుద్ధం మున్ముందు మరింత తీవ్ర రూపం దాలుస్తుందన్న భయాలు సూచీలను పడేశాయి. 'అసలు కథ ఇప్పుడే మొదలైందంటూ' అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ చేసిన వ్యాఖ్యలు దీనికి ఆజ్యం పోశాయి. సెన్సెక్స్ ఉదయం 79,658.99 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 80,015.90) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కొనసాగింది. ఆరంభంలో ఓ మోస్తరు నష్టాల్లో కొనసాగిన సూచీ.. ఆఖర్లో మరింత అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొంది. దీంతో ఇంట్రాడేలో 78,812.18 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 1097 పాయింట్ల నష్టంతో 78,918.90 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 315.45 పాయింట్ల నష్టంతో 24,450.45 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం 91.74గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఎటర్నల్, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ స్టాక్స్ ప్రధానంగా నష్టపోయాయి. బీఈఎల్, రిలయన్స్, సన్‌ఫార్మా, ఎన్టీపీసీ, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ స్టాక్స్ లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 86.98 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 5082 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. కారణాలు ఇవీ..




ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ మధ్య నెలకొన్న యుద్ధం ఇప్పుడే ముగిసే సూచనలు కనిపించడం లేదు. అసలు యుద్ధం ఇప్పుడే మొదలైందంటూ అమెరికా రక్షణ మంత్రి పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా ఇరాన్‌పై యుద్ధం విషయంలో టైమ్ లిమిట్ అంటూ ఏమీ పెట్టుకోలేదని వ్యాఖ్యానించడం యుద్ధం దీర్ఘకాలం కొనసాగొచ్చన్న అంచనాలు మదుపర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి.

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తలతో చమురు ధరలు గరిష్ఠ స్థాయి వద్ద కొనసాగుతుండడం కూడా దిగుమతులపై ఆధారపడే మన దేశంపై ప్రతికూల ప్రభావం చూపుతుందన్న భయాలు నెలకొన్నాయి. ద్రవ్యోల్బణం, వృద్ధిపై భయాలు నెలకొన్నాయి.

దేశీయ ఈక్విటీ మార్కెట్‌లో విదేశీ సంస్థాగత మదుపర్ల అమ్మకాలు కొనసాగుతున్నాయి. నిన్నటి ట్రేడింగ్ సెషన్‌లో రూ.3762 కోట్ల విలువైన షేర్లు విక్రయించినట్లు ఎన్ఎస్ఈ డేటా చెబుతోంది. ఒక్క మార్చి నెల్లో రూ.21,436 కోట్ల విలువైన షేర్లను ఎఫ్ఐఐలు విక్రయించడమూ ప్రతికూల ప్రభావం చూపింది.

## టాటా స్టీల్ రూ. 11,000 కోట్ల పెట్టుబడులు




అధునాతన గ్రేడ్ ఉక్కును తయారు చేసే దిశగా జంషెడ్‌పూర్ ప్లాంటుపై రూ. 11,000 కోట్లు ఇన్వెస్ట్ చేసే ప్రణాళికలు ఉన్నట్లు టాటా గ్రూప్ చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ తెలిపారు. ఇందుకోసం తాము రూపొందించిన టెక్నాలజీతో ఉక్కు ప్రాసెసింగ్ వేగవంతమవుతుందని, అలాగే కర్బన ఉద్గారాలు కూడా తగ్గుతాయని చెప్పారు. నెదర్లాండ్స్‌లో ప్రయోగాత్మక పరీక్షలు విజయవంతం అయిన నేపథ్యంలో 2030 నాటికి జంషెడ్‌పూర్‌లో 1 మిలియన్ టన్నుల వార్షిక సామర్థ్యంతో యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు చంద్రశేఖరన్ చెప్పారు. హైడ్రోజన్ ట్రక్కులపై కూడా టాటా మోటర్స్ ఇన్వెస్ట్ చేయనున్నట్లు వివరించారు. ఇక జార్ఖండ్‌లో వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టే అవకాశాలను పరిశీలించేందుకు నిపుణుల కమిటీని టాటా గ్రూప్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

# ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక

99 రోజుల కార్యాచరణ ప్రణాళికకు శ్రీకారం

కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్,జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్






**జగిత్యాల,మార్చి 06(నేటి మన దేశమ్ ప్రతినిధి):**:ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక లో భాగంగా రూపొందించిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమాన్ని శుక్రవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్,జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను విజయవంతంగా అమలు చేయాలని ప్రతిజ్ఞ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.అనంతరం ముఖ్యంగా పట్టణ పరిశుభ్రత, పారిశుద్ధ్యం అంశంపై చర్చించారు. పట్టణంలో పరిశుభ్రతను మెరుగుపరచి,ప్రజలకు శుభ్రమైన వాతావరణాన్ని అందించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.అలాగే 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా అభివృద్ధి పనులను వేగవంతం చేసి ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.అనంతరం అధికారులు వార్డుల్లో తిరిగి డ్రైనేజీ వ్యవస్థ,నల్లా నీటి సరఫరా పరిస్థితులను పరిశీలించారు.అలాగే వార్డుల్లో నిర్మాణ దశలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల పనులను కూడా పరిశీలించి, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూరాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం మరియు సమగ్ర అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని చేపట్టిన ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా రూపొందించిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా పట్టణాల్లో పారిశుధ్యం, తాగునీరు, డ్రైనేజీ, గృహ నిర్మాణం వంటి ముఖ్యమైన సమస్యలను ప్రాధాన్యతగా పరిష్కరించనున్నట్లు తెలిపారు.పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, ప్రజలు కూడా అధికారులతో కలిసి పరిశుభ్రత కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఆయన సూచించారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.99 రోజుల కార్యాచరణ ప్రణాళికను సమన్వయంతో అమలు చేసి జగిత్యాల పట్టణ అభివృద్ధికి తోడ్పడాలని ఆయన కోరారు.జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరచడం, అభివృద్ధి పనులను వేగవంతం చేయడం ప్రధాన లక్ష్యమని తెలిపారు.ప్రత్యేకంగా పట్టణాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచడం, డ్రైనేజీ వ్యవస్థను సక్రమంగా నిర్వహించడం, కార్యాలయాల పరిశుభ్రత, పన్నుల వసూళ్లు, ఫైళ్ల క్లియరెన్స్,తాగునీటి సరఫరాను నిరంతరం అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వార్డుల్లో నెలకొన్న సమస్యలను వార్డుల సందర్శన ద్వారా గుర్తించి తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు.అలాగే నిర్మాణ దశలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల పనులను వేగవంతంగా పూర్తి చేసి లబ్ధిదారులకు త్వరగా అందేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ప్రతి శాఖ సమర్థవంతంగా పని చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) బి. రాజ గౌడ్, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి, కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ స్పందన, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి కౌన్సిలర్ లు వాకౌట్ చేశారు



**కామారెడ్డి,మార్చ్ 06. (నేటి మనదేశమ్ ప్రతినిధి)**ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ఉందని కౌన్సిలర్ లను పిలిచి కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయకపోగా కమిషనర్ ఒంటెద్దు పోకడ పోతున్నారని బీజేపీ కౌన్సిలర్ లు విమర్శించారు.మున్సిపల్ కార్యాలయంలో బీజేపీ కౌన్సిలర్ లు మోటారీ శ్రీకాంత్, ఆకుల సుజిత మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్ ఒంటెద్దు పోకడ విచారకరం అని, కొత్త పాలకవర్గం ఎన్నికై 20 రోజులు కావస్తున్న ఇప్పటికీ మున్సిపల్ పాలక వర్గ సమావేశం పెట్టలేదు అని అన్నారు. కనీసం అధికారులతో పరిచయ కార్యక్రమం పెట్టలేదు అని, వార్డు కౌన్సిలర్ లు సమస్యల విషయమై ఎవరికి చెప్పాలని, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం కూడా థూ థూ మంత్రంగా కొనసాగించే ప్రయత్నం చేస్తున్నారు అని అన్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించేందుకు బీజేపీ ఎప్పుడు ముందుంటుందని, సమస్యల పరిష్కారం కోసం బీజేపీ పోరాటం చేస్తుందని అన్నారు.కార్యక్రమాన్ని బీజేపీ కౌన్సిలర్ లు వాకౌట్ చేసి నిరసన తెలియజేశారు.

# విద్యాశాఖ ప్రత్యేక కార్యదర్శిని కలిసిన మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు..



**ఆసిఫాబాద్, మార్చి 06: (నేటి మనదేశమ్):** : డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ ప్రత్యేక కార్యదర్శి వెంకటేష్ ధోత్రే ను ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఇటీవల తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన పబ్లిక్ స్కూల్స్‌ను ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని అన్ని మండలాలకు కేటాయించాలని మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు కోరారు. నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన విద్యాశాఖ ప్రత్యేక కార్యదర్శి వెంకటేష్ ధోత్రే మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంగా విద్యాశాఖ బాధ్యతలు నిర్వహిస్తున్నందున విద్యాభివృద్ధి, పాఠశాలల మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆసిఫాబాద్ జిల్లాకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట కాంగ్రెస్ యువ నాయకుడు గుంపుల విమలేష్ ఉన్నారు..

# పదో తరగతే భవిష్యత్ కు తొలిమెట్టు

కష్టపడి కాదు.. ఇష్టపడి చదవాలి


6వ వార్డు కౌన్సిలర్ శిరీష -శేఖర్ రెడ్డి

పదో తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్లు, పెన్నుల పంపిణీ



**కోరుట్ల మార్చి 06(నేటి మనదేశమ్ ప్రతినిధి)**:విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కు పదో తరగతే తొలిమెట్టు అని, ఇక్కడ వేసుకునే పునాదే ఉన్నత చదువులకు బాటలు వేస్తుందని 6వ వార్డు కౌన్సిలర్ శిరీష -శేఖర్ రెడ్డి అన్నారు. పట్టణంలోని 6వ వార్డు ఏకీన్‌పూర్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కౌన్సిలర్ శిరీష శేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువును భయంతో కాకుండా ఇష్టపడి చదవాలని, అప్పుడే ఉత్తమ మార్కులు సాధించగలుగుతారని విద్యార్థులకు సూచించారు.ఆనంతరంపాఠశాల ప్రధానోపాధ్యాయులు మార్గం రాజేంద్ర ప్రసాద్, మాట్లాడుతూ.. పరీక్షల సమయం దగ్గరపడుతున్నందున తల్లిదండ్రులు పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులను టీవీలు, మొబైల్ ఫోన్లకు పూర్తిగా దూరంగా ఉంచాలని కోరారు. తరగతి గదిలో రోజువారీగా బోధించిన సబ్జెక్టులను, ప్రశ్నపత్రాలను ప్రతిరోజూ ఇంట్లో ఒకటికి రెండుసార్లు చదివేలా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైనే ఉందన్నారు.త్వరలో జరగనున్న బోర్డు (పబ్లిక్) పరీక్షల పట్ల విద్యార్థులు ఎలాంటి ఆందోళన, భయం చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రణాళికాబద్ధంగా (టైమ్ టేబుల్ ప్రకారం) చదివితే మంచి గ్రేడ్లు సాధించవచ్చని భరోసా ఇచ్చారు. పరీక్షల సరళి, సమయపాలన గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. చదువులో ఎలాంటి సందేహాలు ఉన్నా వెంటనే తమను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షల నిమిత్తం ఎగ్జామ్ ప్యాడ్లు, పెన్నులు, పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, శ్రీనివాస స్వామి,రాజిరెడ్డి, సంజీవరాణి, చైత్ర, లత, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లారెడ్డి మున్సిపల్ అభివృద్ధికి కృషి చేద్దాం - మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ భాగ్యమ్మ




**కామారెడ్డి,మార్చ్ 06.(నేటి మనదేశమ్ ప్రతినిధి)** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా ఎల్లారెడ్డి మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేద్దామని మున్సిపల్ వైస్ చైర్మన్ భాగ్యమ్మ పిలుపునిచ్చారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో 99 రోజుల కార్యచరణ కార్యక్రమంలో భాగంగా ఎల్లారెడ్డి అభివృద్ధికి కృషిచేద్దామని మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ మరియు సిబ్బందితో కలిసి ఆమె ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ శ్రీమతి మత్తమాల భాగ్యవతి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల "ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక" ను ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ సహకారంతో మున్సిపల్ పరిధిలో సమర్థవంతంగా అమలు చేయాలని, ప్రభుత్వ అధికారులను.. మహిళా సంఘాలకు, ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో అన్ని వార్డులో శుభ్రత కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు పరిశుద్ధం పై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. మున్సిపల్ పరిధిలో అన్ని వార్డులలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని అన్నారు. అన్ని వార్డుల్లో శుభ్రత కార్యక్రమాలు నిర్వహించి పరిశుద్ధంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సిద్ధి శ్రీధర్, దశరథ్, చంద్రయ్య, మున్సిపల్ కమిషనర్ మహేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రశాంత్ గౌడ్, శ్యామ్, రఫిక్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# అలియాబాద్‌లో శ్రమదానంతో పరిశుభ్రత ప్రతిజ్ఞ





**శామీర్‌పేట ,మార్చి 06: (నేటి మనదేశమ్):** అలియాబాద్ పురపాలక సంఘం పరిధిలో 'ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక'లో భాగంగా అమలు చేస్తున్న 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కింద శుక్రవారం పట్టణ పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కంఠం శిరీష కృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో శ్రమదానం చేసి పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేశారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ కమిషనర్,సిబ్బంది సహకారంతో పారిశుధ్య కార్యక్రమాలను సమర్థంగా నిర్వహించి అలియాబాద్ మున్సిపాలిటీని ముందువరుసలో నిలిపేందుకు కృషి చేస్తామని తెలిపారు.కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్, వైస్ చైర్‌పర్సన్ కన్‌రెడ్డి మాలతి, వార్డు కౌన్సిలర్లు గాదె వెంకటేష్, గూదె వెంకటేష్, కైరా గణేశ్, ముద్దం సుధాకర్ రెడ్డి, కోడూరి మౌనిక, సరసం వనజ, జస్వంత్ రెడ్డి, అప్పవత్ వెంకటేష్, ఏఈఈ సనా షాహీన్, ఇంచార్జి మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి, ఇంచార్జ్ రెవెన్యూ ఆఫీసర్ వేణుగోపాల్, ఇంచార్జ్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్, నాయకులు కంఠం కృష్ణ రెడ్డి, కోడూరి దినేష్, తూము శ్యామ్, మహిళా సంఘాలు, పట్టణ వాసులు పాల్గొన్నారు.

# అంగరంగా వైభవంగా శివపార్వతుల కళ్యాణం

- లక్షలాది మంది భక్తుల సందడి





**వేములవాడ, మార్చి 06: నేటి మన దేశమ్ ప్రతినిధి** తెలంగాణలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న శివకళ్యాణ మహోత్సవాల్లో భాగంగా శివపార్వతుల కళ్యాణం ఘనంగా నిర్వహించారు.కన్యాదాత దంపతులుగా ఈశ్వరగారి సురేష్, నాగలక్ష్మి, ఆలయ ఈఓ ఎల్ రమాదేవి వారికి పట్టు వస్త్రాలను అందజేశారు.వేములవాడ మున్సిపాలిటీ తరపున ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్, మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్, మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లు కుటుంబ సమేతంగా హాజరై స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు.భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గీత బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు.కళ్యాణానికి విచ్చేసిన భక్తులకు త్రాగునీరు, అన్నప్రసాదం వంటి ఏర్పాట్లు చేసి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు.శివపార్వతుల కళ్యాణం అంగరంగ వైభవంగా విజయవంతంగా నిర్వహించబడిందని ఆలయ ఈఓ ఎల్ రమాదేవి తెలిపారు. వేడుకలో శివపార్వతులు, జోగినీలు, హిజ్రాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ వేడుకల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులు, పట్టణ ప్రజలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఆరోగ్య సంరక్షణలో దంత వైద్యుల పాత్ర కీలకం

- ప్రముఖ దంత వైద్యుడు, ఇంప్లాంటాలజిస్ట్ డాక్టర్ హరి విక్రమ్



**జగిత్యాల మార్చి 06(నేటి మన దేశమ్ ప్రతినిధి)**:నోటి లోపల వివిధ రకాల వ్యాధులను నివారించడంలో, చికిత్స చేయడంలో దంత వైద్యులు కీలక పాత్ర పోషిస్తారని ప్రముఖ దంత వైద్య నిపుణులు, ఇంప్లాంటా లజిస్ట డాక్టర్ హరి విక్రమ్ ( అభిషేక్ సూపర్ స్పెషాలిటీ దంత వైద్య శాల బ్రాహ్మణ వాడ జగిత్యాల )అన్నారు.శుక్రవారం జిల్లా కేంద్రంలో తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో జాతీయ దంత వైద్య దినోత్సవం ను నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హరి విక్రమ్ కు పుష్పగుచ్చములు అందించి శాలువాలతో సన్మానించారు.అనంతరం డాక్టర్ హరి విక్రమ్ మాట్లాడు తూ దంత పరిశుభ్రత లేకపోతే చిగుళ్ల వ్యాధులు, గుండె జబ్బులు వంటి అనారోగ్య సమస్యలు తలెత్తుతాయాన్నారు.ఈ సందర్భంగా రిటైర్డ్ తహసీల్దార్ పి. హన్మంత్ రెడ్డి, సీనియర్ సిటిజెన్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరి శెట్టి విశ్వ నాథములు మాట్లాడు తూ దంత సమస్యలు నివా రించడానికి అత్యుత్తమ , చికిత్స చేయడంలో డాక్టర్ హరి విక్రమ్ జిల్లాలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు.ఈ కార్యక్రమం లో సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్, సీనియర్ సిటిజెన్స్, పెన్షనర్ల నాయకులు పూసాల అశోక్ రావు, నాయిని సంజీవ రావు, కొయ్యడ సత్యనారాయణ, ఎం. డి. యాకూబ్, టీ బీసీ మహిళా జేఏ సీ జిల్లా అధ్యక్షురాలు కస్తూరి శ్రీమంజరి, గంగము జలజ, సింగం పద్మ, కరుణ, విజయలక్ష్మి, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# వేములవాడలో భక్తులకు పులిహోర ప్రసాదం పంపిణీ

**వేములవాడ, మార్చి 6: నేటి మన దేశమ్ ప్రతినిధి** వేములవాడ బద్దిపోచమ్మ వీధిలోని శ్రీ రాజరాజేశ్వర వ్యాపారుల సంఘం ఆధ్వర్యంలో రాజన్న సన్నిధిలో జరిగిన శివకళ్యాణ మహోత్సవం సందర్భంగా భక్తులకు పులిహోర ప్రసాదం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సంఘం అధ్యక్షులు పిన్నింటి హన్మాండ్లు ఆధ్వర్యంలో సుమారు 300 మంది భక్తులకు పులిహోర పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు ప్రతాప్ రామకృష్ణ, సభ్యులు యెల్ల పోశెట్టి, కూర దేవయ్య, నక్క వేణు, కుసా హరీష్, బెంద్రం తిరుపతిరెడ్డి, వంగల శ్రీధర్, గంప రాజు, ముద్ర కోలా, లింబాద్రి, మంత్రి రమేష్, వ్యాస్ గణేష్, బొడ్ల రమేష్, దయ్యాల శ్రీనివాస్, గజవాడ శ్రీనివాస్, చాడ రాజేష్, ఎల్ల శ్రీనివాస్, అంకం రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# రైల్వేజోన్ కార్యకలాపాలు వెంటనే ప్రారంభించాలి

## ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజ శర్మ



**విశాఖపట్నం మార్చి 06 (నేటి మనదేశమ్) :** భవన నిర్మాణాలతో నిమిత్తం లేకుండా విశాఖ రైల్వేజోన్ కార్యకలాపాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే ప్రారంభించాలని, ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజ శర్మ డిమాండ్ చేశారు. గురువారం అజశర్మ నేతృత్వంలో వేదిక బృందం విశాఖపట్నం, ముడసర్లోవ ప్రాంతంలో నిర్మిస్తున్న రైల్వే జోన్ భవన నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించి పరిశీలించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో ఈనెల1 నుంచి 5 వరకే ప్రధాన సమస్యల అధ్యయనానికి చేపట్టిన పర్యటనలో భాగంగా 52 ఎకరాలలో నిర్మిస్తున్న రైల్వే జోన్ భవన సముదాయం పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు పనులు ఏదశలో ఉన్నాయి, ఎప్పటిలోగా పూర్తవుతాయనే అంశాలపై ఇంజనీరింగు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ, 2014లో రాష్ట్ర విభజన చట్టంలో విశాఖ రైల్వేజోన్ ఏర్పాటును ప్రకటించగా, పలు ఆందోళనల తర్వాత పదేళ్లకు పనులు మొదలెట్టారన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పనులు పూర్తయ్యేందుకు మరో రెండేళ్లయినా పడుతుందన్నారు. అంతవరకు ఆగకుండా రైల్వేజోన్ కార్యకలాపాలను ప్రారంభించాలన్నారు. విశాఖలో రైల్వేకుపెద్ద ఎత్తున భూములు, 700 ఎకరాలు ఖాళీ స్థలాలు, ఖాళీగా డిఆర్ఎం కార్యాలయం కూడా ఉందన్నారు. వాటిల్లో తాత్కాలికంగా జోన్ కార్యకలాపాలను ప్రారంభించి, శాశ్వత భవన నిర్మాణాలు పూర్తయితే అందులోకి మారే అవకాశం ఉన్నందున ఆ దిశగాచర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సందర్శనలో కె.సత్యనారాయణ, కె.వెంకటరావు, ఎన్.నాగేశ్వర్రావు, పిట్లా నారాయణమూర్తి, వి.నరేంద్రకుమార్, పి.శంకర్, ఐ,సి.నాయుడు, నాగరాజు పాల్గొన్నారు.

**దళితుల భూములను దౌర్జన్యంగా లాక్కోవడం తగదు**

ఆనందపురం: గూగుల్ డేటా సెంటర్ పేరుతో దళితుల భూములను బలవంతంగా స్వాధీనం చేసుకోవడం సరికాదని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ అజ శర్మ అన్నారు. గురువారం తర్లువాడ గ్రామాన్నిసందర్శించి గూగుల్ డేటా సెంటర్‌కు కేటాయించిన భూములను వేదిక బృందం పరిశీలించింది. అక్కడి రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అజ శర్మ మాట్లాడుతూ, దళితులకు ఇచ్చిన డిపట్టా భూముల్లో జీడి, మామిడి తోటలు వేసుకుని జీవనోపాధి పొందుతున్న నేపథ్యంలో వాటిని గూగుల్ డేటా సెంటర్‌కు తీసుకోవడం సరికాదన్నారు. 250 మంది దళితులు సాగులో ఉన్నప్పటికీ 49 మందికి మాత్రమే పట్టాలు ఉన్నాయని, అయినప్పటికీ సాగుదారులైన దళితులందరికీ 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం, ప్యాకేజీ చెల్లించి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటైతే పరిసర గ్రామాలను కూడా తరలించే పరిస్థితి రావచ్చున్నారు. భూములు పరిశీలించిన వారిలో ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక విశాఖ జిల్లా కో కన్వీనర్ కూన వెంకట్రావు, కన్వీనర్ ఎన్ నాగేశ్వరరావు ఉత్తరాంధ్ర జర్నలిస్టుల సంఘం జనరల్ సెక్రెటరీ కె సత్యనారాయణ, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి అంబేద్కర్, సిఐటియు జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ మణికుమార్ పాల్గొన్నారు

# నెయ్యికల్తీపై వాస్తవాలు వెలుగులోకి రావాలి

## – ఎంత పెద్దవారున్నా శిక్షపడాలి – సినీ నటుడు సుమన్



**తిరుపతి (మంగళం) మార్చి 06 (నేటి మనదేశమ్) :** ‘తిరుమల స్వామివారి లడ్డూలో ఉపయోగించే నెయ్యిలో కల్తీ జరిగిందనే అంశంపై దేశ వ్యాప్తంగా శ్రీవారి భక్తులు బాధపడు తున్నారు. నేను ఎక్కడికి వెళ్లినా ఇదే అంశాన్ని అడుగు తున్నారు. ఇందులో నిజాలు వెలుగులోకి వచ్చేలా కమిటీ విచారణ జరగాలి. ఎంత పెద్దవారున్నా శిక్షపడాలి అని సినీ నటుడు సుమన్ కోరారు. తిరుపతిలోని తిరు మలనగర్‌లో గురువారం ఆయన నటించిన ధర్మస్థల నియోజకవర్గం సినిమా ప్రమోషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ‘వేంకటేశ్వరస్వామిగా నటించిన మీరు లడ్డూ కల్తీ వ్యవహారంపై మీ అభిప్రాయం చెప్పండి’ అని మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా ఆయన మాట్లాడారు. ‘కల్తీ జరిగిందని ఊరికే ఆరోపణలు చేయడం కాదు. దాన్ని నిరూపించేలా బలమైన విచారణ జరగాలి. ఇప్పటివరకు జరిగిన విచారణలో కల్తీ జరిగిందని కొందరు, జరగలేదని కొందరు వాదనలకు దిగుతున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిని కోరుతున్నా, ఒక సిన్సియర్ కమిటీని పెట్టండి. బలమైన ఇన్వెస్టిగేషన్ టీమ్‌ను పెట్టి నిజాలు వెలుగులోకి తేవాలి. కల్తీ జరిగి ఉంటే అందులో ఎంతపెద్ద అధికారి ఉన్నా, నాయకులు ఉన్నా శిక్ష పడేలా చూడాలి. కల్తీకి పాల్పడినవారు మళ్లీ తిరుమల, తిరుపతి దేవస్థానంలో అడుగు పెట్టకుండా చర్యలు తీసుకోవాలి’ అని కోరుతున్నానని

# శ్రీకూర్మక్షేత్రంలో డోలోత్సవం



**గార, మార్చి 06 (నేటి మనదేశమ్) :** శ్రీకూర్మక్షేత్రంలో డోలోత్సవాల్లో భాగంగా మూడో రోజు శుక్రవారం ఉదయం శ్రీదేవి భూదేవి సమేత గోవందరాజస్వామివారిని మేళతాళాలతో తిరువీధిగా డోల మండపానికి అర్చకులు తీసుకెళ్లి అక్కడ ఊయల్లో ఉంచారు. ఈ సందర్భంగా స్వామివారికి దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్తలు విజయనగర పూసపాటి గజపతుల గోత్రనామాలతో అర్చకులు ప్రత్యేక ఊజలు నిర్వహించారు. అనంతరం స్వామిని భక్తులు ఉత్తరాభిముఖంగా దర్శించు కొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు చామర్ల సీతారామ నరసింహాచార్యులు వైదిక కార్య క్రమాన్ని నిర్వహించారు. అలాగే భక్తులకు శ్రీకూర్మం నవజీవన్ బ్రాంచ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు.

# పర్యాటక ప్రాజెక్టుల పురోగతిపై సమీక్ష



**విశాఖపట్నం మార్చి 06 (నేటి మనదేశమ్) :** రాష్ట్ర ప్రభుత్వం సిఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ సందర్భంగా పర్యాటక రంగంలో కుదుర్చుకున్న 43 ఒప్పందాలను సాధ్యమైనంత త్వరగా కార్యరూపంలోకి తీసుకురావాలని మెట్రో పాలిటన్ కమిషనర్ ఎన్.తేజ్ భరత్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, ఈ ప్రాజెక్టుల పురోగతిని పర్యవేక్షించేందుకు ఏర్పాటుచేసిన ప్రత్యేక కమిటీ సమీక్షా సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, పర్యాటక ప్రాజెక్టుల స్థాపనలో ఎదురవుతున్న అడ్డంకులను వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో అధిగమించాలని సూచించారు. ముఖ్యంగా పర్యాటక ప్రాంతాల్లో నిర్మాణాలకు సంబంధించి నేవీ, ఎయిర్‌పోర్స్ అథారిటీ, జివిఎంసి వంటి సంస్థల నుండి రావాల్సిన అనుమతులు సత్వ రమే మంజూరయ్యేలా చేసి, పెట్టుబడిదారులు పనులు ప్రారంభించేలా చర్యలు తీసు కోవాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ముఖ్య గణాంకాధికారి హరిప్రసాద్, జిల్లా పర్యాటక శాఖాధికారి మాధవి, జివిఎంసి, యుసిడి, కెపిఎంజి కన్సల్టెంట్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# అంధుల పాఠశాలలో సేవా కార్యక్రమాలు







**మధురవాడ, మార్చి 06 (నేటి మనదేశమ్) :** గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ విభాగం ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ఆధ్వర్యంలో గురువారం సాగర్ నగర్‌లోని అంధబాలికల పాఠశాలలో గీతం ఆర్కిటెక్చర్ డీన్, డైరక్టర్ విభూతి సత్యదేవ్ ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. గీతం ఎన్ఎస్ఎస్.ప్రోగ్రామ్ ఆఫీసర్ మర్రి జ్యోతి ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొని పాఠశాల విద్యార్థులకు ఆరోగ్యం, పరిశుభ్రత, సమాజ సంక్షేమం, టెక్నాలజీపై వివరించారు. వివిధ పోటీలను, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. పాఠశాల విద్యార్థులకు కంప్యూటర్‌పై అవగాహన కల్పించారు. డిజిటల్ టెక్నాలజి గురించి వివరించారు. పాఠశాల విద్యార్థులకు వైద్య శిబిరాన్ని నిర్వహించడంతో పాటు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత ఃగుడ్‌టచ్–బ్యాడ్ టచ్ః అంశాలపై అవగాహన నిర్వహించారు. అంధ విద్యార్థులకు బ్రెయిలీ అక్షరాల ప్యానెల్, చారిత్రక కట్టడాల స్పర్శ నమూనాలు, స్పర్శ మ్యాప్‌లు, చిహ్నాలను ఎన్ఎస్ఎస్ వలంటీర్లు స్వయంగా తయారు చేశారు. విద్యార్థుల జ్ఞానేంద్రియ శిక్షణను మెరుగుపరచడానికి కూరగాయల తోట, సెన్సరీ గార్డెన్‌చ చెప్పులు లేకుండా నడిచే సెన్సరీపాత్‌వే ఏర్పాటు చేశారు. గీతం ఎన్ఎస్ఎస్ వలంటీర్లను అంధుల పాఠశాల ప్రిన్సిపాల్ విజయ అభినందించారు కార్యక్రమంలో ఐజిబిసి కోఆర్డినేటర్ దివ్యహరిణి పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలుకు పటిష్ట కార్యాచరణ సిద్ధం : జెసి




**భీమవరం, మార్చి 06 (నేటి మనదేశమ్) :** రబి సీజన్ ధాన్యం కొనుగోలుకు అధికారులు పటిష్ట కార్యాచరణ సిద్ధం చేయాలని జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లో గురువారం పౌర సరఫరాలు, వ్యవసాయ, సహకార, రవాణా శాఖలు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులతో ధాన్యం కొనుగోలు ఏర్పాట్లపై సమీక్షించారు. ఈనెల 20వ తేదీ తర్వాత రైతుల నుండి ధాన్యం కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. తాడేపల్లిగూడెం, పెంటపాడు, తణుకు, గణపవరం మండలాల్లో ఇకెవైసి నూరు శాతం పూర్తి చేయాలన్నారు. తేమ శాతం కొలిచే యంత్రాలను క్యాలిబ్రేషన్ పూర్తి చేయాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంక టేశ్వరరావు, జిల్లా పౌర సరఫరాల అధికారి ఎన్.సరోజ, మేనేజర్ ఎమ్‌డి ఇబ్రహీం పాల్గొన్నారు. జిల్లాలోని ఆక్వా రైతుల సమస్యలపై జెసి కలెక్టరేట్‌లో మత్స్య శాఖ, తూనికలు– కొలతలు, కమర్షియల్ టాక్స్, ఎంపెడ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని అన్ని ఆక్వా రైతులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ పొందాలని, అధికారులు రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

కేంద్ర ప్రభుత్వం ప్రతి ష్టాత్మకంగా చేపట్టనున్న జనగణన 2027ను జిల్లాలో సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని జెసి సూచించారు. మొదటి దశ ‘గృహాల జాబితా, గృహ వసతుల గణన’ శిక్షణా కార్యక్రమం మూడవ రోజు ఆయన పాల్గొని శిక్షణ తీరును పరిశీలించారు. అధికారులు వివిధ అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలని,

సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. డిఆర్ఒ బి.శివ న్నారాయణ రెడ్డి, సీనియర్ రీసెర్చ్ ఆఫీసర్ బి.రమాదేవి పాల్గొన్నారు.

# అనకాపల్లికి పండుగ శోభ

## భారీ ఎత్తున ఏర్పాట్లు

**అనకాపల్లి మార్చి 06 (నేటి మనదేశమ్) :** స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయం పునర్నిర్మాణ పనులు పూర్తికావడంతో ప్రారంభానికి భారీఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ఎనిమిదో తేదీన ఉదయం 10.58 గంటలకు శుభ ముహూర్తంగా వేదపండితులు నిర్ణయించారు. నూకాంబిక అమ్మవారి ప్రధాన ఆలయం పునఃప్రారంభం, రాజగోపురంపై కలశాల ప్రతిష్ఠ, మహాసంప్రోక్షణ, యజ్ఞయాగాదుల వంటి కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ పీలా నాగశ్రీను, ఆలయ ఈవో యాళ్ల శ్రీధర్ తెలిపారు. ఆలయంతోపాటు రాజ గోపురాన్ని వివిధ రకాల రంగులతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. సుమారు 100 అడుగుల ఎత్తున నిర్మించిన రాజగోపురంపై పలు దేవతా మూర్తుల విగ్రహాలను తీర్చిదిద్దారు. మహా సంప్రోక్షణ, యజ్ఞం వంటి కార్యక్రమాల నిర్వహణ కోసం తాటాకు పందిళ్లతో యాగశాలను నిర్మించారు. ఆలయంతోపాటు ప్రాంగణం మొత్తం విద్యుద్దీపాలతో అలం కరిస్తున్నారు. కాగా ఆలయ పునర్నిర్మాణం కోసం సుమారు మూడేళ్ల నుంచి అమ్మవారి మూలవిరాట్‌కు పూజలు నిర్వహించడంలేదు. ఇప్పుడు ఆలయ నిర్మాణం పూరికావడంతో ఆదివారం ఉదయం అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

# ఉత్సాహంగా కబడ్డీ పోటీలు



**పోలాకి, మార్చి 06 (నేటి మనదేశమ్) :** ప్రియా గ్రహారంలో వేంచేసి ఉన్న లలిత త్రిపురాంతకవిశ్వేశ్వరస్వామి, లక్ష్మీ చెన్నకేశవ స్వామి వార్ల దేవస్థానంలో మూడు రోజుల పాటు నిర్వహించిన డోలోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ఉత్సాహంగా సాగాయి. 33 జట్లు పాల్గొన్నాయి. తెలుగుయువత పార్లమెంటరీ యువ నాయకులు మెండ దాసునాయుడు, నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, జనసేన నాయకుడు ప్రదీప్‌కుమార్, మెట్ట వైకుంఠరావు, పోలాకి జడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య ఉత్సవాల్లో పాల్గొన్నారు.

సర్పంచ్ బెవరనూకరాజు, మాజీ సర్పంచ్ లావేటి కృష్ణ, ఎంపీటీసీ ప్రసాదరావుల ఆధ్వర్యంలో నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఆలయ పురోహితులు శ్రీనా?థ్‌శర్మ ఆధ్వర్యంలో పుష్పాలతో ప్రత్యేక పూజలు చేపట్టారు.

# భారతీయ విద్యార్థులకు అంతర్జాతీయ వైద్య విద్య

## – ఐఎస్ఎం ఫోకల్ పాయింట్ లక్ష్యం
## – సంస్థ డైరెక్టర్ సునీత లావణ్య



**విశాఖపట్నం మార్చి 06 (నేటి మనదేశమ్) :** భారతీయ విద్యార్థులకు అంతర్జాతీయ వైద్య విద్యావకాశాలను అందించడమే ఐఎస్ఎం ఫోకల్ పాయింట్ ప్రైవేట్ లిమిటెడ్ లక్ష్యమని డైరెక్టర్, క్రైట్స్ నోబుల్ స్కూల్ భాగస్వామి, రోటరీ డిస్ట్రిక్ట్ 3020 మహిళా సాధికారత చైర్‌పర్సన్ రొటేరియన్ కె. సునీత లావణ్య అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ప్రజాశక్తి ప్రతినిధితో మాట్లాడారు. 2003లో సంస్థను ప్రారంభించినప్పటికీ, పారదర్శకత, నిబద్ధత విద్యార్థికేంద్రిత సేవలతో అభివృద్ధి చెందుతూ 2008లో విశాఖ నగరంలోని అక్కయపాలెం ఎన్‌జివోస్ కాలనీలో అధికారిక కార్యాలయాన్ని ప్రారంభించామన్నారు. కిర్గిజ్‌స్తాన్‌లోని ప్రముఖ వైద్య విశ్వవిద్యాలయం ‘ఇంటర్నేషనల్ హయ్యర్ స్కూల్ ఆఫ్ మెడిసిన’?కు అధికారిక అడ్మిషన్ భాగస్వామిగా ఐఎస్ఎం ఫోకల్ పాయింట్ భారతదేశంలో సేవలందిస్తోందని తెలిపారు. స్థానిక యూనివర్సిటీ కార్యాలయం ద్వారా తల్లిదండ్రులకు సమగ్ర కౌన్సెలింగ్, అడ్మిషన్ సహాయం, వీసా గైడెన్స్, విద్యార్థులకు నిరంతర అకడమిక్ మద్దతు అందిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు సంస్థ మార్గదర్శకత్వంలో ఐదు వేల మందికిపైగా విద్యార్థులు వైద్య విద్యను పూర్తిచేసి డాక్టర్లుగా సేవలందిస్తున్నారని, అందులో దాదాపు 200 మంది పీజీ డాక్టర్లు విదేశాల్లో స్థిరపడి అంతర్జాతీయ ఆరోగ్య రంగంలో ప్రతిష్ఠతో కొనసాగుతున్నారని వివరించారు. ఈ విజయాలు సంస్థ విశ్వసనీయతకు నిదర్శనమని తెలిపారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సందేశమిస్తూ, ‘మహిళ చదువుకుంటే ఒక కుటుంబం ఎదుగుతుందని, మహిళ ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తే సమాజం పురోగమిస్తుందన్నారు. మహిళ బలంగా ఉంటే కుటుంబం, తద్వారా సమాజం బలంగా ఉంటుందన్నారు. మహిళ సాధికారతే దేశాభివృద్ధికి పునాది అని స్పష్టం చేశారు.

# పావలా వడ్డీకే రూ.లక్ష రుణం

## – పిల్లల చదువుకు విద్యాలక్ష్మీ.. పెళ్లికి కళ్యాణలక్ష్మీ – ఈ నెల 8న కొత్త పథకాలు ప్రారంభం

**సంతబొమ్మాళి/ మెళియాపుట్టి, మార్చి 06 (నేటి మనదేశమ్) :** డ్వాక్రా మహిళల అభ్యున్నతి కోసం కూటమి ప్రభుత్వం వరాల జల్లు కురిపించింది. స్వయంశక్తి సంఘాల్లోని మహిళల పిల్లల విద్య కోసం ఎన్టీఆర్ విద్యాలక్ష్మీతోపాటు కుమార్తె వివాహానికి ఎన్టీఆర్ కళ్యాణ లక్ష్మీ పథకాలు ప్రవేశపెట్టనుంది. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 8న ఈ రెండు పథకాలు ప్రారంభించనుంది. కేవలం పావలా(నాలుగు శాతం) వడ్డీతో అర్హతను బట్టి రూ.10వేల నుంచి రూ.లక్ష వరకు రుణాలు అందజేయనుంది. కనీసం ఆరు నెలల కిందట డ్వాక్రా సంఘంలో చేరి.. గతంలో తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించిన వారికే ప్రాధాన్యమివ్వనుంది. రుణగ్రహీత ప్రమాదవశాత్తు మరణిస్తే.. రుణం మాఫీ చేయనుంది. జిల్లాలో 48,906 మహిళా సంఘాల్లో 5,37,133 మంది సభ్యులు ఉన్నారు. వీరందరికీ అవసరం మేరకు ఈ పథకాల ద్వారా లబ్ధి చేకూరనుంది.

# “ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక” సన్నాహక సమావేశంలోఎమ్మెల్యే పాయల్ శంకర్



**అదిలాబాద్ మార్చ్ 06 (నేటి మన దేశమ్ ప్రతినిధి.** ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గానికి చెందిన రైతులు,గిరిజనులు,ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.మరో ముఖ్య అంశాన్ని ప్రస్తావిస్తూ,మున్సిపాలిటీ పరిధిలో కొంతమంది ప్రభుత్వ భూములను అక్రమంగా ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు.ఈ విషయాన్ని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ,ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.అలాగే జిల్లాలో ఇసుక కొరత కారణంగా అభివృద్ధి పనులు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని పేర్కొంటూ,స్థానిక వనరుల నుంచి ఇసుక తవ్వకాలపై విధిస్తున్న రాయల్టీ తగ్గించి, తవ్వకాల సమయాన్ని పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు.ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయడానికి ఇది అవసరమని తెలిపారు.అలాగే రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.జిల్లాలో మిషన్ భగీరథ పథకం పూర్తిస్థాయిలో పనిచేయకపోవడంతో కొన్ని గ్రామాల్లో నీటి సమస్యలు ఎదురవుతున్నాయని,వాటిని ముందుగానే గుర్తించి పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.ఈ సమావేశానికి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు,ఎంపీ గోడం నాగేశ్,జిల్లా కలెక్టర్,జిల్లా ఎస్పీ ,ఐటీడీఏ పీఓ,బోథ్ ఎమ్మెల్యే ,ఖానాపూర్ ఎమ్మెల్యే ,అదనపు కలెక్టర్,జిల్లా అటవి శాఖ అధికారి,మున్సిపల్ చైర్ పర్సన్ అలాగే వివిధ శాఖల జిల్లా అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కమణీయం... రమణీయం... శివ పార్వతుల కళ్యాణం...

**లలితామాత ఆలయ వార్షికోత్సవ వేడుకలు ముగింపు**



**జగిత్యాల, మార్చి 05(నేటి మన దేశమ్ ప్రతినిధి):**జగిత్యాల రూరల్ మండలం పొలాసలో కొలువై ఉన్న 108 శ్రీచక్ర సహిత లలితామాత ఆలయంలో శుక్రవారం శివ పార్వతుల కల్యాణన్ని భక్తుల శివ నామస్మరణల మధ్య, వేద బ్రహ్మనోత్తములు అంగ రంగ వైభవంగా,శాస్త్రోక్తంగా నిర్వహించారు.బ్రహ్మశ్రీ తీగుళ్ల విషుశర్మ వైధిక నిర్వహణలో 108 శ్రీచక్ర సహిత లలితమాత ఆలయ 3 వ వార్షికోత్సవ వేడుకలను భక్తుల కోలాహలం మధ్య ఫౌండర్ చైర్మన్ చెల్లం స్వరూప ఆధ్వర్యంలో వేద బ్రాహ్మణులూ మాధవ్, భరత్,అజయ్ శర్మ,రాకేష్ మీశ్రా, రాధాకృష్ణ తదితరులు కళ్యాణన్ని ఘనంగా నిర్వహించారు.కమణీయం... రమణీయం..అన్న చందంగా చూడ ముచ్చటగా శివపార్వతుల కళ్యానాన్ని వేద బ్రాహ్మణులూ జరిపారు.మొదటగా ఆలయంలో లలితా మాత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా సుహాసినిలు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.మహిళలు లలితసాహస్ర నామ పారాయణం భక్తి, శ్రద్ధలతో చేశారు.అనంతరం శివపార్వతుల కళ్యాణం మంగళవాయిద్యాల మధ్య జరిపించారని ఫౌండరి చైర్మన్ చెల్లం స్వరూప సత్తయ్య తెలిపారు.ఆలయంలో ఉత్సవాలు శ్రీమాన్ నంబీ వేణుగోపాల చార్య కౌశిక మంగళశాషణమూలతో బ్రహ్మశ్రీ తీగుళ్ల విషు శర్మ వైధిక నిర్వహణలో శుక్రవారం ముగింపు కార్యక్రమాలు జరిగాయని 108 శ్రీ చక్ర సహిత లలితమాత ఆలయ ఫౌండర్ చైర్మన్ చెల్లం స్వరూప వివరించారు.కార్యక్రమంలో ఉటూరి కళ్యాణి, పాంపట్టి సులోచన,ఆది వనజ, పెద్ది అశ్విని,కటకం రమ,శిరీష, ఉటూరి అర్చన, స్వప్న,మహేందర్,ఉజగిరి జమున,మహేష్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి ‘ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక’ : సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్




**మేడ్చల్ మల్కాజిగిరి, మార్చి 06: (నేటి మనదేశమ్):** ప్రజా ప్రభుత్వ పథకాల లబ్ధి అర్హులందరికీ చేరేలా సమన్వయంతో సమస్యలను పరిష్కరించేందుకు 99 రోజుల పాటు చేపట్టనున్న ‘ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక’ కార్యక్రమం కీలకంగా మారుతుందని తెలంగాణ శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు.శుక్రవారం రంగారెడ్డి కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన వివిధ శాఖల అధికారులకు ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్లు నారాయణ రెడ్డి, మను చౌదరి, దీపక్ తివారి, మల్కాజిగిరి, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్లు తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా సభాపతి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ఈ కార్యక్రమం సమర్థవంతమైన వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని, ప్రజా ప్రతినిధులు, అధికారులు జవాబుదారీతనంతో వ్యవహరించాలని సూచించారు.జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ 99 రోజుల కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి అందని వారిని గుర్తించి వారికి ప్రయోజనాలు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.శాసనమండలి చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా 10 ముఖ్య అంశాలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రజల వద్దకే వెళ్లనున్నారని తెలిపారు. రేషన్ కార్డులు, ఇల్లు లేని నిరుపేదలకు గృహాలు కేటాయించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.జిల్లా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు హామీల అమలుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి పనిచేస్తుందని చెప్పారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు నోడల్ అధికారులను నియమించామని, అన్ని శాఖల సమన్వయంతో ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. గృహ నిర్మాణ పనులకు చెల్లింపులు వేగవంతం చేయడంతో పాటు గురుకుల పాఠశాలల్లో మౌలిక సదుపాయాల మెరుగుదలకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు.ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు రామ్మోహన్ రెడ్డి, మనోహర్ రెడ్డి, ప్రకాష్ గౌడ్, కాలే యాదయ్య, శంకరయ్య, వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, వివిధ శాఖల చైర్మన్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక’ అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలి..

**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు ..**




**ఆసిఫాబాద్, మార్చి 06: (నేటి మనదేశమ్):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ‘ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక’ 99 రోజుల కార్యాచరణను ఉమ్మడి జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక అమలుపై ఆదిలాబాద్ పార్లమెంటు సభ్యులు గోడం నగేష్, శాసనసభ్యులు పాయల శంకర్, అనిల్ జాదవ్, వెడ్మ బొజ్జు, ఆదిలాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ అనూష, ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా, ఎస్.పి. అఖిల్ మహాజన్, ఇతర అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, , మంచిర్యాల జిల్లాల కలెక్టర్లు, అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టు లకు సంబంధించి పెండింగ్ పనులను వేగవంతం చేయాలని, భూ సేకరణపై ప్రత్యేక దృష్టి సాధించాలని, మరమ్మతులు ఏమైనా ఉంటే వెంటనే యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు సాగునీరు అందించాలని తెలిపారు. వేసవి కాలంలో త్రాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని, సిఎంఆర్ వ్యవహారంలో మిల్లర్ల నుంచి ధాన్యం రికవరీ, కేసుల పురోగతి వంటి అంశాలపై ఏప్రిల్ 30 నాటికి సమగ్ర నివేదిక అందించాలని తెలిపారు

# భవన్స్ వివేకానంద కళాశాలలో ఘనంగా వీడ్కోలు వేడుకలు



**నేరేడ్‌మెట్ , మార్చి 06: (నేటి మనదేశమ్):** భవన్స్ వివేకానంద కాలేజ్ ఆఫ్ సైన్స్, హ్యుమానిటీస్ అండ్ కామర్స్‌లో 2023--26 బ్యాచ్ విద్యార్థులకు శుక్రవారం ఘనంగా వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. “కహానియన్ -- మనం జీవించిన కథలు, మనం ఉంచుకునే జ్ఞాపకాలు” అనే థీమ్‌తో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.మధ్యాహ్నం ప్రారంభమైన ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.ఎస్.వి.ఆర్.కె చౌదరి, ఎక్స్‌ప్రెషన్స్ క్లబ్ కోఆర్డినేటర్ శ్రీమతి బి. దివ్యరేఖ ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యం, సంగీతం, నాటికలతో సాంస్కృతిక ప్రదర్శనలు అందించి సందడి చేశారు. కార్యక్రమం మొత్తం ఉల్లాసభరితంగా సాగింది.కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ‘బెస్ట్ అవుట్‌గోయింగ్ స్టూడెంట్’ పోటీలో వివిధ విభాగాల నుంచి ఎంపికైన 22 మంది ఫైనలిస్టులు వివిధ రౌండ్లలో తమ ప్రతిభను ప్రదర్శించారు. ఇందులో బీబీఏ-3ఎ విద్యార్థి శ్రీ వసంత్ 2026 సంవత్సరానికి ఉత్తమ అవుట్‌గోయింగ్ స్టూడెంట్ అవార్డును అందుకున్నారు.అదే సమయంలో కెరీర్ గైడెన్స్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ ద్వారా ఉద్యోగ అవకాశాలు పొందిన విద్యార్థులను సత్కరించారు. విద్య, పరిశోధన, ప్రచురణలు, సహ పాఠ్య కార్యక్రమాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రతిష్టాత్మక ‘నవరత్న అవార్డులు’ ప్రదానం చేశారు.భావోద్వేగభరిత వాతావరణంలో జరిగిన ఈ వీడ్కోలు వేడుకలు విద్యార్థుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయే జ్ఞాపకాలను మిగిల్చాయి.

# డిఫాల్ట్ మిల్లర్లపై విధించిన 25 శాతం పెనాల్టీ 12 శాతం వడ్డీని ఎత్తివేయాలి

***కేసులు పెడుతారనే భయం తో ఆత్మహత్య చేసుకున్న తనుకు స్వప్న కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి***

***రైస్ మిల్లర్ అసోసియేషన్ ములుగు జిల్లా అధ్యక్షులు బాదం ప్రవీణ్***



**ములుగు, మార్చి:06(నేటిమన దేశమ్ (ప్రతినిధి)** డిఫాల్ట్ రైస్ మిల్లర్లపై విధించిన 25% పెనాల్టీతోపాటు 12 శాతం వడ్డీని ప్రభుత్వం ఎత్తివేయాలని రైస్ మిల్లర్ అసోసియేషన్ ములుగు జిల్లా అధ్యక్షులు బాదం ప్రవీణ్ అన్నారు. డిఫాల్ట్ లిస్టులో ఉన్న నేపథ్యంలో సివిల్ సప్లై అధికారులు కేసులు పెడతారని భయంతో కరీంనగర్ జిల్లా కేశవపట్నం బాలాజీ ఇండస్ట్రీస్ యజమాని తనుకు సురేష్ భార్య తనుకు స్వప్న శుక్రవారం ఉదయం ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న బాదం ప్రవీణ్ వెంటనే కరీంనగర్ చేరుకొని స్వప్న మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం స్వప్న ఆత్మహత్యకు గల కారణాలను కుటుంబ సభ్యుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాదం ప్రవీణ్ మాట్లాడుతూ.డిఫాల్ట్ లిస్టు లో తమ రైస్ మిల్లు ఉన్న నేపథ్యంలో సివిల్ సప్లై అధికారులు, ప్రభుత్వం తమపై కేసులు పెడతారని భయంతో స్వప్న ఆత్మహత్య చేసుకొని మృతి చెందడం బాధాకరమని అన్నారు.స్వప్న పవిత్ర ఆత్మకు శాంతి చేకూర్చాలని ఆయన సందర్భంగా భగవంతుని వేడుకున్నారు. గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను కాంగ్రెస్ ప్రభుత్వం మార్చినట్టుగానే ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉంటున్న రైస్ మిల్లర్ వ్యవస్థపై ప్రభుత్వం పెద్ద మనసు చేసుకొని డిఫాల్ట్ మిల్లర్లపై విధించిన 25% పెనాల్టీతోపాటు 12 శాతం వడ్డీని ఎత్తివేయాలని ఆయన కోరారు. ఉరిశిక్ష పడిన ఖైదీకి సైతం క్షమాభిక్షపెడుతున్న ప్రజాస్వామ్య పాలనలో ఉన్నామని, ఎన్నో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించిన నక్సలైట్లకు పునరావాసం పేరుతో కోట్లాది రూపాయలు ఇస్తున్నటువంటి ప్రభుత్వం రైతులకు ప్రభుత్వానికి వారిదిగా ఉండే మిల్లర్లపై ఇంత కఠిన వైఖరిని ప్రదర్శిస్తుంది ఇప్పటికైనా డిఫాల్ట్ రైస్ మిల్లర్లపై విధించిన ఆంక్షలను ఎత్తివేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా అధ్యక్షులు గోనెల రవీందర్ కార్యదర్శి సత్యనారాయణ ములుగు జిల్లా రైస్ మిల్లర్లు రామిని శ్రవణ్ కుమార్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు

# పారిశుధ్యంపై విప్లవాత్మకంగా ముందుకు సాగాలి...

**జిల్లా కలెక్టర్ కె. హరిత**



**ఆసిఫాబాద్, మార్చి 06: (నేటి మనదేశమ్):** పారిశుధ్యంపై విప్లవాత్మకంగా ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సమీకృత కలెక్టరేట్ పరిసర ప్రాంతాల్లో అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్, జిల్లా అధికారులు, సిబ్బందితో కలిసి చెత్తను సేకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఉద్యోగులు కార్యాలయాల పరిసరాల్లో పరిశుభ్రతను పాటించడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని తెలిపారు. ప్లాస్టిక్ వ్యర్థాల వల్లే పారిశుధ్యం లోపించడమే కాకుండా పర్యావరణంపై కూడా తీవ్ర ప్రభావం పడుతుందని అన్నారు.ఎక్కడైనా చెత్త కనిపిస్తే దానిని తీసి డస్ట్‌బిన్‌లో వేయాలని సూచించారు. ఎవరైనా చెత్తను రోడ్డుపై వేస్తే దానిని తీసి డస్ట్‌బిన్‌లో వేయాలని గాంధీజీ సూత్రాన్ని పాటించాలని పేర్కొన్నారు.ప్రజలు బాధ్యతగా తీసుకుని చెత్తను రోడ్డుపై వేయకుండా మున్సిపల్, గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెత్త సేకరణ వాహనాల్లో వేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ దత్తారావు, ఆర్డీవో లోకేశ్వరరావు, డీడబ్ల్యూఓ భాస్కర్, గిరిజన సంక్షేమ శాఖ డీడీ రమాదేవి, హార్టికల్చర్ అధికారి నదీమ్, వెటర్నరీ అధికారి సురేష్, మత్స్యశాఖ అధికారి సాంబశివరావు తదితర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాల కోరుట్ల లో ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికపై ప్రత్యేక డ్రైవ్




**కోరుట్ల,మార్చి 06(నేటి మన దేశమ్ ప్రతినిధి):**:తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా, ప్రభుత్వ డిగ్రీ కళాశాల కోరుట్ల లో మార్చి 6 నుండి మార్చి 15 వరకు 10 రోజులపాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించబడుతుందని కళాశాల ప్రిన్సిపల్ తెలిపారు.ఈ కార్యక్రమంలో పరిశుభ్రత, పారిశుధ్యం,సంస్థాగత నిర్వహణ, రికార్డుల నిర్వహణ మరియు పరిపాలనా సామర్థ్యంపై దృష్టి సారించనుంది. ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ప్రిన్సిపల్ నడికట్ల సందీప్ మాట్లాడుతూ, ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి అధ్యాపకులు మరియు విద్యార్థులు అందరూ భాగస్వామ్యం కావాలని తెలిపారు. ప్రగతి ప్రణాళికలో భాగంగా కళాశాలలో వివిధ విభాగాల సమన్వయంతో శుభ్రతా కార్యక్రమాలు,రికార్డుల సక్రమ నిర్వహణ, పరిపాలనా విధానాల మెరుగుదల, విద్యార్థులలో అవగాహన పెంపు కోసం ప్రత్యేక చర్యలు చేపట్టనున్నారు. ప్రిన్సిపల్ అధ్యాపకులు,విద్యార్థులు, సిబ్బంది అందరూ కలసి పనిచేస్తే ఈ కార్యక్రమం విజయవంతం అవుతుందని ఆశా భావం వ్యక్తం చేశారు..

# మల్కాజ్‌గిరిలో ‘వికసిత్ భారత్ యువ పార్లమెంట్’



**మల్కాజ్‌గిరి, మార్చి 06: (నేటి మనదేశమ్):** ‘వికసిత్ భారత్ ఏ 2047’ లక్ష్యంతో యువతను దేశాభివృద్ధిలో భాగస్వాములను చేయాలనే ఉద్దేశంతో మల్కాజ్‌గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ‘వికసిత్ భారత్ యువ పార్లమెంట్--2026’ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం మార్చి 7న సైనిక్‌పురిలోని భవన్ వివేకానంద డిగ్రీ కళాశాలలో జరగనుందని కళాశాల వర్గాలు వెల్లడించాయి.ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, రిజిస్ట్రేషన్లు ఉదయం 8:15 గంటల నుంచి ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు. “50 ఏళ్ల అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ): భారత ప్రజాస్వామ్య పాఠాలు” అంశంపై యువత మధ్య చర్చలు జరగనున్నాయి.జిల్లాలోని వివిధ కళాశాలల నుంచి ఎంపికైన 10 మంది ప్రతిభావంతులైన విద్యార్థులు చర్చలో పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించనున్నారు. పార్లమెంటరీ విధానాలపై అవగాహన పెంపొందించడమే కాకుండా జాతీయ అంశాలపై యువతకు చర్చా వేదికగా ఈ కార్యక్రమం నిలవనుందని తెలిపారు.నవ భారత నిర్మాణంలో యువత చురుకుగా పాల్గొనాలని కళాశాల ప్రిన్సిపల్ డా. బండి రాజు, వైస్ ప్రిన్సిపల్ డా. అడవి రాజు, ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు డా. జగన్, డా. హరిత, డా. ప్రదీప్ విజ్ఞప్తి చేశారు.

# ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్



**రాజన్న సిరిసిల్ల, మార్చి06: నేటి మన దేశమ్ ప్రతినిధి** వేములవాడ పట్టణ పరిధిలో నిర్వహించిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ మహోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారికి నూతన వస్త్రాలు అందజేశారు..ప్రభుత్వం పేద ప్రజలకు గృహ స్వప్నాన్ని నెరవేర్చే లక్ష్యంతో చేపట్టిన ఇందిరమ్మ ఇల్లు పథకం ద్వారా అనేక కుటుంబాలు సొంతింటి సంతోషాన్ని పొందుతున్నాయని వారు పేర్కొన్నారు..

# ముందు ఇరాన్ పని ముగించి..

## క్యూబా సంగతి చూస్తాం: ట్రంప్



క్యూబా లక్ష్యంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ దేశ ప్రభుత్వం అమెరికా జాతీయ భద్రతకు, విదేశాంగ విధానానికి తీవ్రమైన ముప్పుగా మారిందని పేర్కొన్నారు. ముందు ఇరాన్ పని ముగించి.. తర్వాత క్యూబా సంగతి చూస్తామన్నారు. అయితే అది ఎప్పుడో తెలియదన్నారు. ఇజ్రాయెల్ దళాలతో కలిసి, అనుకున్న దానికంటే వేగంగానే తమ దళాలు ఇరాన్‌పై దాడులు కొనసాగిస్తున్నాయన్నారు. వరుస దాడుల వల్ల ఇరాన్ సైనిక సామర్థ్యాలు కూడా భారీగా క్షీణించాయన్నారు. ఈ దాడులను ఎదుర్కోవడానికి వారికి తమలా వైమానిక దళం లేదని పేర్కొన్నారు. ఇరాన్ నావికాదళాన్ని కూడా తాము పూర్తిగా నాశనం చేశామని ట్రంప్ ప్రకటించారు. మూడు రోజుల్లోనే 24 ఇరాన్ నౌకలను తుడిచి పెట్టామన్నారు. దీంతో ఆ దేశ అధికారులు తమ కాళ్ల బేరానికి వచ్చారన్నారు. అణు ఒప్పందంపై చర్చలు జరప డానికి సిద్ధంగా ఉన్నట్లు పలువురు ఇరాన్ అధికారులు తమకు చెప్పారని.. అయితే, ఇప్పటికే ఆలస్యమైందని తాను చెప్పినట్టు పేర్కొన్నారు. టెహ్రాన్ రాజకీయ భవిష్యత్తును పునర్నిర్మించడంలో ఇరాన్ దౌత్య వేత్తలు తమకు సహకరించాలన్నారు. మరోవైపు తమతో ఒప్పందం చేసుకోవడానికి క్యూబా సైతం ఎదురు చూస్తోందని ట్రంప్ పేర్కొన్నారు. పశ్చిమాసియాలో తమ ఆపరేషన్ ముగిసిన తర్వాత అమెరికా విదేశాంగ విధాన ప్రాధాన్యాల్లో పలు మార్పులు చోటుచేసు కుంటాయన్నారు.

# ఒమన్ ఆయిల్ ట్యాంకర్‌పై ఇరాన్ దాడి..

## ఇద్దరు భారతీయుల మృతి



ఇరాన్ - ఇజ్రాయెల్, అమెరికాల మధ్య ఉద్రిక్తతలు ఏడో రోజుకు చేరుకున్నాయి. తాజాగా.. హెర్ముజ్ జలసంధి ఒమన్ గల్ఫ్‌లో స్కైలైట్ అనే ఆయిల్ ట్యాంకర్‌పై ఇరాన్ చేసిన దాడిలో ఇద్దరు భారతీయులు ప్రాణాలు కోల్పోయారు. మృతులను బిహార్‌కు చెందిన కెప్టెన్ ఆశిష్ కుమార్, మహారాష్ట్రలోని ముంబైకి చెందిన దీక్షిత్ సోలంకిగా గుర్తించారు. అదే నౌకలో పనిచేస్తున్న దలీప్ సింగ్ అనే రాజస్థాన్ వాసి ఆచూకీ గల్లంతైంది. ఫిబ్రవరి 22న వచ్చిన పలావు జెండాతో కూడిన ఈ ఆయిల్ ట్యాంకర్‌పై ఒమన్‌లోని ముసాందమ్ ఐల్యాండ్ సమీపంలో అనగా ఖసాబ్ ఓడరేవుకు ఉత్తరాన సుమారు 5 నాటికల్ మైళ్ల దూరంలో ఈ దాడి జరిగింది. ప్రమాద సమయంలో ఆ నౌకలో మొత్తం 20 మంది సిబ్బంది ఉండగా.. వారిలో 15 మంది భారతీయులు, మరో ఐదుగురు ఇరాన్ వాసులుగా తెలుస్తోంది. దాడి అనంతరం అందులోని సిబ్బందిని ఒమన్ మెరైన్ సెక్యూరిటీ సెంటర్ (ఎంఎస్‌సీ) అధికారులు వెంటనే ఖాళీ చేయించారు. అయితే.. ఆ షిప్‌పై ఏ ఆయుధంతో దాడి జరిగిందనే వివరాలు తెలియరాలేదు. ఈ దాడిలో మరణించిన ఇద్దరు భారతీయుల మృత దేహాలను స్వాధీనం చేసుకున్నారు అధికారులు. కాగా.. ఆశిష్ కుమార్ ఈ ఏడాది జనవరి 20న దుబాయ్ లోని మర్చంట్ నేవీలో చేరారు. ఫిబ్రవరి 22న ఒమన్‌కు వెళ్లే స్కైలైట్ షిప్‌నకు కెప్టెన్‌గా పనిచేస్తున్నారని ఆయన సోదరుడు ఆకాశ్ చెప్పారు. ఇక.. దీక్షిత్ సోలంకి ముంబైలో తన కుటుంబంతో నెలలపాటు గడిపిన అనంతరం ఇటీవలే విధుల్లోకి చేరారు. రాజస్థాన్‌లోని నాగౌర్ ప్రాంతానికి చెందిన దలీప్ సింగ్ జనవరి 22న ట్యాంకర్‌లో సిబ్బందిగా చేరారు. అయితే.. దాడి జరిగిన సమయంలో దలీప్ సింగ్ నౌక ముందుభాగంలో ఉన్నట్టు మీడియా కథనాల ద్వారా తెలుస్తోంది.

# 25 ఏళ్లలో మోదీ ఒక్క సెలవూ తీసుకోలేదు

- సామాన్యుల సంక్షేమం కోసం తీవ్రంగా కృషిచేస్తున్నారు
- ప్రధానిపై కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ ప్రశంసల వర్షం



సిడ్నీ: భారత ప్రధాని మోదీపై కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ ప్రశంసల వర్షం కురిపించారు. సామాన్యులకు సంక్షేమ ఫలాలను చేరవేసేందుకు మోదీ తీవ్రంగా కృషి చేస్తున్నారన్నారు. గత 25 ఏళ్లలో మోదీ ఒక్కరోజు కూడా సెలవు తీసుకోలేదని, ఆయన ఓ విలక్షణ వ్యక్తి అని పేర్కొన్నారు. ఇటీవలే భారత్‌లో పర్యటించిన కార్నీ.. ఆస్ట్రేలియాలోని లోవీ ఇన్‌స్టిట్యూట్‌లో బుధవారం ఓ చర్చలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోదీ గురించి చెబుతూ.. భారత్‌లో ఆర్థిక సంస్కరణల ద్వారా కోట్ల మందిని సంఘటిత ఆర్థిక వ్యవస్థలోకి మోదీ తీసుకొచ్చారని కితాబిచ్చారు. "2001లో తొలిసారి గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి.. ఈ 25 ఏళ్లలో మోదీ ఒక్క సెలవు కూడా తీసుకోలేదు. ప్రతి వారాంతం ఆయన ప్రచారానికి వెళ్తుంటారు. ఆయన ర్యాలీలకు 2.5 లక్షల మంది హాజరవుతుంటారు" అని కార్నీ పేర్కొన్నారు.

మెక్రాన్‌కు మోదీ ఫోన్..

దిల్లీ: ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్‌తో ప్రధాని మోదీ గురువారం ఫోన్‌లో మాట్లాడారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్రమవుతుండటంపై ఆందోళన వ్యక్తం చేశారు. దౌత్యమార్గాల్లో చర్చలు జరిగి, అక్కడ తిరిగి శాంతి నెలకొనాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. పశ్చిమాసియాలో వీలైనంత త్వరగా శాంతి, సుస్థిరతలను పునరుద్ధరించే ప్రయత్నాలకు మద్దతిస్తామని స్పష్టం చేశారు.

## దుబాయ్-కోల్‌కతా విమాన సేవలు పునఃప్రారంభం

కోల్‌కతా: పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా నాలుగురోజులుగా నిలిచిపోయిన విమాన సేవలు మళ్లీ ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలోనే 130 మంది ప్రయాణికులతో దుబాయ్ నుంచి వచ్చిన బోయింగ్ విమానం గురువారం తెల్లవారుజామున కోల్‌కతా అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంది. 55 మంది ప్రయాణికులతో తెల్లవారుజామున 3:59 గంటలకు తిరిగి దుబాయ్‌కి బయల్దేరినట్లు అధికారులు తెలిపారు.

13 ప్రత్యేక విమానాలు నడుపుతాం: స్పైస్‌జెట్ పశ్చిమాసియాలో చిక్కుకున్న ప్రయాణికులను భారత్‌కు చేర్చేందుకు 13 ప్రత్యేక విమానాలను నడపనున్నట్లు స్పైస్‌జెట్ సంస్థ ప్రకటించింది. ఫుజైరా నుంచి 12 విమానాలు ప్రారంభమవుతాయని వీటిలో 7 ముంబయికి, 5 దిల్లీ చేరుకుంటాయంది. మరొకటి దుబాయ్ నుంచి ముంబయికి వస్తుందని పేర్కొంది.

281 సర్వీసుల రద్దు దిల్లీ: పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో గురువారం మన దేశం నుంచి 281 అంతర్జాతీయ విమాన సర్వీసులు రద్దయ్యాయి. ఈ పరిస్థితిని ప్రభుత్వం నిశితంగా పరిశీలిస్తోంది. దిల్లీ, బెంగళూరుల నుంచి 70 చొప్పున రద్దయ్యాయి.

# ఖమేనీ అడ్డు తొలగించాలని నవంబర్‌లోనే నిర్ణయించుకొన్నాం

## ఇజ్రాయిల్ రక్షణ మంత్రి కట్జ్ కీలక విషయాలు



అమెరికా- ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ ప్రాణాలు కోల్పోవడం సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కట్జ్ కీలక విషయాలు బయటపెట్టారు. సుప్రీం నేత అడ్డు తొలగించాలని తాము గతేడాది నవంబర్‌లోనే నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. ఓ మీడియాతో మాట్లాడుతూ.. గతేడాది చివర్లో ఓ ఉన్నత స్థాయి భద్రతా సమావేశం జరిగిందని కట్జ్ పేర్కొన్నారు. ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు నేతృత్వంలో జరిగిన ఆ సమావేశంలో ఖమేనీ అడ్డు తొలగించాలని గట్టిగా నిర్ణయించుకొన్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఇరాన్ పై కొనసాగుతున్న ఆపరేషన్.. 2026 మధ్యలో జరగాల్సి ఉందన్నారు. అప్పట్లో ఈ ప్రణాళిక గురించి అమెరికాకు వెల్లడించలేదన్నారు. ఇటీవల ఇరాన్ పాలనను వ్యతిరేకిస్తూ ఆ దేశంలో నిరసనలు జరిగిన సంగతి తెలిసిందే. ఆ ఆందోళనలు హింసాత్మకంగా మారిన నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ (ఐశీఋశ్రీ ు ుతీబఎజూ), నెతన్యాహుల మధ్య దీని గురించి చర్చ జరిగినట్లు తెలిపారు. ఈ క్రమంలోనే ఇరుదేశాలు సంయుక్తంగా ముందుగానే ఆపరేషన్ మొదలు పెట్టినట్లు వెల్లడించారు. ఆపరేషన్ తొలిరోజే ఖమేనీ కార్యాలయం లక్ష్యంగా అమెరికా- ఇజ్రాయెల్ భీకర దాడులు చేశాయి. ఈ దాడుల్లో ఖమేనీతో సహా ఆయన కుటుంబంలోని పలువురు ప్రాణాలు కోల్పోయారు. టెహ్రాన్‌లోని ట్రాఫిక్ కెమెరాలు, ఫోన్ నెట్‌వర్క్‌ను ట్రాక్ చేసి ఖమేనీ కదలికలపై నిఘా పెట్టి.. అత్యంత కచ్చితత్వంతో ఈ దాడి చేసినట్లు మీడియా కథనాలు వెల్లడించాయి. ఖమేనీ మృతికి ప్రతీకారంగా ఇరాన్ కూడా దాడులు చేస్తోంది. దీంతో ప్రస్తుతం పశ్చిమాసియాలో పరిస్థితులు రణరంగాన్ని తలపిస్తున్నాయి.

### కూలిపోయిన సుఖోయ్ ఫైటర్ జెట్..

# పైలట్లు మృతి




వాయుసేనకు చెందిన సుఖోయ్-30 ఎంకేఐ యుద్ధవిమానం గల్లంతైన సంగతి తెలిసిందే. తాజాగా అది కూలిపోయిందని ఇండియన్ ఎయిర్ ఫోర్స్ (ఐఏఎఫ్) ప్రకటించింది. అస్సాంలోని కర్బి ఆంగ్లాంగ్ జిల్లాలో ఈ ఘటన జరిగినట్లు తెలిపింది. గురువారం సాయంత్రం జోర్హాట్ నుంచి బయలుదేరిన కొద్దిసేపటికే ఈ యుద్ధ విమానం గల్లంతైంది. రాడర్‌తో సంబంధాలు తెగిపోయాయని అధికారులు పేర్కొన్నారు. ఈ క్రమంలో గాలింపు చర్యలు చేపట్టారు. జోర్హాట్ వైమానిక స్థావరానికి 60 కి.మీల దూరంలో ఉన్న కర్బి ఆంగ్లాంగ్ కొండ ప్రాంతంలో ఇది కూలిపోయినట్లు తాజాగా గుర్తించారు. ఈ ఘటనలో ఇద్దరు పైలట్లు ప్రాణాలు కోల్పోయారు. వారిని స్క్వాడ్రన్ లీడర్ అనుజ్, ఫ్లైట్ లెఫ్టినెంట్ పూర్వేశ్ దురాగ్‌కర్‌గా అధికారులు గుర్తించారు. వీరి మృతికి ఐఏఎఫ్ సంతాపం వ్యక్తం చేసింది.

# ఉత్తరాంధ్రలో

# రూ.56 వేల కోట్లతో స్టీల్ ప్లాంట్!

## పరిశ్రమల శాఖకు రష్మీ గ్రూప్ ప్రతిపాదన




అమరావతి : ఉత్తరాంధ్రలో భారీ పరిశ్రమలు స్థాపించేందుకు ప్రఖ్యాత సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి. అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో ఆర్సెల్లార్ మిట్టల్ యేటా 7.3 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో స్టీల్ ప్లాంటు నిర్మించేందుకు ఇప్పటికే ముందుకు వచ్చింది. దీనికి అవసరమైన 2200 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. తాజాగా రూ.56 వేల కోట్లతో ఏటా 8 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామంటూ కోల్‌కతాకు చెందిన రష్మీ గ్రూప్ ప్రతిపాదించింది. దీనిపై పరిశ్రమల శాఖ సానుకూలంగా స్పందించింది. రష్మీ ప్రతినిధులు పరిశ్రమల శాఖ అధికారులతో కలసి ఉత్తరాంధ్ర ప్రాంతంలో పర్యటించారు.

## తెలంగాణ కొత్త గవర్నర్ శివప్రతాప్ శుక్లా



**జిష్ణుదేవ్ వర్మ మహారాష్ట్రకు బదిలీ**

**ఐదుగురు గవర్నర్ల మార్పు**

**ఒకరికి అదనపు బాధ్యతలు.. కొత్తగా ముగ్గురి నియామకం**

**బెంగాల్ గవర్నర్ ఆనందబోస్ రాజీనామా**

దిల్లీ: కేంద్ర ప్రభుత్వం అనూహ్యంగా 9 రాష్ట్రాలకు కొత్త గవర్నర్లను నియమించింది. పశ్చిమబెంగాల్ గవర్నర్ సి.వి.ఆనందబోస్ ఆకస్మిక రాజీనామా దరిమిలా ఈ మార్పులు చేపట్టింది. ఇందులో భాగంగా తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను మహారాష్ట్రకు బదిలీచేసి ఆ స్థానంలో హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లాను నియమించింది. 2024 జులై 31న తెలంగాణ గవర్నర్‌గా నియమితులైన జిష్ణుదేవ్ వర్మ ఇప్పుడు మహారాష్ట్రకు మారారు. ఇప్పుడు నియమించిన 9 రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాల గవర్నర్లు/ లెఫ్టినెంట్ గవర్నర్లలో అయిదుగురిని ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి బదిలీ చేసింది. ఒకరికి అదనపు బాధ్యతలు అప్పగించింది. ముగ్గుర్ని కొత్తగా నియమించింది. మైనార్టీ వర్గానికి చెందిన బిహార్ గవర్నర్ ఆరిఫ్ మహ్మద్‌ఖాన్ పదవీకాలం ముగియడంతో ఆ స్థానాన్ని సయ్యెద్ అటా హస్నైన్‌తో భర్తీచేశారు.

### ఇరాన్ ప్రతీకార దాడుల వేళ..

# దుబాయ్ వాసులకు అలర్ట్




అమెరికా-ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో గల్ఫ్ దేశాల్లో అమెరికా స్థావరాలే లక్ష్యంగా ఇరాన్ ప్రతీకార దాడులు చేస్తోంది. అయితే, ఇరాన్ నుంచి వచ్చే క్షిపణులు, డ్రోన్లను ఎప్పటికప్పుడు అడ్డుకుంటున్నామని యూఏఈ రక్షణశాఖ పేర్కొంది. ఈ క్రమంలోనే దేశ వ్యాప్తంగా భారీ శబ్దాలు వినిపిస్తున్నాయని తెలిపింది. ఇదే సమయంలో దుబాయ్ నగరం కూడా స్థానిక పౌరులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తోంది. శుక్రవారం కూడా క్షిపణి దాడులు జరిగే అవకాశం ఉందని కొందరికి మొబైల్ అలర్ట్‌లు వస్తున్నట్లు సమాచారం. అయితే, అలర్ట్ అందుకున్న వెంటనే కొందరు ఇళ్ల నుంచి బయటకు వెళ్లి లేదా వాహనాలు నిలిపి ఫొటోలు, వీడియోలు తీసుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందని యూఏఈ విపత్తు నిర్వహణ విభాగం పేర్కొంది. ఇలాంటివాటికి దూరంగా ఉండాలని.. ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తినప్పుడు సురక్షిత ప్రాంతాల్లో ఆశ్రయం పొందాలని సూచించింది. ముందు జాగ్రత్త చర్యగా కిటికీలకు దూరంగా ఉండాలని తెలిపింది.

ఎమర్జెన్సీ పరిస్థితుల్లో ఎలా వ్యవహరించాలనే దానిపై ఎప్పటికప్పుడు సోషల్ మీడియా వేదికగా స్థానిక పౌరులకు జాగ్రత్తలు చెబుతోంది.


# మా టార్గెట్ అమెరికా స్థావరాలే..

# దాడుల్లో ఎవరూ చనిపోలేదు: ఇరాన్ మంత్రి




పశ్చిమాసియాలోని అమెరికా ఆస్తులపై మాత్రమే తాము దాడులు చేస్తున్నామని ఇరాన్ విదేశాంగ సహాయ మంత్రి సయ్యద్ ఖతీబ్జాదే వెల్లడించారు. తమ దాడుల వల్ల పొరుగున ఉన్న అరబ్ దేశాల్లో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదన్నారు. దిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో తన దేశం చేపడుతున్న చర్యలను ఆయన సమర్థించారు. "యూఎస్ ఆస్తులనే మేం లక్ష్యంగా చేసుకుంటున్నాం. అందుకే మా దాడుల వల్ల అరబ్ దేశాల్లో ప్రాణనష్టం సంభవించలేదు" అని ఖతీబ్జాదే అన్నారు. అలాగే ఇటీవల హిందూ మహా సముద్రంలో ఇరాన్ యుద్ధనౌక ఐరిస్ దేనా-75ను యూఎస్ ముంచేసిన సంగతి తెలిసిందే. "భారత స్నేహితుల ఆహ్వానం మేరకు ఆ నౌక ఇక్కడికి వచ్చింది. దానిపై అమెరికా దాడి దురదృష్టకరం" అని వ్యాఖ్యానించారు. అలాగే దిల్లీ పర్యటనలో భాగంగా ఆయన భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌తో భేటీ అయ్యారు. ఇజ్రాయెల్-అమెరికా దాడుల్లో ఖమేనీ సహా పాలనా వర్గానికి చెందిన పలువురు ఉన్నతస్థాయి వ్యక్తులు చనిపోయారు. వారి మృతితో ఇరాన్ రాజకీయ వ్యవస్థ కూలిపోతుందని ట్రంప్ ప్రభుత్వం వ్యాఖ్యలు చేస్తోంది. వాటిని ఖతీబ్జాదే తోసిపుచ్చారు. తమ దేశ పాలనా నిర్మాణం వ్యక్తులపై కాకుండా వ్యవస్థలపై ఆధారపడి ఉందని స్పష్టంచేశారు. "ఇరాన్‌లో రాజ్యాంగం ఉంది. ఎవరెవరు ఏఏ బాధ్యతలు నిర్వ హించాలనే దానిపై స్పష్టమైన విభజన ఉంది" అని అన్నారు.

## వెలుగులోకి మరిన్ని ఎప్‌స్టీన్ ఫైళ్లు..ట్రంప్‌పై సంచలన ఆరోపణలు



ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణానికి సంబంధించిన మరిన్ని ఫైళ్లను అమెరికా న్యాయశాఖ తాజాగా విడుదల చేసింది. వీటిల్లో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆధారాలు ఉన్న పత్రాలు బయటకు వచ్చాయి. తాను మైనర్‌గా ఉన్నప్పుడు ట్రంప్ తనను లైంగికంగా వేధించినట్లు ఓ మహిళ 2019లో ఎఫ్‌బీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించినట్లు తెలుస్తోంది. తాను 13 నుంచి 15 ఏళ్ల మధ్యలో ఉన్న సమయంలో ఎప్‌స్టీన్ తనను ట్రంప్‌నకు పరిచయం చేసినట్లు మహిళ ఆరోపించింది. అనంతరం వారు ఇరువురు తనపై లైంగిక దాడికి పాల్పడినట్లు తెలిపింది. ఆ సమయంలో ట్రంప్ తనతో అసభ్యంగా ప్రవర్తించినట్లు వెల్లడించింది. ఎప్‌స్టీన్ ఫైల్స్ వివాదం మొదలైనప్పటి నుంచి ఆ ఘటనలకు సంబంధించిన వివరాలు బయటకు చెప్పొద్దని తనకు, తన కుటుంబసభ్యులకు బెదిరింపు కాల్స్ వచ్చినట్లు తెలిపింది.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం విజయవంతం చేయాలి

● మంత్రులు వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస రెడ్డి ● మార్చి చివరి నాటికి ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండ్ పూర్తి చేయాలి ● సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలి ● పిల్లలకు మధ్యాహ్న భోజనంలో చికెన్ స్థానంలో చేపలు అందిస్తాం ● 99 రోజుల కార్యాచరణపై ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో పాల్గొన్న ఉమ్మడి మంత్రులు





**ఖమ్మం,మార్చి 06: (నేటి మనదేశమ్):** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని అధికారులు, ప్రజా ప్రతి నిధులు సంయుక్తంగా కలిసి విజయవంతం చేయాలని మంత్రులు వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు.శుక్రవారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణపై ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో ఉమ్మడి జిల్లా ఇంచార్జీ మంత్రివర్యులు వాకిటి శ్రీహరి అధ్యక్షతన నిర్వహించిన సన్నాహక సమావేశంలో మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, ఎమ్మెల్సీ తాతా మధు, ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, జారె ఆది నారాయణ, మాలోత్ రాందాస్ నాయక్, తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి పాల్గొన్నారు.99 రోజుల కార్యక్రమంలో చేపట్టే కార్యాచరణను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఖమ్మం జిల్లా కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇంచార్జి, పశుసంవర్ధక శాఖ మంత్రి వర్యులు వాకిటి శ్రీహరి మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు 99 రోజుల కార్యాచరణను ప్రణాళిక ప్రకారం అమలు చేయాలన్నారు. ఆర్థిక స్థితిగతులు సహకరించక పోయినా పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు ప్రజల గడపకు చేరేలా అధికారులు కృషి చేయాలని అన్నారు. రాజకీయాలకతీతంగా అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందాలని అన్నారు. రైతులు పండించే పంటకు బోనస్ అందించి వారిలో విశ్వాసం కల్పించడమే కాకుండా పేదలకు నాణ్యమైన సన్న బియ్యం రేషన్ ద్వారా ప్రభుత్వం సరఫరా చేస్తున్నదని అన్నారు. గతంలో మధ్యవర్తులు లబ్దిదారుల పేరిట మీద ఇండ్లు మంజూరు చేయించుకొని డబ్బులు వసూలు చేసుకున్నారని, నేడు అటువంటి లబ్దిదారులకు ఇండ్లు లభించకపోవడం వల్ల చాలా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో మంజూరు చేసే ఇందిరమ్మ ఇండ్లలో పేదల పట్ల అధికారులు మానవతా దృక్పథంతో పని చేయాలని అన్నారు.క్రీడలలో భవిష్యత్తు ఉంటుందనే భావన యువతకు వచ్చేలా అవసరమైన ఇన్ ఫ్రా అభివృద్ధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. గచ్చిబౌలిలో హాకీ క్రీడలు ప్రపంచ స్థాయిలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నా మన్నారు. క్రీడలలో గాయపడిన క్రీడాకారులకు మెరుగైన చికిత్స అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. పిల్లలకు మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా ప్రతి వారం అందించే చికెన్ స్థానంలో చేపలు పెట్టేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. కోతులు, కుక్కల సమస్య పరిష్కారం కోసం వాటి సంతానోత్పత్తి నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల పని తీరు ఆధారంగానే ప్రజలలో ప్రభుత్వం పట్ల స్పందన ఉంటుందని మంత్రి తెలిపారు. 99 రోజుల కార్యాచరణ సంవత్సరం మొత్తం కొనసాగించాలని ఆయన తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి సంయుక్తంగా ప్రజలకు సేవలు అందించాలన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ పేదలకు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించడంతో పాటు భవిష్యత్తు ప్రణాళిక సిద్ధం చేసుకునే ఉద్దేశ్యంతో ప్రభుత్వం 99 రోజుల కార్యాచరణ ప్రోగ్రాం చేపట్టిందని అన్నారు. ఈ కార్యక్రమం ప్రతి గ్రామం, పట్టణానికి చేరువ చేసేందుకు అనుసరించాల్సిన విధానంపై చర్చించేందుకు ఉమ్మడి జిల్లా స్థాయిలో సన్నాహక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 10 సెక్టార్ లకు సంబంధించి రూపొందించిన ప్రణాళిక క్షేత్ర స్థాయిలో కట్టుదిట్టంగా అమలు అయ్యేలా చూడాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ హాస్టల్స్ కు తహసిల్దార్ క్యాడర్ కు తగ్గకుండా ఒక అధికారిని ఇంచార్జి గా నియమించాలని, వీరు ప్రతి వారానికి ఒకసారి వెళ్లి అక్కడ భోజనం నాణ్యత పరిశీలించాలని, అక్కడ ఏదైనా తప్పు జరిగితే సంబంధిత అధికారి బాధ్యత వహించాల్సి ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. గ్రౌండింగ్ కాని ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు ఆసక్తి లేని పక్షంలో అదే గ్రామంలో మరో లబ్ధిదారునికి కేటాయించాలని మంత్రి తెలిపారు. మార్చి చివరి వరకు మొదటి విడత మంజూరు చేసిన ప్రతి ఇల్లు గ్రౌండ్ కావాలని అన్నారు. 99 రోజుల కార్యాచరణలో భాగంగా హెల్త్ సెక్టార్ పని తీరు మెరుగ్గా ఉండాలని, ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద అందుబాటులో ఉన్న యంత్రాలను పూర్తి స్థాయిలో వినియోగించేందుకు అవసరమైన స్టాఫ్ అందుబాటులో ఉండేలా చూడాలని మంత్రి తెలిపారు. ప్రభుత్వ ప్రాధాన్యత ఆధారంగా ఈ కార్యక్రమం అమలుకు నిధులు కేటాయిస్తుందని అన్నారు. ఏప్రిల్ 2న గ్రామ స్థాయి, ఏప్రిల్ 16 న మండల స్థాయి, మే 2న నియోజకవర్గ స్థాయిలో, మే 22న జిల్లా స్థాయిలో, జూన్ 2న రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. 10 ప్రత్యేక అంశాలతో 99 రోజుల కార్యాచరణ చేపట్టడం జరిగిందని అన్నారు. మార్చి 14న వీధి కుక్కల బెడద తొలగించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయన్నారు. నూతనంగా ఎన్నిక కాబడిన సర్పంచ్, కౌన్సిలర్ లకు మార్చి 12న అవగాహన నిర్వహిస్తామని కలెక్టర్ అన్నారు. చైల్డ్ సేఫ్టీ కార్యక్రమం ఏప్రిల్ 27 నుంచి మే 2 వరకు ఉంటుందని, ఇందులో అనాథ పిల్లలకు స్పోర్ట్స్ కిట్ పంపిణీ, సైబర్ నేరాలు, గ్యాంబ్లింగ్, లోన్ యాప్ వేధింపులపై దృష్టి సారిస్తామని, బాల కార్మికుల నిర్మూలన, పిల్లలకు అవసరమైన వైద్య చికిత్స, పిల్లల దత్తత సక్రమంగా జరిగేలా అవగాహన ఉంటుందని అన్నారు.వ్యవసాయ శాఖ పరిధిలో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు వివరాలు ప్రచారం చేయడం, యూరియా యాప్ బుకింగ్ పై అవగాహన కల్పన ఉంటుందన్నారు. విద్యా శాఖ పరిధిలో ప్రభుత్వ పాఠశాలలు శుభ్రంగా ఉండేందుకు పాత సామాగ్రి, పాత కంప్యూటర్ ల తొలగింపు కార్యాచరణ చేపట్టామని అన్నారు. ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ, మున్సిపల్ పాలక వర్గాలను భాగస్వామ్యం చేస్తూ 99 రోజుల కార్యాచరణ అమలు చేయాలన్నారు. గ్రామాలలో ఉన్న కోతుల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఫుడ్ సేఫ్టీ పై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని, ఆధునిక సాగు పద్ధతులు, క్లస్టర్ వారిగా వివిధ పంటల సాగు, పంట మార్పిడి వంటి అంశాలపై విస్తృతంగా చర్చ జరగాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నీటి సరఫరాతో కూడిన టాయిలెట్స్ నిర్మించాలన్నారు. కొత్తగూడెం ఎమ్మెల్యే సాంబ శివరావు మాట్లాడుతూ 20 సంవత్సరాల క్రితం ఇంటి క్రింద 20 వేలు మంజూరు చేసిన లబ్దిదారులకు నేడు ఇందిరమ్మ ఇండ్లు తిరస్కరిస్తున్నారని తెలిపారు. అర్హులకు రద్దు చేసిన ఇండ్లు కేటాయించాలని, జిల్లాలో మరో విడత ఇందిరమ్మ ఇండ్లను కేటాయించే సమయంలో అర్హులు అధికంగా ఉన్న పక్షంలో లాటరీ పద్ధతి అనుసరించా లని ఎమ్మెల్యే సూచించారు. విద్యార్థి దశ నుంచి క్రీడలు భాగస్వామ్యం చేయాలని, పాఠశాల కరికులంలో క్రీడలు ఒక పార్ట్ గా మారాలని ఆయన సూచించారు. జిల్లాలో నిర్మించే డ్రెయిన్స్ అలైన్మెంట్ సరిగ్గా లేకపోవడం వల్ల కొత్త సమస్యలు వస్తున్నాయని, దీనిని క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆది నారాయణ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉండే అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేస్తే మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు. ఈ సమావేశంలో ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, భద్రాచలం ఐటిడిఎ పీవో బి. రాహుల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, డిఎఫ్ఓ సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, వివిధ శాఖల ఉమ్మడి జిల్లా అధికారులు, మునిసిపల్ చైర్ పర్సన్లు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## మెంథ తుఫాన్ బాధితులకు ఎప్పుడు నష్టపరిహారం ఇస్తారో?

**హుస్నాబాద్ మార్చ్ 06 నేటి మనదేశమ్:** హుస్నాబాద్ నియోజకవర్గంలో మెంత తుఫాను ప్రభావం వల్ల రైతులు చేతికి. వచ్చిన వ్యవసాయ పంటలను వరి నేలకొరిగి, మొక్కజొన్న ,పత్తి పంటలు వర్షాలకు దెబ్బతిని తీవ్రంగా నష్టపోయిన పరిస్థితి చూశాం. నాలుగు నెలలు గడుస్తున్న ఇప్పటివరకు ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో ఘోరంగా విఫలం కావడం జరిగింది. మెంథ తుఫాన్ బాధితుల రైతుల పంట వివరాలు వ్యవసాయ శాఖ తమ విచారణలో భాగంగా నివేదిక పంపడం జరిగింది. ఇట్టి విషయంలో కేంద్రము లో ఉన్న మోడీప్రభుత్వం, రాష్ట్రంలో ఉన్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన ఎకరానికి పదివేల రూపాయలు ఇస్తామని చెప్పి, ఇప్పుడు దాని ఊసే ఎత్తడం లేదు. రైతుబంధు కూడా మార్చి నెల వచ్చిన ఇంకా అందలేదు. హుస్నాబాద్ నియోజకవర్గంలో దాదాపు 4000 మంది రైతులు నష్టపోయినట్టు వ్యవసాయ శాఖ అంచనా వేయడం జరిగింది. రైతులను ఆదుకోకపోతే బీఎస్పీ పార్టీ పక్షాన ఆందోళన కార్యక్రమాలు చేపడతామని, హెచ్చరించడం జరుగుతుంది. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్, నాయకులు విక్రం, తదితరులు ఉన్నారు

## మార్చి 8న ఇస్కాన్ సైబరాబాద్ ఆలయ నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం



**హైదరాబాద్, మార్చి 06: (నేటి మనదేశమ్):** ఇస్కాన్ సైబరాబాద్ ఆలయ నిర్మాణానికి సంబంధించి భూమిపూజ (శంకుస్థాపన) కార్యక్రమం ఈ నెల 8వ తేదీ ఆదివారం జరగనున్నట్లు ఇస్కాన్ సైబరాబాద్ ఆలయ అధ్యక్షుడు శ్రీ రామదాస్ తెలిపారు.శుక్రవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, హైదరాబాద్‌లోని నల్లగండ్ల–గోపనపల్లి ప్రాంతంలో ఉన్న శ్రీ రంగనాథ స్వామి ఆలయానికి సమీపంలో ఈ ఆలయాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ ఆలయం వేద సంస్కృతిని ప్రోత్సహిస్తూ సమాజానికి సేవలు అందించే సాంస్కృతిక కేంద్రంగా రూపుదిద్దుకోనుందని చెప్పారు.అవసరమైన వారికి ఉచితంగా భోజనం అందించేందుకు మెగా అన్నదాన కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. యువతకు విలువల ఆధారిత విద్య, నైపుణ్యాభివృద్ధి కోర్సులు నిర్వహించడంతో పాటు గోశాలలో గోవుల సంరక్షణ, ఆధ్యాత్మిక మార్గదర్శకత్వం మరియు వేద సూత్రాల ఆధారంగా కుటుంబ సలహా సేవలు కూడా అందించనున్నారు.ఆలయ సముదాయంలో శ్రీ శ్రీ రాధా కృష్ణులు మరియు అష్టసఖి దేవతల ఆలయాలు ఏర్పాటు చేయబడతాయి. ఇది భక్తి మరియు ఆధ్యాత్మిక అభివృద్ధికి కేంద్రంగా మారనుంది.ఈ కార్యక్రమానికి దేవాదాయ మరియు అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ తదితర ప్రజాప్రతినిధులు మరియు ప్రముఖులు హాజరుకానున్నారు.ఈ శుభకార్యక్రమంలో పాల్గొని ఆలయ ఆధ్యాత్మిక వాతావరణాన్ని అనుభవించాలని ఇస్కాన్ ప్రతినిధులు ప్రజలను ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి ఇస్కాన్ ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, పోలీసు అధికారులు మరియు భక్తులు హాజరుకానున్నారు.ఈ విలేకరుల సమావేశంలో ఇస్కాన్ ప్రతినిధులు సిద్ధబలరామ్ దాస్, వెంకట దాస్, కృష్ణ స్మరణ్ దాస్, అలాగే సభ్యులు గోపరాజు శ్రీనివాస్, అరవింద్, సిద్ధేష్ మరియు దేవిసెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## చిమ్నాపూర్ నూతన పంచాయతీ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**ఎన్నికల వరకే రాజకీయాలు...అభివృద్ధి కోసం అందరూ కలసి పనిచేయాలి-ఎమ్మెల్యే చింత ప్రభాకర్**



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చి 6 (నేటి మన దేశమ్)** కంది మండలం చిమ్నాపూర్ గ్రామ పంచాయతీ నూతన భవనాన్ని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఘనంగా ప్రారంభించారు. స్థానిక గ్రామ సర్పంచ్ కృష్ణ గౌడ్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ గారు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి పంచాయతీ వ్యవస్థ ఎంతో కీలకమని అన్నారు. ఎన్నికలు ముగిసిన తర్వాత రాజకీయ విభేదాలను పక్కన పెట్టి గ్రామ అభివృద్ధి కోసం అందరూ కలసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజలు మనపై నమ్మకం ఉంచి ఆశీర్వదించి గెలిపించారని, వారి ఆశలు నెరవేర్చడం మన బాధ్యత అని పేర్కొన్నారు.నూతన పంచాయతీ భవనం ద్వారా గ్రామ ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని తెలిపారు. గ్రామ అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే గ్రామంలో స్కూల్ భవన నిర్మాణానికి కూడా పూర్తి సహకారం అందిస్తామని ఎమ్మెల్యే గారు తెలిపారు. గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు కలసికట్టుగా పనిచేస్తే గ్రామం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.అనంతరం గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరి రెడ్డి, కంది మండల్ అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ కొండల్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రభాకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాంచేందర్ నాయక్, ఆంజనేయులు, ఉప సర్పంచ్ మోతిలాల్, మాజీ జడ్పీటీసీ మనోహర్ గౌడ్ ,సుధీర్ రెడ్డి ,సాయిగౌడ్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మందమర్రి పట్టణాన్ని అభివృద్ధి చేయాలి- ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక



**మందమర్రి మార్చి 06: (నేటి మనదేశమ్):** మందమర్రి పట్టణంలో ప్రజా పాలన ప్రణాళిక ప్రణాళిక.99.రోజుల కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు మున్సిపల్ కార్యాలయంలో కార్యక్రమం నిర్వహించబడింది ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, స్థానిక ప్రజలు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమం ప్రారంభంలో ప్రజలకు నిబద్ధతతో సేవ చేయాలని మున్సిపల్ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించబడింది.ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ తుంగ పిండి రాజలింగు మాట్లాడుతూ, ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం ప్రజలకు సమర్థవంతమైన, పారదర్శకమైన మరియు వేగవంతమైన పరిపాలనను అందించడం అని తెలిపారు. రాబోయే 99 రోజులలో పట్టణ అభివృద్ధికి సంబంధించిన ముఖ్యమైన అంశాలైన పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, రహదారుల అభివృద్ధి, కాలువల నిర్వహణ, వీధి దీపాల ఏర్పాటు మరియు పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించబడుతుందని పేర్కొన్నారు.అదేవిధంగా ప్రజల సమస్యలను గుర్తించి వాటికి తక్షణ పరిష్కారాలు అందించేందుకు మున్సిపల్ శాఖలోని అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయనున్నాయని తెలిపారు. పట్టణ అభివృద్ధి మరియు ప్రజా సేవల మెరుగుదల కోసం ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సమర్థవంతంగా అమలు చేయడానికి మున్సిపల్ యంత్రాంగం కట్టుబడి ఉందని వెల్లడించారు.ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రజల భాగస్వామ్యం మరియు సహకారం అత్యంత ముఖ్యమని పేర్కొంటూ, అందరూ కలిసి పనిచేస్తే మన పట్టణాన్ని శుభ్రమైన, సుందరమైన మరియు అభివృద్ధి చెందిన పట్టణంగా తీర్చిదిద్దగలమని కమిషనర్ విశ్వాసం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఆఫీసర్ పి. కృష్ణ ప్రసాద్, మేనేజర్ టి. రాజేశ్వరి, సీనియర్ అసిస్టెంట్లు ఈ. రాజేశ్వరి, హెల్త్ అసిస్టెంట్ ఎం.ఏ. సమీర్, జూనియర్ అసిస్టెంట్లు వి. వసంత్, బి. ప్రదీప్, వినయ్ సామ్యూల్, బిల్ కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లు, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ ఎం. గోపి కృష్ణ, ఇన్‌చార్జ్ టి.యం.సి. ఎ. రఘురాం మరియు ఇతర మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ రాష్ట్రస్థాయి కరాటే పోటీలు



**కరీంనగర్, మార్చి 06: నేటి మన దేశమ్ ప్రతినిధి** ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ రాష్ట్రస్థాయి, ఇంటర్ స్టేట్ కరాటే చాంపియన్ షిప్ 2026 ఈ నెల మార్చి, 15వ తేది ఆదివారము స్థానిక ఆల్ఫోర్స్ ఇ-టెక్నో విద్యాసంస్థ కొత్తపల్లి, కరీంనగర్ లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ఈ మేరకు శుక్రవారం ఆల్ఫోర్సు విద్యాసంస్థల చైర్మన్ వి. నరేందర్ రెడ్డి చేతుల మీదుగా బ్రోచర్ విడుదల కార్యక్రమాన్ని ఆల్ఫోర్స్ విద్యాసంస్థలో జరిగినట్లు ఒకినావా కరాటే సంస్థల ఛీఫ్ ఇన్స్ట్రక్టర్ కె. వసంత్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వి. నరేందర్ రెడ్డి కరాటే ఇన్స్ట్రక్టర్లు వుల్లూరి శ్రీనివాస్, మొయిజుద్దీన్, తిరుపతి, రాజశేఖర్, రాకేష్ రెడ్డి, శివగణేశ్లు పాల్గొన్నట్లు టోర్నమెంట్ ఛీఫ్ ఆర్గనైజర్ కె. వసంత్ కుమార్ తెలిపారు.

## జిల్లా ప్రధాన న్యాయమూర్తిని మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా కలెక్టర్ అంకిత్.



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మార్చి 06, (నేటి మనదేశమ్),** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నూతన జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం జిల్లా ప్రధాన న్యాయ మూర్తి వసంత పాటిల్‌ను జిల్లా కోర్టు కార్యాలయం లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించినందుకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి వసంత పాటిల్ కలెక్టర్ అంకిత్‌కు శుభాకాంక్షలు తెలిపారు.జిల్లాలో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సూచించారు.

## జిల్లా మంత్రి జూపల్లిని కలిసిన శాలువాతో సత్కారంన కంది శ్రీనివాస్ రెడ్డి



**ఆదిలాబాద్ మార్చి 06: (నేటి మనదేశమ్):** జిల్లా పర్యటనకు వచ్చిన తెలంగాణ రాష్ట్ర టూరిజం,ఎక్సైజ్ అండ్ ప్రోహిబిషన్,జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు కు ఆదిలాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి ఘన స్వాగతం పలికారు.శుక్రవారం పట్టణంలోని పెన్ గంగా అతిథి గృహం వద్ద పార్టీ శ్రేణులతో కలిసి పుష్ప గుచ్ఛమందించి స్వాగతించారు .శాలువాలతో సత్కరించారు.నియోజకవర్గంలో పార్టీ స్థితిగతులపై చర్చించారు.ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యలపై టి యు డబ్ల్యు జే టీజేఎఫ్ ఆధ్వర్యంలో మంత్రి పొంగులేటి కి వినతి



**అధికారులతో చర్చించి సత్వరమే పరిష్కారానికి హామీ**

**ఖమ్మం మార్చి 06: (నేటి మనదేశమ్):** ఖమ్మం జిల్లాలో వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ టియుడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా అధికారులతో ప్రగతి ప్రణాళిక పై జరిగిన సమీక్ష సమావేశంలో రాష్ట్రం రెవిన్యూ శాఖ మంత్రిని కలిసిన టిజె యఫ్ నాయకులు , వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు తక్షణమే పంపిణీ చేయాలని , జర్నలిస్టులకు అక్రిడేషన్ కుదింపు చేసే జీవో నెంబర్ 252 సరిచేసి అర్హులైన వారందరికీ అక్రిడేషన్ ఇవ్వాలని కోరారు. గత ఎన్నో రోజులుగా తాము ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అనేకసార్లు విజ్ఞప్తి చేశామని గుర్తు చేశారు. అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ త్వరలో ఉన్నతాధికారులతో చర్చించి వాటి పరిష్కారానికి ఓ స్పష్టమైన నిర్ణయాన్ని తెలుపుతామని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి యూనియన్ నేతలకు హామీ ఇచ్చారు. వినతి పత్రం అందజేసిన వారిలో టియుడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా కార్యదర్శి చిర్రా రవి, ఉపాధ్యక్షులు బొల్లం శ్రీనివాసరావు, జిల్లా సహాయ కార్యదర్శి వెన్నబోయిన సాంబశివరావు, టెంజ్ జిల్లా కార్యదర్శి శెట్టి రజనీకాంత్, ఉపాధ్యక్షులు వెలుగు ప్రశాంత్ రెడ్డి, మందుల ఉపేందర్, జిల్లా సహాయ కార్యదర్శులు భాస్కర్, ఆర్ టి వి ఉదయ్, సిక్స్ టివి హరీష్, వల్లూరి సంతోష్,గుద్దేటి రమేష్, తోట గణేష్ తదితరులు పాల్గొన్నారు

## మల్కాజిగిరి డిగ్రీ కళాశాలలో 'ప్రజాపాలన-- ప్రగతి ప్రణాళిక'కు శ్రీకారం....



**నేరేడ్ మెట్ , మార్చి 06: (నేటి మనదేశమ్):** ప్రభుత్వ డిగ్రీ కళాశాల మల్కాజిగిరిలో 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాలకు శుక్రవారం ఘనంగా శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమాలు మార్చి 6 నుంచి 15 వరకు పది రోజులపాటు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బండి రాజు తెలిపారు.విద్యార్థుల్లో సామాజిక బాధ్యతా భావం పెంపొందించడం, కళాశాల పరిసరాల అభివృద్ధి, పరిశుభ్రతపై అవగాహన కల్పించడం కార్యక్రమాల ముఖ్య ఉద్దేశ్యమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమాల తొలి రోజున అధ్యాపకులు విద్యార్థులతో స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచడం, పరిసరాలను కాపాడడం, సామాజిక బాధ్యతతో వ్యవహరించడం వంటి అంశాలపై విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.అనంతరం అధ్యాపకులు కళాశాల పరిసరాలను పరిశీలించి పరిశుభ్రత, మౌలిక వసతులు, విద్యార్థులకు సంబంధించిన సమస్యలను గుర్తించారు. వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలపై చర్చించారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ బండి రాజు ఆధ్వర్యంలో సిబ్బందితో సమావేశం నిర్వహించి రాబోయే పది రోజుల కార్యక్రమాల కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు.

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from # 5-5-426, M.J. Road, Hyderabad and
Printed at SKYLINE PRESS, # D.No. 5-5-426, M.J. Road, Hyderabad - 500 001 . Ph: 24734846, 9701891645, E-mail: netimanadesam96@gmail.com